07-10Pg1exHMNWJQE1 gnt_07-10Pg1exHMNWJQE.qxd 10/6/2025 11:54 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 246 పేజీలు: 12 వెల: 6.50



ఫ్రెడ్ రామ్స్ డెల్ మేరీ ఇ.బ్రంకోవ్ షిమోన్ సకాగుచి

## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

2లో

రోగనిరోధక శక్తిపై పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

ఇద్దరు అమెరికన్లు, ఒకరు జపాన్ శాస్త్రవేత్త

## మోగిన బీహార్ నగారా

# రెండు దశల్లో ఎన్నికలు



సిఇసి జ్ఞానేష్ కుమార్

### నవంబరు 6, 11న పోలింగ్, 14న కౌంటింగ్

### షెడ్యూలు విడుదల చేసిన ఇసి

### తెలంగాణలోని జూబ్లీహిల్స్ సహా 7 రాష్ట్రాల్లో 8 సీట్లకు ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబరు 10న తొలి దశ నోటిఫికేషన్ విడుదల కానుండగా, అక్టోబర్ 13న రెండో దశకు నోటిషికేషన్ జారీ కానుంది. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. బీహార్‌తో ఏడు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13న నోటిఫికేషన్ జారీ కానుండగా, నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. షెడ్యూల్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఇసి వెల్లడించింది. సోమవారంనాడిక్కడ కేంద్ర ఎన్నికల కమిషన్ >>2

## పావలా వడ్డీకే

విద్యార్థులకు ప్రభుత్వం హామీ

అన్ని హాస్టళ్లు రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్పు

అన్ని వర్గాలు బలోపేతం కావాలి

సంక్షేమ శాఖల సమీక్షలో సింఎం చంద్రబాబు

# విదేశీ విద్యా రుణాలు



సోమవారం బిసి సంక్షేమ హస్టళ్లు, త్రిపుల్‌ఐటి విద్యార్థులతో సిఎం చంద్రబాబునాయుడు భేటీ అయిన దృశ్యం

**విజయవాడ, అక్టోబరు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని విద్యార్థులకు సిఎం నారా చంద్రబాబు నాయుడు మరోవరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని చెప్పారు. అలాగే దేశంలో ఐఐటి, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింప చేయాలని సూచించారు. ఇందులో 4 శాతం వడ్డీకే బ్యాంకురుణాలు ఇవ్వడంతోపాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని సిఎం చెప్పారు. 14 ఏళ్లలో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు ఇస్తామని అన్నారు. మరోవైపు బిసి విద్యార్థులు ఐఐటి, నీట్‌లో కోచింగ్ కోసం రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ సంక్షేమంపై మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఫరూఖ్, సవిత, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సిఎం చెప్పారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్లలో మౌలికవసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థి >>2

# సుప్రీం సిజెపై దాడికి యత్నం

**కోర్టు హాలులోనే షూ విసిరిన లాయర్**



లాయర్ కిషోర్ రాకేశ్ సిజెఐ బిఆర్ గవాయ్

### అతడిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది

### నన్ను ప్రభావితం చేయలేరు: చీఫ్ జస్టిస్ గవాయ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టులో ఇవాళ సిజెఐ బిఆర్ గవాయ్‌పై ఓ లాయర్ తన షూ విసిరేందుకు ప్రయత్నించారు. సిజెఐ కూర్చున్న డయాస్ వద్దకు ఓ లాయర్ వెళ్లి తన కాలుకున్న షూను తీసి, జడ్జీ మీదకు విసిరే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఓ కేసు వాదనల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే అక్కడే ఉన్న సెక్యూరిటి సిబ్బంది వెంటనే కలగజేసుకుని ఆ లాయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని బయటకు తీసుకెళ్లారు. ఆ లాయర్‌ను కిషోర్ రాకేశ్‌గా గుర్తించారు. కోర్టు రూమ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న సమయంలో ఆ లాయర్ సనాతన ధర్మంపై నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. సనాతన్ కా అప్మాన్ నహీ సహింగే సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదని ఆ లాయర్ అన్నారు. సిజెఐ గవాయ్ >>2

# పెట్టుబడులు పెంచండి

### టాటాగ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** టాటా గ్రూపు చైర్మన్ చంద్రశేఖరన్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలో భేటీ అయ్యారు. ఈ భేటీలో టాటా పవర్ రెన్యూవబుల్స్ సిఇఒ సంజయ్ కుమార్ బంగా, ఇండియా హోటల్స్ ఎండీ పునీత్ ఛత్వాల్, టాటా ఎలక్సి సిఇఒ మనోజ్ రాఘవన్, టాటా ఆటో కాంప్ సిఇఒ మనోజ్ కోల్హాత్కర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సిఇఒ >>2

# కల్తీ దగ్గుమందు రాష్ట్రానికి రాలేదు..



### ఔషధాల నాణ్యతపై నిరంతర నిఘా

### - ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 12 మంది చిన్నారుల మరణాలకు దారితీసిన కల్తీ దగ్గు మందు సదరు కంపెనీ నుంచి రాష్ట్రానికి సరఫరా కాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఔషధ దుకాణాలకు,ప్రభుత్వాసుత్రులకు సదరు కంపెనీ దగ్గు మందు పంపిణీ జరగలేదని వెల్లడించారు. తాజా పరిణామాలపై మంత్రి సత్యకుమార్‌కు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, రాష్ట్ర ఔషధ >>2



07-10pg2exHMNWJQEP 2_07-10pg2exHMNWJQEP.qxd 10/6/2025 11:56 PM Page 1






సోమవారం 'స్వచ్ఛతా అవార్డుల ప్రదానం' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## త్వరలో 100 స్వచ్ఛ రథాలు అందుబాటులోకి

### స్వచ్ఛత అవార్డుల కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

### జై స్వచ్ఛ సేవక్ అంటూ జై కొట్టించిన ముఖ్యమంత్రి

### పారిశుధ్య కార్మికులు వీరులే: సిఎం

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛత కోరుకునే ప్రతిఒక్కరూ సేవకులని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పరిశుభ్రతకు నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులని ఆయన తెలిపారు. స్వచ్ఛతను గాంధీజీ దైవంతో పోల్చారని గుర్తు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల్ని ఎప్పుడూ చిన్నచూపు చూడొద్దని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే స్వచ్ఛ ఉద్యమం లేదు, స్వచ్ఛ ఆరోగ్యం లేదని చంద్రబాబు నొక్కిచెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛతా అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ స్వచ్ఛతను పాటించడంలో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు చంద్రబాబు. 69 రాష్ట్రస్థాయి, 1,257 జిల్లాస్థాయి విజేతలకు అవార్డులు అందించారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, పరిశ్రమలు, స్కూళ్లు, ఆస్పత్రులు, స్వచ్ఛాంధ్ర సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు అవార్డులు ఇచ్చారు. మొత్తంగా 21 కేటగిరిల్లో స్వచ్ఛతా అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు..

అపరిశుభ్రంగా ఉంటే మనం ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. కానీ కార్మికులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని చెప్పారు. అందుకే వారంటే తనకు చాలా గౌరవమని స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు వారికి చేతులెత్తి నమస్కారం చేశారు. మొదటిసారి తాను ముఖ్యమంత్రి అయినప్పుడు పచ్చదనం పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు. స్వచ్ఛభారత్ ఏ విధంగా ఉండాలనే దానిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక కమిటీ ఏర్పాటు చేశారని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణపై సిఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. కంగ్రాట్స్ నారాయణ అంటూ సభాముఖంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పేరుకుపోయిన 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఏడాదిలోనే మొత్తం క్లీన్ చేసినందుకు మంత్రి నారాయణకు, మున్సిపల్ శాఖకు అభినందనలంటూ వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబర్ 2కు రాష్ట్రంలో 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ పేరుకుపోయి ఉందని గుర్తుచేశారు. ఏం చేస్తారో తెలియదు.. కానీ వచ్చే అక్టోబర్ 2కు మాత్రం చెత్త పూర్తిగా ఎత్తేయాల్సిందే.. ఎలా ఊడుస్తారో ఊడ్చుకోమన్నానని చెప్పినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. దృఢ సంకల్పంతో పనిచేసిన నారాయణకు అభినందనలు అంటూ.. ప్రశంసలు కురిపించారు. ఈ అక్టోబరు 2 కంటే 15 రోజుల ముందుగానే మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్తను విజయవంతంగా తొలగించారని సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మన ఇల్లు, మన ఊరు, మన వీధులను నిరంతరం శుభ్రంగా ఉంచుతోన్న పారిశుద్ధ్య కార్మికులకు వందనం అన్నారు. అపరిశుభ్రతను తరిమేసే వాళ్లు నిజమైన వీరులు అని అభినందించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనికులు టెర్రరిస్టులను ఏరి వేశారున్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేసే పారిశుద్ధ్య కార్మికులు కూడా వీరులే అన్నారు.

**రాత్రిపూట క్లీనింగ్ విధానం కూడా అమలు చేశాం**

గ్రీన్ పాస్ పోర్టు ద్వారా విద్యార్థులలో చెట్లు పెంచే అలవాటును పెంచుతున్నాం యూజ్ అండ్ త్రో పాలసీ కాదు... యూజ్‌రికవర్‌రీ యూజ్ పాలసీ అమలు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కొలుసు పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, పలువురు ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు.

## విదేశీ విద్యా రుణాలు

>> తులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బిసి బాలికల పాఠశాలను రూ.2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికి వందనం పథకం నుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు. సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనా ఉంటే వెంటనే విడుదల చేయాలన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగింది. ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెసుకునేందుకు మదింపు జరగాలన్నారు. ఆదరణ కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా, ఆయా కుల వృత్తులకు ఉపయోగకరంగా ఉండాలని సిఎం అన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సిఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్ లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా. అందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలాఅధికార యంత్రాంగం చూడాలని, సంతృప్తి పరచాలని సీఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బిసి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్ షాపు నిర్వహించాలని సూచించారు. బిసి రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో ఈ ఏడాది ట్రిపుల్ ఐటికి ఎంపికైన వారిలో కొందరు విద్యార్థులు సమీక్షా సమావేశానికి ముందు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## రెండు దశల్లో ఎన్నికలు

>> ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి మీడియాతో మాట్లాడుతూ... బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు ఇసి పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వివరించారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం 4.53 లక్షల మందిని వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)తో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సమాధానమిచ్చారు.

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు 38, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు 2 ఉన్నాయి. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. 1,725 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లున్నారు. 14 లక్షల మంది తొలి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వందేళ్లు పైబడి వయస్సున్న ఓటర్లు 14 వేల మందికి పైగా ఉన్నారని ఇసి పేర్కొంది. తొలి దశలో 121 స్థానాలకు, రెండో దశలో 122 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరుగనుంది. బీహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతోనే నవంబర్ 16కు ప్రక్రియ ముగించేలా కార్యాచరణ రూపొందించినట్లు ఇసి ప్రకటించింది.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 11న బీహార్ అసెంబ్లీ పోలింగ్ రెండవ దశతో పాటు ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సిఇసి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. నవంబర్ 14న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు ఉప ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, తెలంగాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల్లో ఖాళీ అయిన 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు బైఎలక్షన్స్ జరుగనున్నాయి.

మరోవైపు రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పటడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, దీంతో ఈ 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల కోసం ఇసి షెడ్యూల్ జారీ చేసింది.

## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** వైద్య రంగంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది. రోగనిరోధక వ్యవస్థ (పెరిఫిరల్ ఇమ్యూన్ టోలరెన్స్)పై పరిశోధనలకు గాను మేరీ ఇ.బ్రుంకోవ్, ఫ్రెడ్ రామ్స్ డెల్, షిమోన్ సకాగుచిలు అత్యున్నత అవార్డుకు ఎంపికయ్యారు. వారు చేసిన పరిశోధనలు క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ రోగాలకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతున్నాయి. నోబెల్‌కు ఎంపికైన వారికి డిప్లొమా, బంగారం పతకంతో సహా 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్‌లు (సుమారు రూ.10.38 కోట్లు) అందిస్తారు. ఈ మేరకు నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓల్లీ కాంపె ఒక ప్రకటనలో వెల్లడించారు. నోబెల్ పురస్కారం అందుకున్న వారిలో ఇద్దరు అమెరికన్లు, ఒక జపాన్ శాస్త్రవేత్త ఉన్నారు. మేరీ ఇ బ్రుంకోవ్ అమెరికాలోని సియాటెల్‌లో ఉన్న ఇన్సిటిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయోలజీలో, ఫ్రెడ్ రామ్స్‌డెల్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న సోనోమా బయోథెరపాటిక్స్‌లో పనిచేస్తున్నారు. షిమోన్ సకాగుచి జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంలో ముగ్గురు పరిశోధకులు కీలక విషయాలను గుర్తించారు. శరీరంలోని అత్యంత శక్తివంతమైన రోగనిరోధక వ్యవస్థను నియంత్రించాల్సి ఉంటుందని, లేదంటే ఆ వ్యవస్థ మన శరీర అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. రోగనిరోధక వ్యవస్థ శరీరాన్ని దెబ్బతీయకుండా ఉండే పెరిఫరల్ ఇమ్యూన్ టాలరెన్స్ గురించి ముగ్గురు శాస్త్రవేత్తలు స్టడీ చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. రోగనిరోధక వ్యవస్థలో సెక్యూర్టీ గార్డుల్లా పనిచేస్తున్న రెగ్యులేటరీ టీ కణాల గురించి శాస్త్రవేత్తలు ఆవిష్కరణ చేశారు. ఈ టీ కణాలు మన శరీరంపై ఇమ్యూన్ కణాలు దాడి చేయకుండా నివారిస్తాయని గుర్తించారు. టీ కణాల అధ్యయనంవల్ల మన రోగనిరోధక వ్యవస్థ పనితీరు విధానంఅర్థమవుతుందని, దీనివల్ల ఆటోఇమ్యూన్ వ్యాధులు ఎందుకు డెవలప్ కావడంలేదన్న విషయం తెలుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## సుప్రీం సిజెపై దాడికి యత్నం

>> మాత్రం ఆ ఘటన పట్ల ఎటువంటి అధైర్యానికి లోనుకాలేదు. కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని కోరారు. ఇలాంటి వాటి వల్ల ఎవరూ విచలితులు కావొద్దు అని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని సిజెఐ గవాయ్ పేర్కొన్నారు. అయితే కొన్ని రోజుల క్రితం సిజెఐ గవాయ్ ఓ కేసులో చేసిన వ్యాఖ్యల వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఖజురహోలోని ఏడు అడుగల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన కేసులో సిజెఐ గవాయ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును ఆయన డిస్మిస్ చేస్తూ వెళ్లి ఆ దేవుడినే అడుక్కోవాలని కామెంట్ చేశారు. విష్ణువుకు వీరభక్తుడిని అని చెప్పుకుంటున్నావు కాదా, వెళ్లి ఆ దేవుడినే ప్రార్థించుకో, అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఎఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సిజెఐ వ్యాఖ్యానించారు. ఖజురహో కేసులో సిజెఐ గవాయ్ చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో తీవ్ర దుమారం చెలరేగింది. మతపరమైన భావాలను కించపరిచినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ వివాదానికి ఆయన తనదైన స్టయిల్‌లో తెరదించారు. రెండు రోజుల తర్వాత ఓ కేసులో స్పందిస్తూ తానేమీ ఏ మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సిజెఐకి అండగా నిలిచారు. సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయన్నారు.

## మీపై దాడి భారతీయులను ఆగ్రహానికి గురిచేసింది

### చీఫ్‌జస్టిస్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై షూ దాడిని ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. భారత సిజెఐపై దాడికి యత్నించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన సిజెఐతో మాట్లాడారు. మన సమాజంలో ఇలాంటి అనైతికమైన చర్యలకు తావు లేదని మోడీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌తో మాట్లాడాను. ఈరోజు ఉదయం సుప్రీంకోర్టు ఆవరణలో ఆయనపై జరిగిన దాడి భారతీయులను ఆగ్రహానికి గురి చేసింది. ఇలాంటి అనైతికమైన ఆమోదయోగ్యంకాని చర్యలకు మన సమాజంలో చోటు లేదు. సీజేఐపై దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని మోడీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

## స్వచ్ఛతలో దేశాన్ని అగ్రగామిగా నిలపడమే

## ప్రధాని మోడీ సంకల్పం

### రూ.96 వేల కోట్లతో పారిశుధ్య పనులు: మంత్రి సత్య కుమార్ యాదవ్

**శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 06, ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంను పారిశుద్ధంలో అగ్రగామిగా ఉంచాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పించుకున్నారని, అందుకోసం దేశ వ్యాప్తంగా 96 వేల కోట్ల రూపాయలతో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి పట్టణంలో శిల్పారామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఇప్పటివరకు 96 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కు ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. దేశవ్యాప్తంగా 17 విభాగాల్లో సర్వేచేయగా అందులో రాష్ట్రానికి రెండు అవార్డులు దక్కడం విశేషమన్నారు. జిల్లాస్థాయిలో అవార్డులకు ఎంపికైన 47 మందిని అభినందించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రిఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తాము నివసించే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే పరిశుభ్రతను పాటించడం ఒక బాధ్యతగా అలవాటుచేసుకోవాలన్నారు. తద్వారా పిల్లలకు డయేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. పిల్లలు డయేరియా బారిన పడితే ఎదుగుదలతో పాటు ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడే అవకాశం ఉంటుందన్నారు.

గత 10 సంవత్సరాలలో డయే రియా, దోమకాటు వల్ల దాదాపు 60 వేల మందిని రక్షించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. గతంలో బహిర్భూమికి వెళ్లాలంటే అక్క చెల్లెమ్మలు సూర్యోదయం మునుపు, సూర్యా అస్తమయం తర్వాత వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉండేదన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో 12కోట్ల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిం చడం జరిగిందని, తద్వారా అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ఈ కార్యక్రమం ఎంత గానో దోహద పడిందన్నారు.

### వారం - వర్జ్యం

07-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
○పౌర్ణమి ఉ.9.16, కృ.పాడ్యమి తె.5.54
రేవతి రా.1.26
వర్జ్యం : రా.7.11-8.27
దు.ఉ.8.22-9.10
ఉ.6.30-7.15
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఆరోగ్యం, వాహనాల విషయంలో కాస్త మెలుకువలోన వ్యవహరించండి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** మాట పట్టింపులో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు

**సింహం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** నూతన పెట్టుబడుల విషయంలో మెలుకువతో వ్యవహారించండి.

**తుల :** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులకు పదోన్నత పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి.

**ధనుస్సు:** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు.

**మకరం:** క్రమశిక్షణను పాటించడం వలన లాభపడుతారు.

**కుంభం:** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు.

**మీనం :** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు

### పైడిమాంబను దర్శించుకున్న

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**విజయనగరం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గజపతుల ఆడపడుచు శ్రీపైడితల్లి అమ్మవారిని మాన్సాస్ ఛైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. సంప్రదాయానుసారం అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా కోట నుంచి బయలుదేరి, మేళ తాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాన్ని చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. పైడిమాంబకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయఅధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అశోక్ గజపతిరాజు దంపతులకు ఆలయ పూజారులు ఆశీర్వచనం పలికి, అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు కుమార్తె, విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**యేడాదిలోగా ఆలయ అభివృద్ధి పనులు:**

ఏడాదిలోగా పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అశోక్ గజపతిరాజు అన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే అభివృద్ధి పనులను మొదలు పెట్టామని, వచ్చే ఏడాది అమ్మవారి పండగ లోపల అవన్నీ పూర్తవుతాయని చెప్పారు. పైడితల్లి అమ్మవారు ప్రజలందరిని చల్లగా చూడాలని ఆయన ఆకాంక్షించారు.

## కల్తీ దగ్గుమందు రాష్ట్రానికి రాలేదు..

>> నియంత్రణ పరిపాలనా ఇంచార్జి డైరెక్టర్ జనరల్, రాష్ట్ర వైద్య సేవలు మోలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరిషా నివేదికలు అందచేశారు. కల్తీ దగ్గు మందు జాడ రాష్ట్రంలో లేనందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనలు అనుసరించి, రెండేళ్లలోపు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో వైద్యులు మందులు సూచించొద్దని ఆదేశాలు పంపాలని అధికారులకు తెలిపారు. 'ఔషధ దుకాణాల వారికి సదరు కంపెనీ దగ్గు మందు సరఫరా జరిగినట్లు ఆనవాళ్లు డ్రగ్ ఇన్స్పెక్టర్ల తనిఖీల్లో కనిపించలేదు. సదరు కంపెనీ నుంచి దగ్గు మందు పంపిణీ జరిగినట్లు దుకాణాల వారి వద్ద ఇన్వాయిస్‌లు కనిపించలేదు. దగ్గు మందు బాక్సులు దుకాణాల్లో కనిపించలేదు. డ్రగ్ ఇన్స్పెక్టర్ల ద్వారా తనిఖీల పరంపర ఇంకా జరుగుతూనే ఉంది. ఔషధ నియంత్రణ పరిపాలనా డైరెక్టర్ జనరల్ ప్రధాన కార్యాలయంలోని అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షిస్తోంది" అని ఇంచార్జి డైరెక్టర్ జనరల్ గిరిషా ఆ నివేదికలో పేర్కొన్నారు. "ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసేందుకు కొనుగోలుచేసే మందుల్లో సదరు కంపెనీ కల్తీ మందు లేదు. రాష్ట్రంలో 4 రకాల కంపెనీల దగ్గుమందులు వాడుతున్నాం. కాంబినేషన్ ఫార్ములేషన్ కాకుండా సింగిల్ మాలిక్యూల్ సిరప్ మా సంస్థ ప్రభుత్వాసుపత్రులకు పంపిణీ చేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలలో కాంచీపురంకి చెందిన కంపెనీ శ్రీశాన్ ఫార్మస్యూటికల్స్ నుంచి కోల్డ్రిఫ్ దగ్గు మందు కాంబినేషన్ రూపంలో సరఫరా జరిగింది. ఈ క్రమంలో డైఇథిలిన్ గ్లైకాల్ నిర్దిష్ట ప్రమాణాల కంటే అధిక మోతాదులో వాడిన కల్తీమందు ఆ రాష్ట్రాల్లో సరఫరా జరిగింది"అని రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరిషా నివేదికలో వివరించారు.

## పెట్టుబడులు పెంచండి



సోమవారం టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

>> సుకరన్ సింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ రణధీర్ ఠాకూర్, టాటా కెమికల్స్ ఎండీ ఆర్.ముకుందన్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సిఇఒ వినాయక్ పాయ్, ఎస్ టి టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ సిఇఒ బిమల్ ఖండేల్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో రాష్ట్ర అగ్రనేతల సమక్షాన ఈ నెలలో నిర్వహించనున్న టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధి చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే మార్గాన్ని అన్వేషించాలని, రాష్ట్రంలో సెల్, మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ స్థాపనకు గల అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో టాటా ఎల్క్సి రీజనల్ ఆఫీస్/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, తూర్పుతీరంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించండి. ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్ వేర్ డిఫైండ్ వెహికిల్స్, అటానమస్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీస్, ఆధారిత మొబిలిటీ, మెడ్‌టెక్ ఇన్నోవేషన్‌ల వంటి రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించండి. టాటా ఆటోకాంప్ ఆధ్వర్యాన శ్రీసిటీలో ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన కంపోజిట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించే అవకాశాలను అన్వేషించండి. ఇందుకు అవసరమైన భూమి, ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రభుత్వం అందిస్తుంది. పెట్టుబడి పరిమాణాన్ని ఆధారంగా తీసుకుని ఇవి, ఎలక్ట్రానిక్ భాగాల తయారీ విధానంలో ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. శ్రీసిటీలో ఇంజనీరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అవకాశాలను పరిశీలించండి. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ నేతృత్వాన ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తి యూనిట్‌ను స్థాపించడానికి అవకాశాలను అన్వేషించండి. రక్షణ, భద్రతా వ్యవస్థల రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటులో ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించండి. టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్‌లో ఒసాట్ సదుపాయం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించండి. ఇందుకోసం అవసరమైన భూమిని కోరుకున్న ప్రదేశంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ కింద అందించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## 'అమరావతి పోలవరం - స్వర్ణాంధ్ర 2047కు మూల స్తంభాలుగా నిలుస్తాయి'

**సచివాలయం,అక్టోబరు 6,ప్రభాతవార్త :** ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో అమరావతి మరియు పోలవరం అభివృద్ధి రాష్ట్రం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాన స్థంభాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర 20సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ దిశగా భారత ప్రధానమంత్రి వికసిత్ భారత్ 2047 సంకల్పంతో సయోధ్యగా రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. సోమవారం సచివాలయంలో రాజస్థాన్ ప్రణాళిక శాఖ అధికారులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రాజధాని అవసరం ఏర్పడిందని అందుకనుగుణంగా ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అమరాతిని రాజధాని నగరంగా ఎంపిక చేశారని తెలిపారు. ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ పోస్టర్ అండ్ పార్ట్నర్స్ రూపొందించిన 217 చకిమీవిస్తీర్ణంలో మాస్టర్‌ప్లాన్ ద్వారా అమరావతి ఒక ఆధునిక, సుస్థిర,ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దబడుతోందని చెప్పారు.

**ENDOWMENTS DEPARTMENT**
**SRI KRISHNALAYAM**
Pulivendula(T&M), Kadapa District
e- Procurement Tender
NIT.No.P/COE/446/2024 Dt:11.3.2024
E- Tenders are invited through the e-Procurement portal for **Construction of Dyana Mandiram on the South Side of the Main Temple**. Interesteed bidders May Visit the Official website **www.apeprocuremednt.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

07-10Pg3 GNT 3_07-10Pg3 GNT.qxd 10/7/2025 12:59 AM Page 1



# కొండచరియలు జారకుండా

## తిరుమల ఘాట్‌రోడ్డులో 'రాక్‌బోల్టింగ్, రాక్ ఫెన్సింగ్'



**ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:** భారీ వర్షాలు కురిసినా...ప్రకృతి వైపరీత్యాలతో వరదలొచ్చినా శేషాచలంకొండల్లోంచి బండరాళ్ళు ఘాట్‌రోడ్డుపై జారిపడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐఐటి చెన్నై,ముంబై నిపుణుల సూచనలతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించిన టిటిడి ఇంజనీరింగ్ విభాగం అక్కడ తగిన రాక్‌బోల్టింగ్ విధానాన్ని అమలుచేసింది. ఇంకా అక్కడ రాళ్ళస్థితి, మట్టిరకం, రహదారి ఎత్తు వంటి పరిస్థితులను అంచనా వేసి తగిన బోల్టింగ్ డిజైన్ అమలుచేస్తున్నారు. ఈ తిరుమల రెండోఘాట్‌లో దాదాపు రాక్‌బోల్టింగ్ పనులు, రాక్ ఫెన్సింగ్ పూర్తికావస్తోంది. ఈ విధానంలో కొండగోడలలో ఉక్కుబోల్టులు బిగించి వాటిని కాంక్రీటులతో బలంగా ఉండేలా చూస్తున్నారు. ఆపై వాటిచుట్టూ ఇనుప వలలు బిగిస్తున్నారు. దీనివల్ల కొండల్లోని రాళ్ళు వానలొచ్చినా కదలకుండా ఉంటాయి. ఈ సాంకేతిక పనులతో భవిష్యత్తులో బలమైన వర్షాలు కురిసినా,వరదలు వచ్చినా కొండల్లోంచి మట్టి,బండరాళ్ళు జారడానికి అవకాశం లేకుండా టిటిడి ఇంజనీరింగ్ గట్టి చర్యలు చేపడుతోంది. గత మూడునాలుగునెలలుగా తిరుపతి నుండి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో రక్షణగోడలు మరమ్మతులు చేయడం, బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని తెలిసిన చోట్ల ఐఐటి నిపుణుల సూచనలతో బలమైన ఇనుపకంచెలా వేసి పూర్తిగా ఆ ప్రాంతాన్ని కప్పేస్తున్నారు. వర్షాలకు బండరాళ్ళు జారినా ఈ వలలోపలే చిక్కుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో ఎడతెరపి లేకుండా వరుసగా రెండుమూడురోజులు జోరువానొస్తే కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందనే భయం అటు టిటిడి అధికారుల్లో ఇటు భక్తుల్లో ఉండేది. తిరుమలకు చేరుకునే రెండోఘాట్ ప్రమాదకరమని, ఈ మార్గంలో కొన్నిచోట్ల మట్టిజారిపడి బండరాళ్ళు పడేప్రమాదం లేకపోలేదని దశాబ్ధకాలంక్రిందటే ఐఐటి నిపుణులు, ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరించారు. రెండోఘాట్‌లో దాదాపు కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని గుర్తించిన ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అధికారులు గోడలను ఎత్తు పెంచడం, ఇనుప కంచెగ్రిల్స్ వేయడం చేశారు. ఇప్పుడు కొండల్లో ఎక్కడ బండరాళ్ళు జారుతాయనేది గుర్తించిన నిపుణుల సూచనలతో రెండోఘాట్‌లో అలిపిరి వినాయకస్వామి గుడి దాటిన తరువాత లింకురోడ్డు మధ్య వరకు కొండచరియలు విరిగి పడే ప్రాంతాలను సూచాయప్రాయంగా గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు అందుకు తగ్గట్లు పనులు సాగిస్తున్నారు. శేషాచలం కొండల్లో దట్టమైన అటవీప్రాంతాన్ని విడదీసి నాలుగుదశాబ్ధాల క్రిందట రోడ్డుమార్గం నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం ,ప్రస్తుత పరిస్థితుల్లో ఘాట్‌లో భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించింది.తిరుమలకు రెండవ ఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్లు అటవీప్రాంతంలోనే ఉంది. ఇందులో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో చాలావరకు ప్రమాదకర మలుపులు, పూర్తిగా కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు గుర్తించారు. 2014వ సంవత్సరంలో, ఆ తరువాత 2021 నవంబర్-డిసెంబర్‌నెలల్లో భారీ వరదలు రావడంతో వరదనీటి ఉధృతికి తిరుమలకొండలపై నుంచి వరదనీరు ప్రవాహానికి మట్టికొట్టుకువచ్చి రెండోఘాట్ పూర్తిగా దెబ్బతింది.

## సిఎం పర్యటనకు ముందే వ్యవసాయ కళాశాలకు బాంబు బెదరింపు

### - అప్రమత్తమైన పోలీసులు

**తిరుపతి,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతిజిల్లా స్వగ్రామం నారావారిపల్లి పర్యటనకు 24 గంటలు ముందుగానే హెలిప్యాడ్ ఎస్వీ వ్యవసాయకళాశాలలో బాంబులు పెట్టామనే నకిలీ మెయిల్ పోలీసులును పరుగులు తీయించింది. అప్పటికే హెలిప్యాడ్ ప్రాంగణంలో పోలీసులు భద్రతపరంగా మొహరించినా అనుమానాస్పదంగా వచ్చిన మెయిల్‌తో పోలీసులు,వ్యవసాయకళాశాల యాజమాన్యం ఆందోళన చెందింది. సోమవారం ఉదయం నకిలీ మెయిల్‌తో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మరింత అప్రమత్తమయ్యారు. వెంటనే బాంబ్‌డిస్పోజల్ టీమ్, పోలీసు జాగిలాలను రంగంలోకి దించి అణువణువూ తనిఖీ చేశారు. అయితే ఎక్కడా ఎలాంటి బాంబులుగానీ, ఆర్డీఎక్స్ ప్రేలుడుపదార్థాలుగానీ లేవని తేల్చారు. దీంతో సిఎం పర్యటనలో మంగళవారం ఉదయానికి హెలిప్యాడ్ స్థలాన్ని కూడా ముందుజాగ్రతగా నారావారిపల్లి సమీపంలోని ఎ.రంగంపేటకు పోలీసు యంత్రాంగం మార్పుచేసింది. మొత్తంమీద తిరుపతి జిల్లాలో, కేంద్రంలో వరుసగా నకిలీ మెయిల్స్ మాత్రం పోలీసులకు కునుకులేకుండా చేస్తోంది.

# తిరుమల సమాచారం

## నేడు పౌర్ణమి గరుడసేవ



**తిరుమల,అక్టోబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి:** ఆశ్వయుజమాసం పౌర్ణమిగరుడసేవ మంగళవారం సాయంత్రం తిరుమలలో జరగనుంది. ప్రతినెలా పౌర్ణమికి మలయప్పస్వామికి గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీ, మంగళవారం సాయంత్రం 7గంటలకు మలయప్పస్వామిని గరుడునిపై కొలువుదీర్చి ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. కాగా పదిరోజుల వ్యవధిలో మళ్ళీ గరుడవాహనసేవ తిరుమలలో జరగనుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసంలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎవి రవీంద్రబాబు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## షిర్డీ యాత్రికుల కోసం తిరుపతి నుండి రెగ్యులర్ రైలు

### - అన్ని వర్గాలకు ప్రయోజనకరంగా ప్రయాణం



**తిరుమల,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి నగరం నుండి మరో పుణ్యక్షేత్రం షిర్డీకి రైల్వేశాఖ రెగ్యులర్‌గారైలును నడుపుతోంది. ఈ రైలును ఇటీవల పూర్తిస్థాయిలో యాత్రికుల సౌలభ్యంకోసం మార్పుచేస్తూ రైల్వే అధికారులు షెడ్యూల్ ఖరారుచేశారు. సిఎం చంద్రబాబు కోరికతో రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుని తిరుపతి-షిర్డీ మధ్య రెగ్యులర్‌రైలును నడిపేలా చూసింది. భక్తుల నుండి వస్తున్న డిమాండ్‌తో ,విజ్ఞప్తి మేరకు 07637/07638 నంబర్లతో నడుస్తున్న రైలును రెగ్యులర్ సర్వీస్‌గా మార్చింది. రెండు పుణ్యక్షేత్రాల మధ్య యాత్రికులు సులభంగా దేవుళ్ళ దర్శనం చేసుకునేలా చూస్తోంది. తిరుపతి నుండి బయలుదేరే ఈ రైలు రేణిగుంట, ధర్మవరం, రాయచూర్, షోలాపూర్, దౌండ్ వంటి ప్రధాన స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ రైలు రెగ్యులర్‌గా చేయడంతో షిర్డీకి వెళ్ళే యాత్రికులకు మరింత సులభప్రయాణం కానుంది. అంతేగాక ఈ రైలు తిరుపతినుండి బయలుదేరిన తరువాత రేణిగుంట, గూడూరు, నెల్లూరు,ఒంగోలు, చీరాల,తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నడికుడిలో ఆగుతుంది.తెలంగాణరాష్ట్రంలో మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్‌ల రైల్వేస్టేషన్‌లలోనూ ఆగుతుంది. రెగ్యులర్‌గా నడవడం వల్ల షిర్డీ-తిరుపతి మధ్య ప్రయాణీకులకు ముందుగానే తమ యాత్ర ప్రణాళిక సిద్ధంచేసుకునే వీలుకలిగింది. సాధారణ బోగీలతో బాటు ఏసి కోచ్‌లు కలిగి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

## తెలుగు రాష్ట్రాల మీదుగా తిరుపతి వెళ్లే ప్రత్యేక రైళ్లు తిరుచానూరు వరకు..

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 06, ప్రభాత వార్త:** వివిధ ప్రాంతాల నుండి తెలుగురాష్ట్రాలమీదుగా తిరుపతివెళ్ళేపలు ప్రత్యేక రైలు సర్వీసులను తిరుచానూరు వరకే నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్‌తిరుచానూరు సికింద్రాబాద్ ల మధ్య తిరిగే నెంబర్ 07009/10 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను ఈనెల 09 నుంచి, నాందేడ్ తిరుచానూరునాందేడ్ మధ్య తిరిగే నెంబర్ 07015/16 రైలును ఈనెల 11 నుంచి, చర్లపల్లి సికింద్రాబాద్‌చర్లపల్లి మధ్య తిరిగే నెంబర్ 07017/18, జాల్నాతిరుచానూర్ జాల్నా మధ్య తిరిగే నెంబర్ 07609/10, చర్లపల్లితిరుచానూరుచర్లపల్లి మధ్య తిరిగే నెంబర్ 07251/52 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను తిరుపతి నుంచి కాకుండా తిరుచానూరు వారికే నడుపుతున్నామన్నారు.

## పలువురు ఐపిఎస్‌ల రిటైర్మెంట్ జాబితాను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలువురు ఐపీఎస్ ల రిటైర్మెంట్ జాబితాను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు.ఇందుకు సంబంధించిన వివరాలను అనుసరించి 1990 బ్యాచ్ కు చెందిన అంజనీ కుమార్. 31.01.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 1991 బ్యాచ్ కు చెందిన మాదిరెడ్డి ప్రతాప్. 30.06.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 1992 బ్యాచ్ కు చెందిన పి. సీతారామాంజనేయులు. 31.08.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 1992 బ్యాచ్ కు చెందిన కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి. 30.04.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 1993 బ్యాచ్ కు చెందిన పీవీ సునీల్ కుమార్. 30.06.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసారు. 1994 బ్యాచ్ కు చెందిన ఎన్. బాలసుబ్రమణ్యం. 31.10.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 2005 బ్యాచ్ కు చెందిన జి.. పాల్ రాజు. 31.01.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 2015 బ్యాచ్ కు చెందిన కె.ఎస్.ఎస్.వి. సుబ్బారెడ్డి. 31.03.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు.

## కల్తీ మద్యం మాఫియాకు మూల విరాట్ జగనే

### టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యం మాఫియాకు మూల విరాట్ జగనే అని టీడీపీ ఎమ్మెల్సీ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. గత 5 ఏళ్ల వైఎస్సార్సీపీ పాలనలో కల్తీ మద్యంతో జగన్ మద్యం మాఫియా ముఠా రూ. 3,500 కోట్లు కొల్లగొట్టారని దుయ్యబట్టారు. గత 5 ఏళ్ల కల్తీ మద్యంతో పేదల ప్రాణాలు తీసి, మహిళల పుస్తెలు తెంచి ఆ పాపపు సొమ్ము తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నేడు కల్తీ మద్యం వ్యవహారంలో బాధ్యులపై సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. నాడు కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన వైఎస్సార్సీపీ నేతలపై జగన్ ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు.

గతంలో విజయవాడలో వైఎస్సార్సీపీ నేత మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి 6 మంది ప్రాణాలు కోల్పోతే ఏం చేశారని ప్రశ్నించారు.

వైఎస్సార్సీపీ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది ప్రాణాలు కోల్పోతే బాధ్యులపై జగన్ ఏం చర్యలు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మేధోమథనంతో మరింత మెరుగైన సేవలు

### - పౌర సేవల్లో సంతృప్తి స్థాయే ముఖ్యం - వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెరగాలి: సిఎం చంద్రబాబు



**విజయవాడ అక్టోబరు 6, ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌర సేవలు మరింత మెరుగు పరిచేందుకు అధికారులు మేధోమథనం జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పౌర సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆర్టీజీఎస్, పౌర సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి, సీఎస్ కే.విజయానంద్, ఐటీ, ఆర్టీజీఎస్, సీఎంఓ ఉన్నతాధికారులు హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవల్లో ప్రజల సంతృప్త స్థాయి పెంచడంపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రజల నుంచి ఐవీఆర్ఎస్‌తో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా వెల్లడిస్తున్న అభిప్రాయాల్లో సానుకూలత ఏ స్థాయిలో ఉంది, అసంతృప్తి ఎక్కడెక్కడ ఉందన్న సమాచారాన్ని క్రోడీకరించాలని సూచించారు. తద్వారా సమస్య మూలాలను కనుగొని వాటిని వేగంగా పరిష్కరించటం ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరుచుకోవచ్చని సీఎం పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ డేటా లేక్‌లో అపారమైన సమాచారం నిక్షిప్తమై ఉందని తద్వారా డేటా ఆధారిత నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రం యూనిట్‌గా ప్రభుత్వం 19 విభాగాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రతీ రోజూ దృష్టి సారించాలని అలాగే ప్రతీ 15 రోజులకూ ఒకసారి సమాచార సేకరణ చేయాలని సూచించారు. వీటిపై ప్రతీ నెలా ఆడిట్ నిర్వహించి ప్రతీ మూడు నెలలకూ ఓ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. దీనికోసం రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గం స్థాయిలో సమాచారం తీసుకుని విశ్లేషించాలని పేర్కొన్నారు. 15 నెలలుగా ప్రజల్లో సంతృప్తి స్థాయి క్రమంగా మెరుగు పడుతోందని ఇది మరింత పెరగాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవల్లో ప్రజలు ఎలా స్పందిస్తున్నారన్నదే ప్రధాన అంశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నిర్వాకం కారణంగా రెవెన్యూ రికార్డులు తారుమారై వివాదాలు పెరిగాయని... వాటిని సరిచేస్తున్నట్టు సీఎం తెలిపారు. ప్రజలకు అందిస్తున్న సేవల ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతృప్త స్థాయిని పెంచుకోవాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖలు, అధికారులు, ఉద్యోగుల పనితీరు విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో నైపుణ్యాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో కొందరు సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందడం లేదని, అలాంటివారి అర్హతలు పరిశీలించి వారు కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు పొందేలా చూడాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్న 730 సేవల వినియోగం మరింతగా పెంచేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా సులభంగా అందుతాయనే భావన ప్రజల్లో విస్తృతమైతే ఎక్కువగా వినియోగించే ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి తగినట్టుగా ప్రజల్లో అవగాహన మరింత పెంచాలని సూచించారు. డ్రోన్ల వినియోగానికి సంబంధించి ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రైవేటు వినియోగం కూడా పెరిగేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య రంగంతో పాటు వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. డిసెంబరులో డ్రోన్ షో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 16 తేదీన ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు వస్తున్న దృష్ట్యా డ్రోన్ సిటీకి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. సీసీ కెమెరాలను ట్రాఫిక్ సహా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.

## తిరుమల ఆలయ సంప్రదాయాలపై మళ్లీ మాటల యుద్ధం

### - ఆలయ పవిత్రతను ధ్వంసం చేశారన్న భూమన
### - ఆనవాయితీని అపచారమనడం సిగ్గుసిగ్గు.. భానుప్రకాశ్

**తిరుపతి,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతిదేవస్థానం సంప్రదాయాలు, ఆలయ మర్యాదలపై మళ్ళీ మాటలయుద్ధం మొదలైంది. అటు వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయడంతో ఇలాంటివన్నీ గత ఐదేళ్ళ తప్పిదాలు సమయంలో కనబడలేదా?అంటూ ప్రస్తుత బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి సేవకుడిగా సేవలందిస్తున్నారు. ఆయనకు గత నెలలో తండ్రిని కోల్పోవడంతో జరిగిన పెద్దకర్మ అనంతరం టిటిడి తరపున సంప్రదాయంగా ఆయన నివాసానికి వెళ్ళి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఆలయ అర్చకులు పరివట్టం కట్టడం, వేదాశీర్వచనంచేయడం, ప్రసాదాలు అందజేశారు. ఇదంతా ఆలయ సంప్రదాయంగానే సాగింది. అయితే శ్రీవేంకటేశ్వరస్వామి సేవకుడిగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలయ మర్యాదలను మంట గలుపుతున్నారని మాజీ టిటిడి ఛైర్మన్,వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి దాన్ని రాద్ధాంతం చేస్తూ సోమవారం తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ బిఆర్‌నాయుడు పట్ల వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆయన వ్యవహారాలు, ఎప్పుడు ఎలా ఉండాలో తెలియక ఆలయ మర్యాదలను మంటలో గలుపుతున్నారని విమర్శించారు. వెంకయ్యచౌదరిని పరామర్శించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోందని అన్నారు. అయితే ఈ విమర్శలను బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తప్పులు చేయడం, తప్పుడు మాటలు మాట్లాడటం కరుణా కర్‌రెడ్డికి అలవాటైపోయిందని ఎద్దేవాచేశారు. 2023లో అప్పటి టిటిడి ఇఒ ధర్మారెడ్డి కుమారుడు మరణిస్తే పెద్దకర్మ తంతు పూర్తయ్యాక ఆలయ మర్యాదల ప్రకారం ఆ గ్రామానికి వెళ్ళి ఆ అధికారికి పరివట్టం కట్టడం, ప్రసాదాలు అందజేసి వేదపండితులు వేదాశీర్వచనం అందించినపుడు అది నీకు అపచారంగా అనిపించలేదా;?ఛైర్మన్ హోదాలో అప్పుడు కళ్ళుమూసుకున్నావా అని ఘాటుగా స్పందించారు.

## కేంద్రసాయం, రాష్ట్ర సహకారంతో గాడిన పడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్

**విజయవాడ, అక్టోబర్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు కర్మాగారం పటిష్టతకు, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఏడాది కాలంలో కేంద్ర సాయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్లాంట్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి వచ్చిందని... ఇది ఆహ్వానించదగిన పరిణామంగా సిఎం అన్నారు. ప్లాంట్‌ని నష్టాల నుంచి బయటపడేయడానికి, బలోపేతం చేయడానికి యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. గత ఏడాది కాలంలో తీసుకున్న చర్యలు, సమిష్టి నిర్ణయాలు, సమన్వయం కారణంగా ప్లాంట్ మంచి ఫలితాలు సాధిస్తోందని సిఎం అభిప్రాయ పడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ బలోపేతం చేయడంతో పాటు గరిష్ట ఉత్పత్తి స్థాయికి తీసుకువెళ్లే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో తీసుకున్న చర్యలను, వచ్చిన ఫలితాలను సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సిఎం చంద్రబాబు చొరవ తీసుకుని ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి ఆర్థిక సాయం తెచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో నాడు కేంద్రం ప్లాంట్ పరిరక్షణ కోసం రూ.11,440 కోట్ల సాయం అందించింది. ఇందులో మెజారిటీ మొత్తం ఇప్పటికే విడుదల కావడంతో ఆ నిధుల్ని వినియోగించి ప్లాంట్‌ను గాడిన పెట్టే పనులు చేపట్టడం జరిగింది. ఏడాది కాలంలో అటు కేంద్ర సాయం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో అందిస్తున్న సహకారంతో ఉత్పత్తి సామర్థ్య గణనీయంగా పెరిగింది.

## ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడిని ఖండించిన 'సుంకర'

**విజయవాడ ,అక్టో బరు 6,ప్రభాతవార్త** భారత దేశ సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి ప్రయత్నం న్యాయ వ్యవస్థపై,భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించవల్సి వస్తుందని ఆల్ ఇండియా లాయర్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి గవాయి రాజ్యాంగాన్ని రక్షించడంలోను,రాజ్యాంగం నిర్దేశించిన మౌలిక సూత్రాలలో ఒకటైన భౌతిక ధర్మాన్ని రక్షించడంలోనూ ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, ఈ దాడి ఒక వ్యక్తి న్యాయమూర్తిపై చేసిన వ్యక్తిగత దాడి కాదని, భారత దేశ రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని ఉందన్నారు.

## టమోటా ధరలపై మంత్రి అచ్చెన్నాయుడు భరోసా



**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** టమోటా ధరలపై రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు అన్నారు.ఆయన కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.రాప్తాడు మార్కెట్ లో టమోటా ధరలు గరిష్టం రూ.18, కనిష్ఠం రూ.9, మోడల్ ధర రూ.12 గా ఉన్నాయి వివరించారు.30 నుండి 40 మెట్రిక్ టన్నులు మించి పత్తికొండ మార్కెట్ సరుకు రాదు, దసరా సెలవులు కావడంతో మరొక 10 టన్నులు అదనంగా చేరుకుంది.. రోడ్లపై 2వ గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించారు.అది సరికాదన్నారు.ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామన్నారు.ఈ రోజు పత్తికొండ మార్కెట్ లో టమోటాలు సేకరించి చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్ కి 10 మెట్రిక్ టన్నులు, రైతు బజార్లకు 15 మెట్రిక్ టన్నులు పంపిస్తాము..తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు సరుకు ఎగుమతి వర్షాల వల్ల తగ్గింది... ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించామన్నారు.రాప్తాడు మార్కెట్ కి 3000 మెట్రిక్ టన్నులు రాగా అందులో కేజీ టమోటా గరిష్టంగా 18 రూ, కనిష్టంగా 9 రూ జరిగింది.. .టమోటాలకు ట్రెండింగ్ ధరను బట్టి ప్రస్తుతం మంచి ధర లభిస్తుంది, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అన్ని విధాలుగా రైతులను ప్రభుత్వం ఆదుకుంట్నుదని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నెం.29/ఎ.టి.ఓ/నిట్ నెం.708 & 709/2025-26, తేది: 29.09.2025
గ్రా.నీ.స & పా. డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలో MPLADS పథకం ద్వారా RO PLANT సంబంధించి 3 పనులకు గాను అంచనా విలువ: రూ.18.00 లక్షలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు తేది: 06.10.2025 నుండి అందుబాటులో ఉంచబడును. ఇతర వివరాలను www.apeprocurement.gov.in లో చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR.No.17701/CL/Advt/1/1/2022-23, తేది: 06.10.2025



pnb Housing Finance Limited Ghar Ki Baat

అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు పర్యాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం : 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com
గుంటూరు బ్రాంచి : GB ప్లైమ్, 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్ గుంటూరు-522002. విజయవాడ బ్రాంచి: - 39-3-1, 2వ అంతస్తు, ఆంజనేయులు జ్యువెలర్స్ పైన, ఎం.జి రోడ్, విజయవాడ-520010.

[illegible] M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్ [illegible] "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఎలా ఉన్నది అక్కడ ఏది ఉందో అది అలా" ప్రాతిపదిక [illegible] సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 [illegible] రూల్ 8(6) మరియు 9 ప్రకారంగా కాలమ్ నెం.A యందు [illegible] M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | ఇయంఎ (RP యొక్క 10%)(F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంటల్ రేట్ (H) | ఇన్స్పెక్షన్ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు/క్లెయిమ్‌లు (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/GNTR/0623/1130607, NHL/GNTR/0623/1130608, B.O.: గుంటూరు, వారిశల్ల మహేష్, వారిశల్ల నాగమణి & మాతృశ్రీ ఆయుర్వేద మరియు సిద్ధ | రూ. 3908573.64 07.05.2025 నాటికి | భౌతికంగా స్వాధీనం | ఫ్లాట్ నం.402, మూడవ అంతస్తు, శ్రీ గాయత్రి ఇన్ఫినిటీ, కోరిటెపాడు యొక్క ఇ.నం.122, ప్లాట్ నం.5a-బి (uda ప్రకారం) అనుమతి పొందిన ప్లాన్ ప్లాట్ నం.81, Vgtm uda అనుమతి పొందిన లేఅవుట్ నం. 8/94gnt), ఇ.నం.135-225/1, Asst. నం.1021202054, రెవెన్యూ వార్డ్ నం.57 (అర్బన్ పన్ను ప్రకారం) గాయత్రీనగర్, 2వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్, గుంటూరు, రోరంట్ల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034, ఇండియా. | రూ. 3733664 | రూ. 373366 | 11.11.2025 | రూ. 10,000 | 15.10.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 12.11.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | తెలియదు |
| HOU/VJWD/0718/553447, B.O.: విజయవాడ, CH P K దుర్గా రామ్ కుమార్, Ch విజయలక్ష్మి | రూ.1898087.32 08.04.2021 నాటికి | భౌతికంగా స్వాధీనం | గౌతమ్ టవర్స్, గ్రౌండ్ ఫ్లోర్, 6.0 గౌతమ్ టవర్స్, ఇ.నం.1 55 దగ్గర, R S నం.14/3, మల్లాది గ్రామ పంచాయితీ మరియు గ్రామం, అమరావతి మండలం, గుంటూరు జిల్లా, గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522020, ఇండియా. | రూ. 2498000 | రూ. 249800 | 11.11.2025 | రూ. 10,000 | 15.10.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 12.11.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | తెలియదు |
| NHL/GNTR/1019/749705, B.O.: గుంటూరు, షేక్ మహబూ జానీ, షేక్ హనీఫా బీ, SK ఎంటర్ ప్రైజెస్ | రూ.3477778.06 24.04.2023 నాటికి | భౌతికంగా స్వాధీనం | ఉప జిల్లా వగైరా వద్ద ఉన్న, $152^{1/2}$ చ.గజాలు, అన్ని ఇల్లు యొక్క కేస్‌లో ప్లింత్ / బిల్టప్ ఏరియా కలిసి ఏరియా, గుంటూరు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి ఉప-జిల్లా, సత్తెనపల్లి మునిసిపల్ ఏరియా, సత్తెనపల్లి గ్రామం, ఇ.నం.117, వార్డ్ నెం.4, $152^{1/2}$ చ.గజాల యొక్క విస్తీర్ణం (255 చ.గజాలలో $102^{1/2}$ చ.గజాలు, తీసివేసిన తర్వాత) అందులోని R.C.C ఇల్లుతో (ప్లాన్ ప్రకారం) అందులోని అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌లతో సరిహద్దులు: తూర్పు: షేక్ బొగారం జాన్ సాహెబ్ స్థలం, దక్షిణం: బజార్ 15'-00", పడమర: షేక్ మౌలాలి/రుణదరిఖాన్సుదారునివి కాసుక స్థలం, ఉత్తరం: పట్టాన్ హౌసన్ ఖాన్ మరియు ఇతరుల యొక్క స్థలం | రూ. 1737000 | రూ. 173700 | 27.10.2025 | రూ. 10,000 | 15.10.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 28.10.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | తెలియదు |

[illegible]

ప్రదేశం: గుంటూరు, తేది: 06.10.2025 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

మధ్యవర్తి మాట, అడవిలోని బాట ఎంతవరకు తీసుకెళ్తాయో ఎవరికీ తెలియదు.

-రాచెల్

# ఔషధలీల..మృత్యుహేల

సాధారణ దగ్గు వారం రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. అదే కోరింత దగ్గయితే చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుందని తాజా అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. కోరింత దగ్గు పీడితులు ఊపిరి పీల్చుకునేటప్పుడు కంగు కంగుమనే శబ్ధంతో దగ్గువస్తుంది. కోరింత దగ్గయితే అంటు రోగమేనని చెప్పకతప్పదు. ఈ రెండింటికి తేడా తెలియక దగ్గు సంకేతాలు తెలియగానే పిల్లలకు వెంటనే దగ్గు మందు ఇచ్చేసి అదే తగ్గిపోతుందులే అనుకోవడం కద్దు. కానీ దగ్గు మందు నాణ్యత బెడిసి కొట్టి మధ్యప్రదేశ్‌లో 14 మంది చిన్నారులను పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటన గురించి తెలియగానే కేంద్ర ఆరోగ్య శాఖ మెళకువ తెచ్చుకుంది. ఎక్కడైనా దుస్సంఘటనలు జరుగగానే అప్పటికప్పుడు ప్రక్షాళన నిర్ణయాలు తీసుకోవడం మన పాలకులకు అలవాటే. ఇక్కడా ప్రభుత్వం ఆ మేరకు స్పందిస్తోంది. నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులను రద్దు చేస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 'కోల్డ్రిఫ్' దగ్గు మందులను వాడిన వారిలో తీవ్ర 'అనారోగ్య లక్షణాలు కనపడి అసువులు బాశారు. చాలా రాష్ట్రాలు సత్వరం ఆ మందులను నిషేధించాయి. ప్రాణాపాయానికి కారణమైన మందులను తమిళనాడు కాంచీపురంలో ఓ ఔషధ తయారీ సంస్థ నుంచి బయటికొచ్చింది. అలాంటి నాసిరకం మందులను కనిపెట్టాల్సింది ఆరోగ్యశాఖ కింద పనిచేసే ఔషధ నియంత్రణ విభాగమే. కానీ మార్కెట్‌లోకి విడుదలై పసిపిల్లల ప్రాణాలు తీసే వరకు తెలియలేదంటే ఏమనుకోవాలి. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖే బాధ్యత వహించాలి. కాగా 'కోల్డ్రిఫ్' సిరప్‌ను తయారు చేసిన శ్రేసన్ ఫార్మస్యూటికల్స్ మీద చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఉద్యుక్తమయ్యింది. ముందే తీసుకోవాల్సిన చర్యలు తర్వాత తీసుకుంటే ఏమవుతుంది? కొన్ని ప్రాణాలు బలైపోయాయి. మధ్యప్రదేశ్‌లోని బేటుల్ జిల్లా, ఆమ్లాబ్లాక్‌లో ఇద్దరు చిన్నారులు ఈ సిరప్ వాడాక మరణించారు. దాంతో ఛింద్వారా జిల్లాలోని పరాసియా ప్రజారోగ్య కేంద్రం పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రవీణ్ సోనిపై కేసు నమోదు చేశారు. ఆ డాక్టరు చాలా మందికి అదే సిరప్‌ను సిఫారసు చేశారు. ఈ సిరప్‌ల 10నాణ్యతా ప్రమాణాల్లో 9 మాత్రమే అనుగుణంగా ఉన్నాయని గుర్తించారు. ఈ మందు కలుషితమైనట్లు గుర్తించి దాని తయారీ కంపెనీపై తమిళనాడు రెగ్యులేటరీ అథారిటీ ఎఫ్‌డిఎ చర్యలు తీసుకొంది. దాని లైసెన్సును రద్దు చేయమని సిడిఎస్‌సిఓకు సిఫారసు చేసింది. ఇవన్నీ ఏదైనా దుస్సంఘటన జరిగినప్పుడు తీసుకునే చర్యలే. వీటిలో ప్రత్యేకత ఏమీలేదు. ఆ బ్యాచ్ సిరప్ సరుకుకు ఎలా అనుమతిచ్చి, మార్కెట్‌లోని విడుదలై, డాక్టర్‌ల చేత సిఫారసు చేయబడిందంటే వీటికి ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఎంత ఉందో పసికట్టి వారిపై చర్యలు తీసుకోవడం ఎంతో అవసరం. ఈ మందు వాడిన పిల్లలకు మూత్రపిండాల సమస్యలు వచ్చాయి. మూత్రపిండాలు వాచిపోయి క్రియాటినైన్ లెవెల్స్ మారిపోయి తీవ్ర సమస్యలు తలెత్తాయి. మూత్రం బంద్ అయ్యింది. ఒక కేసులో లెప్టోస్పైరోసిస్ పాజిటివ్ కనపడింది. ఇంత సీరియస్ సంఘటనలో కూడా ప్రభుత్వ విభాగాల అలసత్వం బయటకు రాకుండా ఏవేవో సమర్థింపులుచేసుకుంటున్నారు. పైగా గ్రామీణ ప్రాంతం నుంచి ఆ చిన్నారులు రావడాన్ని కూడా ఒక అవకాశంగా మార్చుకోవాలని చూశారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టడం వారి నేరం కాదు. కానీ సంఘటనకు ఎవరూ బాధ్యత వహించడం లేదు. వైద్యులు దగ్గుమందులు రాసేటప్పుడు హేతుబద్ధంగా వ్యవహరించాలని కేంద్రప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇక్కడ 'హేతుబద్ధత'కు అర్థం తెలియక కొంత మంది డాక్టర్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో విడుదలైన దగ్గుమందులో రసాయనాలుంటాయని ప్రిస్క్రిప్షన్ రాసే మందు ఎలా తెలుస్తుందో జవాబు దొరకని ప్రశ్న. ఉదంతం జరిగాక ప్రాణాపాయంలో ఉన్న చిన్నారులకుఎలాంటి వైద్యసహాయం అందలేదు. మరణించిన చిన్నారులకు పోస్ట్‌మార్టెమ్ కూడా వెంటనే జరుగలేదు. ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. 'కోల్డ్రిఫ్' దగ్గు మందు కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైందని అనుమానిస్తున్నారు. కేవలం ఆ బ్యాచ్ సిరప్ ఎస్ఆర్ 13ను మాత్రమే నిషేధించారు. ఈ బ్యాచ్ సిరప్‌లు మరెక్కడా వాడకుండా సీజ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఇలా అనంతర జాగ్రత్తలు చిన్నారుల ప్రాణాలు నిలబెట్టలేవు. కనుక సిరప్‌లు తయారయ్యే ఫార్మసీ కంపెనీల వద్దనే సంపూర్ణ స్థాయిలో పరీక్ష, విశ్లేషణ, పర్యవేక్షణ పటిష్టం చేయాల్సిన అవసరముంది. తీరా నాసిరకం ఔషధాలు బయటికొచ్చి రోగి శరీరంలోకి ప్రవేశించాక చేతులుకాలాక ఆకులు పట్టుకున్న చందాన ఉంటుంది. 'కోల్డ్రిఫ్' దగ్గుమందును ల్యాబ్‌లలో పరీక్షించి చూస్తే డైథిలీన్ గ్లైకాల్ (డిఇజి) ఇథైలీన్ గ్లైకాల్ (ఈజీ)గా పిలిచే ప్రమాద రసాయన ఆనవాళ్లున్నాయి. ఈ రెండూ మానవ శరీరం లోని మూత్రపిండాలు, కాలేయంలతో పాటు నాడీ వ్యవస్థలను దెబ్బతీస్తాయి. చిన్న ఫార్మా కంపెనీలు తమ ఔషధ ఉత్పత్తులను మార్కెటింగ్ సందర్భంలో డాక్టర్లకు తృణమో ఫణమో ఆశ చూపిస్తారు. ఆ నేపథ్యంలోనే డాక్టర్లు కొన్ని మందులను వాడమని సిఫార్సు చేయడం సహజం. డా.ప్రవీణ్ సోనీ ప్రభుత్వ డాక్టరు. కానీ తన ప్రైవేటు ప్రాక్టీసులో చిన్న పిల్లలకు పై నాసి రక మందును సిఫారసు చేశారు. అదే ఆయన తప్పిదమైంది. ప్రతి విషాద ఉదంతం జరిగినప్పుడు ఆ తర్వాత మరో విషాదం జరుగకూడదని మన స్ఫూర్తిగా, చిత్తశుద్ధితో సంకల్పం చెప్పుకుంటే తప్ప మానవ జీవన ప్రమాణాలను పెంచలేము.

బలవంతంగా పనిచేసే పది మంది కంటే ఒక స్వచ్ఛంద కార్యకర్త మేలు.



రాధాకృష్ణన్

మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న, పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి.



బైరన్

# యువత సామాజిక బాధ్యతను గుర్తెరగాలి

**చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్నచిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్లదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి.**

శ్రీశ్రీ కుమార్

నేటి విద్యార్థులే భావిభారత పద నిర్దేశకులు. రేపటి సమాజానికి మార్గదర్శకులు, విద్యార్థులు ఆదర్శవంతమైన యువతిగా రూపుదిద్దుకొని ఒక నీతి నిజాయితీ, నిబద్ధతతో కూడిన వ్యవస్థను రూపొందిస్తారని వారి పైన తల్లిదండ్రులకే కాదు అందరికీ ఉండే ఒక ఆశావహ అభిప్రాయం, ఆకాంక్ష. ఉన్నతమైన ఆశయాలతో మెరుగైన సమాజాన్ని నిర్మిస్తారని వీరిపై అందరికీ ఉండే ఒక సహజమైన విశ్వాసం కానీ కొద్ది సంవత్సరాలుగా పరిశీలిస్తే విద్యార్థులు రకరకాల దురలవాట్లకులోనై చెడు మార్గం పట్టడం గమనించవచ్చు. కారణాలు ఏమైనా కావచ్చు. కానీ రేపటి రోజుకు వీరు ఆశాకిరణం లాగాకాక సంఘ వ్యతిరేక శక్తులుగా కూడా తయారవుతున్నట్లు మనకు అవగతమవుతున్నది. ముఖ్యంగా విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం చాలా తరచుగా వింటున్నాం. కొద్దిమంది మరో అడుగు ముందుకేసి వాటి స్మగ్లింగ్‌లో కూడా పట్టుబడుతున్నారు. ఇలాంటి సంఘటనల వల్ల కాబోయే యువతపై మనం పెంచుకున్న విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఇలాంటి దురలవాట్లకు లోనైవారు చివరకు సంఘవిద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రవర్తనను ముందే పసిగట్టి కౌన్సిలింగ్ ద్వారానో కఠిన చర్యల ద్వారానో అరికట్టాల్సిన ఆవశ్యకత బాధ్యత తల్లిదండ్రులపైన, అధ్యాపకులపైన ఎంతో ఉంది. ఎన్ని చట్టాలున్నా, ఎన్ని చర్యలున్నా తగ్గకుండా నడుస్తున్న మరో దురలవాటు ర్యాగింగ్. కేవలం సీనియర్లు జూనియర్ల మధ్యన ఒక పరిచయం స్నేహభావం వెల్లివిరియాలనే సదుద్దేశంతో మొదలైన ఈ ప్రక్రియ విద్యార్థిలోకాన్ని ఒకజాడ్యం లాగా ఆవహించింది. వారి జీవితాలను కబళిస్తున్నది. సీనియర్లు జూనియర్ విద్యార్థులను వికృత క్రీడలతో విచిత్రమైన చేష్టలతో దానిని వింత పుంతలు తొక్కించారు. పర్యవసానంగా ఈ బాధను తట్టుకోలేకపోయిన సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు మనకు తెలుసు. పోలీసు కేసులు రిజిస్టర్ అవుతున్నా, టిసిలు ఇచ్చిన సంఘటనలున్నా ఈ ర్యాగింగ్ రోగం తగ్గిన దాఖలాలు లేవు. రకరకాల రూపాలలో విశృంఖలంగా సాగుతూనే ఉన్నది. దీనిని సంపూర్తిగా సమూలంగా అరికట్టకపోతే ఈ దుష్ట సంస్కృతిని నిర్మూలించకపోతే మరిన్ని విలువైన ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. నాగర్ కర్నూల్ సూర్యాపేట, మెడికల్ కళాశాలలో సంఘటనలు సమాజాన్ని కదిలించి వేశాయి. చిత్తూరు జిల్లాలోనూ సీనియర్లు ఒక జూనియర్ విద్యార్థిని తమ రూములో చిత్రహింసలకు గురిచేసి తాము చేసిన ఘనకార్యాన్ని వీడియో కూడా తీయడం దారుణం. కళాశాల యాజమాన్యం కూడా ఇలాంటి సంఘటనల్లో మౌనం పాటించడం శోచనీయం. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దవలసిన అధ్యాపకులు, యాజమాన్యం తగిన సమయంలో స్పందించకపోతే దాని పరిణామాలు అనూహ్యంగానే ఉంటాయి. గత తొమ్మిది ఏళ్ల వ్యవధిలో 2024-25 సంవత్సరంలో అత్యధికంగా ర్యాగింగ్ కేసులు నమోదు కావడం బాధాకరం. 2022-24 మధ్య 51 ఆత్మహత్యలు కేవలం ర్యాగింగ్ వల్లనే జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. వృత్తి విద్యాకళాశాలలు ర్యాగింగ్‌కు కేంద్రాలుగా నిలపడం బాధాకరం. విద్యార్థులు యువత తామను కున్నవి జరగకపోతే తట్టుకోలేకపోతున్నారు. మానసికంగా కృంగిపోతున్నారు. అది వారికి ఇష్టమైన కోర్సు కావచ్చు, ఉద్యోగం కావచ్చు. తనకు నచ్చిన మొబైల్ కొనివ్వలేదని ఆత్మహత్యలకు పాల్పడిన వారు, మొబైల్ వాడనివ్వలేదని కూడా మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు మనం చదువుతున్నాం. విద్యార్థులు ఈ రకంగా



సున్నిత మనస్కులుగా తయారు కావడం వారి భవిష్యత్తుకు మంచిది కాదు. తల్లిదండ్రులు కూడా వారిని ఆ విధంగా పెంచకూడదు. తాము అనుకున్న మార్కులు రాలేదనిర్యాంకు రాలేదని కూడా తీవ్రచర్యలకు పాల్పడుతున్నారు. మార్కులు, ర్యాంకు, కోర్సు ఇవి మాత్రమే జీవితం కాదనేది వారు గుర్తించాలి. పాఠశాలల్లో కళాశాలల్లో కూడా వారికి తరచుగా కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించుతూ వారిని దృఢ మనస్కులుగా తయారు చేయాలి. పరీక్షలు మార్కులు ర్యాంకులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ జీవితం ఒకటేనని వారు గుర్తించేలా చేయాలి ఒంటరిగా తిరిగేవాళ్లను అన్యమనస్కంగా ఉండే వారి మీద ఒక కన్నేసి ఉండాలి. అనుమానాస్పద ప్రవర్తనను పరిశీలిస్తూ ఉండాలి. ఉద్యోగార్థులు తమ ప్రయత్నంలో విఫలమైతే విరక్తిచెందుతారు. మరోమారుప్రయత్నం చేసి సాధించవచ్చుననే మనోధైర్యం వారిలో కల్పించాలి. వైఫల్యాలే భవిష్యత్తులో విజయాలకు సోపానాలని వారికి బోధించాలి. వారికి జీవితంపై ఆశ కలిగేలా చేయాలి. ఉద్యోగమే కాదు ఉపాధి అవకాశాలు గూర్చి వారికి అవగాహన కల్పించి, అవకాశాల గూర్చి కూడా వారికి తెలియజేసి వారిని ఆ దిశగా ఆలోచింపజేయాలి. జీవిత సత్యాలను, జీవన నైపుణ్యాలను వారికి నేర్పడం ద్వారా సమాజానికి ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దవచ్చు. మరి కొందరు ప్రేమ విఫలమైందనే మనోవ్యధలో కూడాకృంగిపోతున్నారు. తల్లిదండ్రులకు సమాజానికి భారంగా మిగిలిపోతున్నారు. అలాంటి వారి మనసు మళ్లించి మంచి వ్యాపకంలో వారిని తీరికలేకుండా ఉండాలి. వారి అభిరుచిని బట్టి పని అప్పగిస్తే వారు ఇష్టపూర్తిగా చేసి విజయాన్ని ఆస్వాదిస్తారు. ఒత్తిడిని జయించే శక్తి సామర్థ్యాలు కలిగేలా చేయడం ద్వారా విద్యార్థులను యువతను సన్మార్గంలో పెట్టి వారితోనే సమాజంలో మార్పు తీసుకురావచ్చు. సామాజిక సేవ, రాజకీయాల వంటివి కూడా వారిని సరైన దిశలో నడిపిస్తాయి. వారి శక్తి వారు తెలుసుకునేలా చేయడంలోనే విజయ రహస్యం దాగి ఉంది. దేశం గర్వించదగిన ఎందరో మహానుబావుల చరిత్రలు చదివించడం ద్వారా వారిలో జీవితం పట్ల ఆసక్తిని కలిగించవచ్చు. సమాజంపట్ల బాధ్యతను పెంచవచ్చు. విద్యార్థులలో యువతలో ఎందుకింత నైరాశ్యం ఆవహించింది? అసలు వారి చదువుల్లోనే ఏదో ఒక లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. భాషల పట్ల నిర్లక్ష్యం పెరిగింది. భాషా వాచకాలలో ఎన్నో నీతి కథలు, ఆదర్శ పురుషుల జీవిత గాథలు, జీవన నైపుణ్యాలు నేర్పే విషయాలు ఇంకా జీవన విధానం తెలిపే అనేక విషయాలు ఉంటాయి. మారిన కాలమాన పరిస్థితులలో తరగతి బోధనలో భాషలు మూలన పడ్డాయి. ప్రాముఖ్యత కోల్పోయాయి. కంప్యూటర్ యుగం కావడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే టెక్నికల్ కోర్సులకు డిమాండ్ సహజంగానే పెరిగింది. గ్రంథాలయాల్లో పుస్తకాలకు చెదలు పట్టాయి. పుస్తక పఠనం విద్యార్థుల్లో యువతలో పూర్తిగా పడిపోయింది. అందువల్ల వారు మానసిక దుర్బలులవుతున్నారు. చదువు, మొబైల్, టీవీ, కంప్యూటర్ ఇంతకుమించి వారికి వేరే ప్రపంచం లేకుండా పోయింది. అందులోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఆప్తులైన స్నేహితుడు కూడా కరువయ్యారు. ఆటలు ఏనాడో మరిచిపోయారు. శారీరక వ్యాయామం, శ్రమ పూరిగా మరుగున పడింది. ఆటంటే నేడు క్రికెట్ మాత్రమే. ఆటల ద్వారా స్నేహభావం గెలుపోటములు వాటి విలువ తెలుస్తుంది. క్రీడా స్ఫూర్తిని జీవితంలో కూడా ఉపయోగించగలుగుతారు. పాఠశాలల్లో కళాశాలల్లో గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నికలు లేకుండా చేశారు. దాంతో వారికి సామాజిక స్పృహ, ప్రతినిధులు, చట్టసభలు, చర్చలు ఇంకా వాదనల లాంటి వాటికి దూరమయ్యారు. రాజకీయ జ్ఞానం కూడా బొత్తిగా కొరవడుతున్నది. సామాజిక శాస్త్రాల పట్ల పాలకుల నిర్లక్ష్య ధోరణి దీనిని మరింత పెంచింది. సామాజిక బాధ్యత కూడా యువత నేడు గ్రహించడం లేదు. చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్న చిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్ళదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి. ●

# ఇది జీవన సౌలభ్యమా! వ్యాపార సౌకర్యమా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ట్రంప్ సుంకాల భారం నుంచి మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రధాని జీఎస్టీ రేట్లు తగ్గించారా ? లేక అధిక జీఎస్టీ రేట్ల వలన ఎకానమీ ఆర్థిక మాంద్యం వైపుపోతున్నదనా? దేశంలో అధిక జీఎస్టీ రేట్ల వల్ల పడిపోయిన సార్థక డిమాండ్‌ను సరుకులు మార్కెట్లను పెంచి ఉత్పత్తులు ఉద్యోగిత ఆదాయాలు దేశంలో పెంచి ప్రజల జీవన సౌలభ్యం పెంచేందుకా? మన దేశంలో ఉన్నది జీవన సౌలభ్యమా? వ్యాపార సౌలభ్యమా? జీవన సౌలభ్యం అయితే సమాజంలో జీవనస్థితిగతుల నాణ్యతను సూచించేది. అంటే ఆర్థికఅవకాశాలు విద్యా వైద్య వసతులు, మౌలిక సదుపాయాలు పర్యావరణ స్వచ్ఛతమొదలైన అంశాల ప్రాతిపదికన జీవన సౌలభ్యస్థాయిని నిర్ధారిస్తారు. వ్యాపార సౌలభ్యం అంటే దేశంలో ఒక ప్రాంతంలో వ్యాపారాన్ని ప్రారంభించడం, నిర్వహించడం వాటిలో ఉన్న నియమ నిబంధనలో వ్యాపార అభివృద్ధికి దోహదపడుతున్నాయా లేదాఅనేది వ్యాపార సౌలభ్యాన్ని నిర్ణయిస్తాయి. ఉదాహరణకు జీఎస్టీ రేట్ల తగ్గింపును తీసుకుందాము. ఆ రేటు తగ్గింపుతో వినియోగదారులకు ఇప్పుడు 200000కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుందని అధికారిక అంచనా. మరి ఇంతకాలం వసూలు చేసినది? జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నందువలన మన జిడిపిలో కుటుంబ రుణాలపెరుగుదల 40శాతంవరకు ఉన్నదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరోకవైపు కుటుంబాల పొదుపు జిడిపిలో 18.1 శాతానికి పడిపోయింది. ప్రజలు ఇంతవరకు చేసిన రుణాలను తీర్చుకోగలరా? ఈ నేపథ్యంలో దేశం, ప్రజల జీవన సౌలభ్యంమాటేమిటి? మొన్నటి వరకు ఐదు స్లాబ్‌ల జిఎస్టి పన్ను విధానంతో జీవన సౌలభ్యాన్ని కోల్పోయామా? వ్యాపార సౌలభ్యం జరిగిందా? ఈ ఐదు స్లాబుల జీఎస్టీ రేటు దేశంలో డిమాండ్‌ను తగ్గిపోయేట్టుగా చేసిందా ముఖ్యంగా చిన్నతరహా కుటీర పరిశ్రమలు2020-24 మధ్యకాలంలో49342 సంస్థలు మూతపడి 3.18 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. 2014లో మేక్ ఇన్ ఇండియా ప్రారంభించినప్పటి నుంచి ఉత్పాదక రంగంవాటా మన జిడిపిలో 16.7శాతం నుంచి 13శాతానికి పడిపోయింది. నిరుద్యోగం ఎక్కువైంది. అయితే దేశంలో ప్రతి ఏటా 80 లక్షల మంది లేబర్ మార్కెట్కు చేరుకుంటున్నారు. వారిలో రెండు శాతం కూడా ఉపాధి పొందలేకపోతున్నారు. ప్రస్తుతం జీఎస్టీ రెండు స్లాబులగా తగ్గించడం వలన మూతపడిన పరిశ్రమలు తెరుచుకుంటాయా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి? 2014లో మన ప్రధాని మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రారంభిస్తూ భారతదేశం కేవలం ఒక మార్కెట్ గా కాకుండా ఒక ఉత్పత్తి కేంద్రంగా కూడా ఉండాలని ప్రపంచమార్కెట్ను కైవసం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఆనాటి స్వదేశీ ఉద్యమం తరహాలో ఈనాడు స్వయం పోషకత్వం కోసం మేకిన్ ఇండియా ఆత్మనిర్భర భారత్ ఇలాంటి పథకాలను మన ప్రధాని జాతీయ వాదమని దేశభక్తి అని ప్రజల ఐక్యతను ఆశిస్తూ చేస్తున్న పాలనలో ఈ జీఎస్టీ పన్నుల విధానంతో దెబ్బతిన్నాయని భావించడం జరిగి ఇప్పుడు జిఎస్టిరేట్లను తగ్గించుచున్నారా? లేక ట్రంపు సుంకాల భారం నుంచి మన ఆర్థికవ్యవస్థను కాపాడేందుకు. అంతర్జాతీయ శ్రామిక సంస్థ ప్రకారం దేశంలో 2024లో బలహీనమైన ఉపాధి అవకాశాలున్నాయని ధరలు ఎక్కువగాను ఆదాయాలు తక్కువగాను వినియోగ వస్తువుల డిమాండ్ పడిపోయిందని ఫలితంగా పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని తెలియజేసింది. 2014లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రపంచీకరణ వలన అద్భుతమైన ఫలితాలు మన ఆర్థికవ్యవస్థలో లభిస్తాయని ఎక్కువ గానే ఆశ పెట్టుకున్నారు. మనదేశంలో తయారీ రంగంలో ఏటా14 శాతం వృద్ధి రేటును అందిస్తామని 2022 నాటికి దేశంలో తయారీరంగంలో10కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు కల్పించారు. కానీ తయారీ రంగంలో వృద్ధి రేటుఆరు శాతం వరకు కూడా పెరగలేదు. అటు అమెరికా ప్రెసిడెంట్ సుంకాల వలన ఇటు దేశంలో మనప్రధాని పన్నుల విధానం వలన దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. ●

# తెల్ల బంగారం.. రైతు శ్రమకు గ్లోబల్ గౌరవం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తిదినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (నీతివీ) ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు, ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదు, అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం పత్తిపంట ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత, ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలుపత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతి పెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తిసాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360-400 లక్షల గింజల బేళ్ల పత్తిఉత్పత్తి



అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. 'మేడ్ ఇన్ ఇండియా కాటన్' అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తిపంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగాఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థికవ్యవస్థలో కీలక స్తంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటివనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటిఅంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన 'కాటన్4' ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాడ్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాల పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. 'కాటన్ ఈజ్ లైఫ్' అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగాఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ "రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణఈ అన్ని కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి. అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదు, అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం. ●

# ప్రజావాక్కు



## డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్‌నేరాలలో 'డిజిటల్ అరెస్టు' ఒక కొత్త వల. నేరగాళ్లు తాము ప్రభుత్వ అధికారులు, సీబీఐ లేదా సైబర్ పోలీసులు అని నటిస్తూ బాధితులకు కాల్ చేస్తారు. తప్పుడు కేసుల్లో నిందితులమని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయని భయపెడతారు. వెంటనే జరిమానా చెల్లించాలని, లేకపోతే అరెస్ట్ చేస్తా మని బెదిరిస్తారు. కొన్నిసార్లు పర్సనల్ డాక్యుమెంట్లు పంపమని, బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వమని ఒత్తిడి తెస్తారు. ఇలా నిర్దోషుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు దోచుకుంటున్నారు. నిపుణులు హెచ్చరిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. గుర్తింపుకార్డు చూపించినానేరుగా నమ్మకూడదు. ఎప్పుడూ బ్యాంక్ సమాచారం, పాస్‌వర్డ్‌లు పంచకూడదు. అనుమానం కలిగితే సంబంధిత అధికారిక వెబ్‌సైట్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్ ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## దేశాన్ని తూలనాడటం మానుకోవాలి

పార్లమెంట్‌లో అపోజిషన్ నాయకుడైన రాహుల్ గాంధీని కాబోయే ప్రధానమంత్రి వరుసలోని వారని అంటారు. ఈయనకు దేశ రాజకీయాలపై మంచి పట్టు ఉన్నదని తెలుసున్న విషయమే. కాని ఎక్కడ ఏలా మాట్లాడాలో ఇంకాచాలాతెలుసుకోవాలి. పరంపరగా వచ్చిన కాంగ్రెసు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రాహుల్ ఇంకా రాజకీయాలలో పరిపక్వతచెందాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు మాతృదేశంపై కువిమర్శలు చేయ కూడదు కదా! గతంలో ఎంతోమంది ప్రభుత్వ వ్యతిరేక రాజకీయులు ఇతర దేశాలకు వెళ్ళినా దేశాన్ని, అప్పటి ప్రభుత్వాన్ని తులనాడలేదే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉపాధి హామీ మంచి ఉపకరణం

తెలంగాణ అంటే ఒకనాడు పల్లెర్లు మొలిసిన భూములు కనిపించేవి. ఇప్పుడు పచ్చని పసరికలు కనబడుతున్నాయి. దానికి ప్రధాన కారణం ప్రాజెక్టులతో పాటు విరివిగా కురుస్తున్న వర్షపాతం అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారమే తెలంగాణలో బీడు భూమి5శాతం అయితే ఉపాధి హామీని ఉపయోగించి ఆ బీడు భూమిని సాగులోకి తెవొచ్చు.

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతిమించి పోతూ వున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యం మత్తులోవాహనాలు నడపొద్దని అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంతమాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటి పడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. ప్రధానంగా రహదారులను సైతంఅడ్డాగా మార్చుకొని మరీ తాగుతున్నారు. మద్యం దుకాణాలవద్ద పర్మిట్‌రూం అందుబాటులో ఉన్నా.. చాలావరకు వినియోగించుకోవడం లేదు. అధికారుల తనిఖీలు అంతగా లేకపోవ డంతో ఈ తతంగంగా సాగిపోతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించాలి

జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌లో బస్సు చార్జీలు రెండు మూడు స్టాపులకు ఐదునుండి పది రూపాయల చొప్పున పెంచింది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం అవుతుంది. నెలకు అదనంగా ఐదువందల రూపాయలపై చిలుకుపడే అవకాశంఉంది. ఇప్పుడు ఉన్న చార్జీలలో యాభైశాతం పెంచారు. కావునా వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం పెంచిన చార్జీలు తగ్గించాలి. ఇంట్లోమహిళలకు ఉచితబస్సు ఇచ్చిపురుషులకు చార్జీలు పెంచడం సరికాదు. కుటుంబంపైనే భారం పడే అవకాశం ఉంది. గతంలో కూడా బస్సు చార్జీలు పెంచారు. ఇప్పుడు కూడా పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## విభజించు పాలించు

ఆంగ్లేయులు నేర్పిన సమయపాలనకు, అత్యంత విలువనిచ్చిన గాంధీజీని తుపాకీతో కాల్చిచంపిన కిరాతకుడైన గాడ్సేను హీరోగా అభివర్ణిస్తూ, అతనిని పొగుడుతూ అతను ఆరోజు గాంధీను ఎందుకు కాల్చాడో అతని మనోగతం తెలిపే అతను వ్రాసిన లేఖను ఇప్పుడు సుప్రీంకోర్టు అనుమతితో బహిర్గతం చేస్తూ, కొత్త విషయం అంటూ చెత్త విషయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో దుర్మార్గమైన భావజాలం గలఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తయిందని ఆ సంస్థ పేరుమీద ఒక వంద రూపాయల నాణెం విడుదల చేయడంలో ఔచిత్యం ఏమిటో.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## అష్టలక్ష్మీ గోశాలలో వైభవంగా చండీహోమం





గుంటూరు కల్చరల్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : స్థానిక అరుండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ మందిరం నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నిడుముక్కల గ్రామంలో 100కు పైగా గోవులతో నిర్వహిస్తున్న గోశాలలో వేదపండితుల వేద మంత్రాలతో చండీహోమం, మహా పూర్ణా హుతి జరిగింది. అనంతరం కాలాలలో పవిత్ర జలాలతో భక్తులకు సంప్రోక్షణ తీర్ధ ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## ప్రొగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు 'సోమరౌతు'కు ఘన సత్కారం

గుంటూరు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్త : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీరావి సాంబయ్య పురపాలక బాలుర ఉన్నత పాఠశాల, కొత్తపేట తెనాలి లో జూన్ 2025పూర్వ ఉపాధ్యాయ బృందం, బదిలీపై మరియు పదోన్నతులపై వెళ్ళిన ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సోమరౌతు శ్రీనివాసరావుకు ఘన



సత్కారం జరిగింది. ఈ సమావేశంలో పూర్వపు హెచ్‌ఎం షేక్ మౌలాలి, హెచ్‌ఎం పదోన్నతులు పొంది రేపల్లె మున్సిపల్ పాఠశాలలకు పదోన్నతులపై వెళ్లిన చిలక సుందరరావు, బల్లిపల్లి శ్రీనివాస్ మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసూ , నిరంతరం కృషిచేస్తున్న సోమరౌతు, ఒక సంవత్ ్సర కాలంలో పదవీ విరమణ చెందనున్న ఆర్ట్ టీచర్ తురిమెళ్ళ విజయ్‌ప్రకాష్, జక్కా వీరాంజనేయులు స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్, టి.ప్రసాదకుమారి స్కూల్ అసిస్టెంట్ పిఈ ఆనందరావు వెంకటరమణలను కార్యక్రమంలో పాల్గొన్న ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని కె.భారతి ని ఉపాధ్యాయ జీతభత్యాలు మొదలగు సమస్యలపైకంప్యూటర్ పరిజ్ఞానంతో పరిష్కారం చేస్తున్న మల్లవరపు శ్రీనివాస చక్రవర్తి మొదలగు వారిని ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించడం జరిగింది. తదనంతరం సహపంక్తి భోజనాలతో సమావేశం ముగిసింది.

## 'అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాలి'

గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : జిఎంసీ లో ప్రతి సోమవారం జరిగే పిజిఆర్‌ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టంచేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో దయల్ యువర్ కమీషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పిజిఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తొలుత దయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజలనుండి



అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణ పరిష్కారం చేయగలిగినవి కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమీషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులు పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజనీరింగ్ విభాగం 8,. రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 7, పరిపాలన విభాగం1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమీషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ, భాష పాల్గొన్నారు.

## ఎడ్లపాడు లూథరన్ హైస్కూల్ గుర్తింపును పునరుద్ధరించాలి

గుంటూరు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్త : సుమారు 70 సంవత్సరాల చరిత్ర కల్గిన లూథరన్ సంఘ విద్యాలయం, ఎడ్లపాడు లూథరన్ హైస్కూల్ అనేక మంది కి విద్యాబుద్దులు నేర్పి, విద్యార్థులను ప్రపంచం నలుమూలలకు పంపించిన విద్యాలయం. ఎడ్లపాడు లూథరన్ హైస్కూల్‌ను సొంతం చేసుకుందామని కొన్ని వర్గాలవారు పథకం ప్రకారం ఈ చారిత్రాత్మక పాఠశాలకు కూతవేటు దూరం లో జిల్లా పరిషత్ పాఠశాల నిరి ్మంప చేశారు. ఈ పాఠశాల అభివృద్దికి ఉద్దేశించిన 12ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఈ చారిత్రాత్మక మైన స్కూల్‌కి



సంబంధించిన భూమిని సొంతం చేసుకోవడానికి ప్రణాళిక రచించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం కు అధికారు లు గుర్తింపు నిరాకరించారు. స్కూల్ అస్థిపైన కన్నువేసిన వారిని వెంటపెట్టుకొని డిప్యూటీ జిల్లా విధ్యాధికారి స్కూల్ రికార్డులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ సంఘ కాపరులు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి కార్యాలయంలో కలసి ఎడ్లపాడు లూథరన్ హైస్కూల్ గుర్తింపు పునరుద ్ధరించాలని కోరారు. ఏఈఎల్‌సి కంట్రోలర్ కార్యదర్శి జేసురత్నకుమార్, పరిపాలన అధికారి జోసఫ్ పిఎస్ మాట్లాడుతూ ఇకనుంచి సంఘ సంస్థలను, ఆస్థులను పరిరక్షించడం లో సంఘ కాపరులందరూ భాగస్తులు కావాలని కోరారు. కార్యక్రమంలో రెవ.బాబురావు, రెవ.శ్యాంసంపత్, రెవ.ఇసుకపాటి శ్యాం, రెవ.సతీష్,.కారొ ్పరేటర్ రాజా లత, ట్రినిటి ప్యారిష్, నార్త్ ప్యారిష్ మరియు ఈస్ట్ ప్యారిష్, వెస్ట్ ప్యారిష్, సుమారు 50మంది ఇతర సంఘ కాపరులు మరియు ఏఈఎల్‌సి కార్యాలయ సహాయ ప్రాపర్టి అధికారి లెనిన్ లు పాల్గొన్నారు.

## పూల్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన

గుంటూరు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్త : స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో భారతీయ బహుళ జాతి ఔషధ తయారీ సంస్థ దివిస్ లాబోరేటరీస్ వారు నిర్వహించిన పూల్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుండి విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగ భూషణం తెలియజేశారు. కార్యక్రమానికి లేబోరేటరీ హెచ్‌ఆర్డి ప్రతినిధి కె.రామకృష్ణ పర్యవేక్షణలో విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో ఎంపిక చేసిన వారందరికీ దివిస్ లాబోరేటరీస్




మేనేజ్‌మెంట్ నెల రోజుల్లో జాబ్ ఆఫర్ పంపనున్నట్లు హెచ్‌ఆర్డి మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగ అరెస్టు

గుంటూరు క్రైమ్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను స్థానిక కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ముద్దాయిని హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఆయా వివరాల మేరకు గురజాల మండలం పల్నాడు జిల్లాకు చెందిన బొప్పురి మల్లికార్జునరావు అలియస్ పున్నారావు చెడు వ్యసనాలకు బానిసై మద్యం సేవిస్తూ తరచుగా తన భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ మధ్యకాలంలో తనకు ఆరోగ్యం బాగోలేక జిజిహెచ్‌లో చికిత్స నిమిత్తం వచ్చి ఇక్కడే లాడ్జిలో ఉంటూ బెల్దారు పనులుచేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఉండేవాడు, తనకు వచ్చిన డబ్బు సరిపోక చెడు వ్యసనాలకు బానిసై జిజిహెచ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పాత బైకులు అరిగిపోయిన తాళాలున్న బైకులను మారు తాళాలు ఉపయోగించి బైకులను దొంగలించి అమ్మగా వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఉండేవాడు. బైకుల్లో కొన్నిటిని గురజాలల్లోని బైక్ మెకానిక్ రాజశేఖర్‌కు 15ద్విచక్ర వాహనాలను, మహేష్ అనే గొర్రెల కాపరికి 6ద్విచక్ర వాహనాలను, సాతులూరు చెందిన బేల్దారు మేస్త్రీ సాంబశివరావుకు 7ద్విచక్రవాహనాలను అమ్మడానికి సిద ్ధంగా ఉన్నాయని తెలిపారు. సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్ కొత్తపేట సీఐ వీరయ్య ఆధ్వర్యంలో గౌరీశంకర్ థియేటర్ దగ్గర మాయబజార్ సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బొప్పురి మల్లికార్జునరావును అరెస్టు చేసి ముద్దా ్దయి వద్ద నుంచి రూ.25లక్షల విలువ కల 50ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

# గుంటూరు వార్త



## వచ్చే జనవరి 1 నాటికి జీరో వేస్ట్ రాష్ట్రంగా ఏపీ

### 100 స్వచ్ఛ రథాలను అందుబాటులోకి తెస్తాం
### స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాకారం.
### విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛత అవార్డుల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
### 21 కేటగిరీల్లో 69 రాష్ట్ర స్థాయి, 1257 జిల్లా స్థాయి అవార్డులు అందజేత

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి: పరిశుభ్రత కోసం నిత్యం శ్రమించే పారిశుధ్య కార్మికులు నిజమైన దేశభక్తులని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. పారిశుధ్య కార్మికులను చూస్తుంటే ఆపరేషన్ సింధూర్ వీరుల్లా కనిపిస్తున్నారని అన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని, కాబట్టి స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలు, వ్యక్తులకు మొత్తంగా 21 కేటగిరీల్లో 69 రాష్ట్ర స్థాయి, 1257 జిల్లా




స్థాయి అవార్డులను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పరిశుభ్రత కోసం నిత్యం శ్రమించే పారిశుధ్య కార్మికులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. స్వచ్ఛాంధ్ర పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మహాత్ముడు స్వచ్ఛతను దైవత్వంతో పోల్చారు. మన పరిసరాలు, మన ప్రాంతాలు, మన రాష్ట్రం ఇంత స్వచ్ఛంగా ఉన్నాయంటే అందుకు పారిశుధ్య కార్మికులే కారణం. అసలు వారు లేకపోతే స్వచ్ఛ ఉద్యమమే లేదు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికులు దేవుడితో సమానం. పారిశుధ్య కార్మికులను చూస్తుంటే ఆపరేషన్ సిందూర్ వీరుల్లా కనిపిస్తున్నారు. సూర్యుడు ప్రతీ రోజూ కాస్త అటూ ఇటూగా అయినా ఉదయిస్తాడేమో కానీ... తెల్లవారుఝామున 4 గంటల కల్లా పని మొదలుపెట్టే కార్మికుల రుణం తీర్చుకోలేం." అని సీఎం అన్నారు. యూజ్‌రికవర్‌రీ యూజ్ పాలసీ"స్వచ్ఛాంధ్ర సాకారం కాకుండా... స్వర్ణాంధ్ర సాధ్యం కాదు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన ఆలోచన, స్వచ్ఛమైన మనసు, స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన పాలన, స్వచ్ఛమైన సమాజం.. అంతిమంగా స్వచ్ఛమైన రాష్ట్రం. అందుకే ముఖ్యమంత్రిగా ఎన్ని కార్యక్రమాలు ఉన్నా... ప్రతి నెలా




"స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర పేరుతో ప్రజల వద్దకు వెళుతున్నాను. స్వచ్ఛాంధ్ర అనేది కేవలం నినాదం కాదు... దీన్నొక ఉద్యమంగా, సాంప్రదాయంగా మార్చాం. ప్రతి నెలా 3వ శనివారం "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర"తో మహా సంకల్పాన్నే తలపెట్టాం. 1995లో ముఖ్యమంత్రిగా పచ్చదనంపరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యమస్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాను. గ్రీన్ పాస్ పోర్టు ద్వారా విద్యార్థులలో చెట్లు పెంచే అలవాటును పెంచుతున్నాం. యూజ్ అండ్ త్రో పాలసీ కాకుండా యూజ్ రికవర్‌రీ యూజ్ పాలసీ అమలు చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి తెలిపారు. జనవరి 1 నాటికి జీరో వేస్ట్ రాష్ట్రంగా ఏపీఖిగత పాలకులు చెత్తపై పన్ను వేస్తే మేము చెత్త నుంచి సంపద సృష్టించాం. అధికారంలోకి రాగానే మచిలీపట్నంలో పర్యటించినప్పుడు అక్కడ నాలుగు రోడ్ల జంక్షన్ లో ఒక చెత్త గుట్టను చూశాను. కూటమి అధికారంలో వచ్చే నాటికి 85 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త రాష్ట్రంలో పేరుకుపోయింది. తిరుమలలో కూడా పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను రద్దు చేశాం... చెత్తనూ తొలిగించాం. 15 నెలల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మనం సాధించింది సామాన్య విజయం కాదు. జనవరి ఒకటి నాటికి ఏపీని జీరో వేస్ట్ రాష్ట్రంగా తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. 8,814 గ్రామాలు వీదీనీ+ మోడల్ గ్రామాలుగా, 6 జిల్లాలను వీదీనీ+ మోడల్ జిల్లాలుగా తీర్చిదిద్దుతాం." అని చంద్రబాబు చెప్పారు. అవార్డులు స్ఫూర్తి నింపుతాయిఇకపై ప్రతీ ఏటా స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇస్తాం. ఈ అవార్డులు స్వచ్ఛ సైనికులకు గుర్తింపుతో పాటు, ప్రేరణ ఇస్తాయి. అవార్డుల స్ఫూర్తితో స్వచ్ఛమైన, పచ్చనైన, ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేద్దాం. మన స్వచ్ఛ సంకల్పానికి మెచ్చి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఇచ్చింది. 202425 ఏడాదిలో రాష్ట్రానికి 5 అవార్డులు దక్కాయి. విజయవాడ, తిరుపతి, గుంటూరు, గ్రేటర్ విశాఖపట్నం, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లు పరిశుభ్రతలో రాష్ట్రం పేరు నిలబెట్టాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం, రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డును రాజమహేంద్రవరం దక్కించుకున్నాయి. స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీలుగా విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలో స్వచ్ఛతపరిశుభ్రత కోసం యజ్ఞంలా శ్రమించాం." అని సీఎం అన్నారు. ఒక్కో నెలా ఒక్కో థీమ్ "హోమ్ కంపోస్టింగ్, సోర్స్ సెగ్రిగేషన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, బీట్ ద హీట్, గ్రీన్ ఆంధ్రప్రదేశ్... ఇలా ఒక్కో నెలా ఒక్కో థీమ్‌తో ఫలితాలు సాధించాం. డోర్ టు డోర్ కలెక్షన్, లెగసీ వేస్ట్ క్లియరెన్స్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి చర్యలు తీసుకున్నాం. ప్రజల దగ్గర పొడిచెత్తను సేకరించి వారికి నిత్యావసరాలు తిరిగిచ్చేలా "స్వచ్ఛ రథం" తెచ్చాం. త్వరలో మరో 100 వంద మండలాల్లో 100 స్వచ్ఛ రథాలు తెస్తున్నాం. 1,09,169 సోక్ పిట్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. 106 గ్రామాల్లో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణం చేపట్టాం." అని ముఖ్యమంత్రి వివరించారు. ఆదాయ వనరుగా వ్యర్థ పదార్థాలు"స్వచ్ఛాంధ్ర కోసం వినూత్న ఆలోచనలు అమలు చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణలో మొదటి సవాల్ ప్లాస్టిక్. అందుకే ఆంధ్రప్రదేశ్‌ను సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఫ్రీ చేయాలని నిర్ణయించి స్టేట్ సెక్రటేరియట్ నుంచే ఇది ప్రారంభించాం. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని ట్రాక్ చేసేలా సంజీవని ప్రాజెక్టు మొదలు పెట్టాం. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ. 2.5 లక్షల విలువైన ఆరోగ్య బీమాను ఉచితంగా అందిస్తున్నాం. మంత్రులు నారాయణ, కొలుసు పార్థసారధి, స్వచ్ఛాంధ్ర ఛైర్మన్ పట్టాభి, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## పిడుగు పడి మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలి



పెదనందిపాడు అక్టోబర్ 6 (ప్రభాతవార్త)సెప్టెంబర్ 13 న పిడుగుపడి చనిపోయిన అన్నవర్రు వ్యవసాయ కార్మికులకు వెంటనే ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సి.పి.ఎం.పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. ఈ మేరకు బాధిత కుటుంబాల సభ్యులతో కలసి పెదనందిపాడు మండల తహసిల్దార్ హేనాప్రియ కు సోమవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 13 న అన్నవర్రు గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికులు దేవరపల్లి సామ్రాజ్యం, తన్నీరు నాగేంద్రం వర్షం రావడంతో పొలం పని నుండి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పిడిగుపడి అక్కడికక్కడే మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. వినతి పత్రం అందజేసిన వారిలో సి.పి.ఎం.మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, అన్నవర్రు బాధిత కుటుంబాలకు చెందిన దేవరపల్లి శ్రీనివాసరావు, తన్నీరు శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## జిఎంసీకి రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులు

గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025స్పెషల్ కేటగిరిలో గుంటూరు జిఎంసీ అవార్డు అందుకోవడం గర్వకారణంగా ఉందని, ఈ అవార్డు ని జిఎంసి ప్రజారోగ్య కార్మికులకు అంకితం ఇస్తున్నామని నగర మేయర్ కోవెలమూడి



రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు 2025 కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మేయర్, కమీషనర్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర ్భంగా మేయర్, కమీషనర్లు మాట్లాడుతూ దేశం రాష్ట్రం ఎక్కడైనా స్వచ్ఛ అవార్డు అంటే తప్పనిసరిగా గుంటూరు నగరపాలక సంస్థ నిలిచేలా గత ఏడాది కాలంగా ప్రజారోగ్య రంగాన్ని తీర్చిదిద్దా మన్నారు. ప్రధానంగా ప్రజారోగ్య విభాగ పటిష్టకు అదనపు కార్మికులు, వాహనాలు అందుబాటులో ఉంచడం, డ్రైన్లపై ఆక్రమణలు తొలగింపు, స్థానిక ప్రజా ప్రతినిధులైనప కార్పొరేటర్లును భాగస్వాములను చేయడం, వార్డుల్లో మెరుగైన పర్యవేక్షణకు ఎలక్షన్ వార్డుకి ఒక ఇన్‌స్పెక్టర్‌ని కేటాయించడం ద్వారా పారిశుధ్య విభాగంలో పెనుమార్పులు సాధ్యమయ్యాయన్నారు. ఈ అవార్డు రావడంలో కీలకమైన ప్రజారోగ్య కార్మికులకే అవార్డు ని అంకితం ఇస్తున్నామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల గుంటూరుజిల్లా స్థాయి బహుకరణ కార్యక్రమం సోమవారం శ్రీవేంకటేశ్వర విజ్ఞా ్ఞన మందిరంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ స్వచ్ఛత వారియర్స్ (పారిశుద ్య కార్మికులు) గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన కల్లా సుమలతకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులు, ప్రజాప్రతినిధులు అందించారు.

## ఓబన్న పోరాటం చారిత్రాత్మకం : తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : బ్రిటిష్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం, త్యాగం, వీరత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వడ్డె ఓబన్న వర్థంతి సందర్భంగా సోమవారం స్థానికతూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులరి ్పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ మొట్టమొదటి స్వాతంత్ర పోరాటయోధుడు, రేనాటి ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని పేర్కొన్నారు. నేటి రాయలసీమగా పిలవబడే ఆనాటి రేనాటి ప్రాంతంలో ఓబన్న తండ్రి గ్రామ రక్షకునిగా పనిచేశారన్నారు. అప్పట్లో గ్రామ రక్షకుల జీతాల రద్దు, రైతులపై అధికపన్నులు బలవంతపు శిస్తూ వసూళ్ళకు వ్యతిరేకంగా ఓబన్న పోరాట జెండా ఎ త్తుకున్నారని వివరించారు. ఓబన్న కేవలం 39సంవత్సరాలకే బ్రిటిష్ దొరలతో పోరాడి వీరమరణం పొందారన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు గంజం రాఘవేంద్ర, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ గౌస్, చల్లా అంజనేయ ప్రసాద్, చామర్తి ఆనంద్ సాగర్, వంగర ఏడుకొండలు, బత్తిని శంకర్, అచ్చి కిరణ్, గుంటి నరసింహారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అక్టోబరు6, ప్రభాతవార్త: వర్సిటీ వ్యాయామ కళాశాలలో పీజీ డిప్లమో ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ (ఒక ఏడాది), ఎంఎస్సీ ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్(రెండేళ్ళు), ఎంఎస్సీ యోగా లేటరల్ ఎంట్రీ కోర్సులకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పాల్‌కుమార్ తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7396458123, 9703000795 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఎంఎస్సీ యోగా ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో ఎంఎస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, డైటాటిక్స్ కోర్సుల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. 73మందికి 64మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 15లోగా ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలని సూచించారు.

## ఆరుగురు అధ్యాపకులకు రిలీవ్ నోటీసులు..!

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అక్టోబరు6, ప్రభాతవార్త: వర్సిటీ లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు నోటీసులు అందాయి. కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న నలుగురికి, దూరవిద్యలో పనిచేస్తున్న ఇద్దరు అకడమిక్ కౌన్సెలర్‌లకు సెప్టెంబరు 29న ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించారు. కొద్ది నెలల క్రితం 60 సంవత్సరాలు పూర్తయిన వారిని తొలగిస్తూ వర్సిటీ ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలపై కొందరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు సూచనల మేరకు సెప్టెంబరు 30 వరకు విధుల్లో కొనసాగారు. తాజాగా సెప్టెంబరు 29న వర్సిటీ నోటీసులు ఇచ్చింది. ఇదే కేటగిరిలో సుమారు 11మంది ఉండగా 6గురికి మాత్రమే నోటీసులు రావడంపై వర్సిటీలో చర్చనీయాంశమైంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు అర్జీలు


కాకుమాను అక్టోబర్ 6(ప్రభాత వార్త): స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు అర్జీలు అందినట్లు తహసిల్దార్ బి.వెంకటస్వామి మీడియాకు తెలిపారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి సత్వరమే అర్జీలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పురుగు మందుల షాపులో తనిఖీ

పెదనందిపాడు అక్టోబర్ 6 (ప్రభాతవార్త) మండల కేంద్రమైన పెదనందిపాడు లోనిఎరువులు, పురుగుమందులు దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం సోమవారం తనిఖీ చేశారు. పురుగు మందుల ఎక్స్పైర్ డేట్ ని పరిశీలించారు కొన్ని రకాల మందులను శాంపిల్స్ తీశారు. శాంపిల్స్ తీసిన మందులను తనిఖీ నిమిత్తం ప్రభుత్వ ల్యాబ్ కు పంపిస్తామని. వచ్చిన రిపోర్టును బట్టి వివరాలను పై అధికారులు దృష్టి కి తీసుకెళ్లి తేడా లు ఉన్న షాపులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు కూడా పురుగుమందులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా ఆయా షాపుల్లో రసీదులు తీసుకోవాలని సూచించారు. ఈషాపులు తనిఖీ కార్యక్రమాల్లో.మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం తోపాటు వ్యవసాయ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు ఒకేసారి 120 కోట్లు కేటాయించాలి

పెదనందిపాడు:అక్టోబర్ 6. (ప్రభాతవార్త) గుంటూరు చానల్ ను పర్చూరు వరకు పొడి గించేందుకు భూసేకరణ కోసం ఒకేసారి 120 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సి.పి.ఎం.పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. సోమవారం రాత్రి పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో జరిగిన



మండల కమిటీ సమావేశంలో రామారావు మాట్లాడారు. సమావేశానికి సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షత వహించారు. గుంటూరు చానల్ పొడిగింపు కు భూసేకరణ కోసం గ్రామ సభలు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ రేటు కంటే 4 రెట్లు ఎక్కువ ఇవ్వాలని , ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం , పెన్షన్ తప్పక ఇవ్వాలని ,2013 భూసేకరణ చట్టం నిర్ధేశిస్తున్నదని , ఆ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నల్లమడ ఆధునీకరణ కు నిధులు కేటాయించి కాల్వను వెడల్పు చేయడం , కట్టలు తెగకుండా బలోపేతం చేయాలని కోరారు. మండలం లో యూరియా కొరత తీవ్రంగా ఉందని , రైతు సేవా కేంద్రాలలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. కౌలు రైతులకు భూయజమాని సంతకంతో పనిలేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు లో పంట రుణాలు మంజూరు చేయాలని ,అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలని కోరారు. సి.పి.ఎం.మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని , వర్షం వస్తే నీరు రోడ్లమీదనే పారుతున్నదని , డ్రైనేజ్ వ్యవస్థ ని మెరుగుపరచాలని కోరారు. మంచినీటి వ్యవస్తను మెరుగుపరచాలని కోరారు. ఈసమావేశంలో సి.పి.ఎం.నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు ఫణిదపు భువనేశ్వరి, జ్యోతి కుమారి, అన్నలదాసు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి మండలానికి నాలుగు స్వచ్ఛఆంధ్ర అవార్డులు

సత్తెనపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : సత్తెనపల్లి మండలానికి నాలుగు స్వచ్ఛఆంధ్ర అవార్డులను కలెక్టర్ కృతికాశుక్లా సోమవారం అందజేశారు. 2025 ఏడాదికి మొత్తం నాలుగు అవార్డులు మండలంలోని గ్రామ పంచాయితీలకు రావడం సంతోషంగా ఉందని ఎంపిడివో బండి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటిస్తుందని, అదే బాటలో కూటమి ప్రభుత్వ స్వచ్ఛఆంధ్ర అవార్డులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాస్థాయిలో 16 విభాగాలలో నాలుగు పురస్కారాలు సత్తెనపల్లికి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భట్లూరు, గుడిపూడి, నందిగామ గ్రామ సర్పంచ్‌లు అవార్డులను అందుకున్నారు.

## టిడిపి ఎస్.టి.సెల్ అధ్యక్షులు శంకర్‌బాబునాయక్ మృతి



సత్తెనపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణ టిడిపి ఎస్.టి.సెల్ అధ్యక్షులు కేతావత్ శంకర్‌బాబునాయక్ కనుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న తెలుగుదేశంపార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్య శిబిరం

రాజుపాలెం, అక్టోబరు 6 ప్రభాతవార్త : మండలంలోని కొత్త బోధనం గ్రామంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాసరావు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు. వృద్ధులు, కంటిచూపు తగ్గిన వారికి, సమస్యలు ఉన్నవారికి శిబిరం ఎంతో ఉపయోగమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు గ్రామంలో తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ తోట శ్రీనివాసరావు తెలియజేశారు. గ్రామస్తులు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలను చేయించుకున్నారు. వైద్యసేవలు అందించిన హాస్పటల్ వైద్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## 75 తాళ్ళూరు హై స్కూల్‌కు "స్వచ్ఛ ఆంధ్ర" పురస్కారం



పెదకూరపాడు, అక్టోబరు 6 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు జెడ్పీ పాఠశాల కు సోమవారం నరసరావుపేట జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాన్ని హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. కలెక్టర్ కృతికాశుక్లాతో పాటు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు, డిఈవో ఎల్.చంద్రకళ, జిల్లా ఉన్నతాధికారులు, పెదకూరపాడు మండల ఎంఈవోలు ప్రసాదరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాన్ని అందుకున్న హెచ్ఎం శ్రీనివాసరెడ్డిని పలువురు గ్రామ పెద్దలు, డిఈవో చంద్రకళ, డివైఈవో ఏసుబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ జి.వి.హనుమంతరావు అభినందించారు.

## మురుగు వ్యర్థాల తొలగింపు.. "వార్త కథనాని"కి స్పందన

అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త : మండలంలోని ధరణికోట గ్రామంలోని బేడ బుడగ జంగాల



చెంచుకాలనీ ప్రజలు దుర్గంధంలో నివసిస్తున్నారని అధికారులు కన్నెత్తి చూడలేదని అక్టోబర్ 2న వార్త దినపత్రికలో శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన పంచాయితీ అధికారులు సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఎంపిపి ఆదేశాల మేరకు ఎంపిడివో చెంచుకాలనీలో మురుగు తొలగించాలని ఆదేశించారని కార్యదర్శి వివరించారు. వార్త కథనానికి అధికారులు స్పందించారని, మురుగు తొలగింపు చర్యలు చేపట్టారని చెంచుకాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవాలయానికి విరాళం



అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త : బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు విరాళం అందించారు. అమరావతికి చెందిన శంకరమంచి రవిశంకర్‌శర్మ – జయప్రద దంపతులు రూ.5 లక్షల విలువైన బంగారు నాన్‌తాడును కానుకగా సమర్పించారు. జ్వాలాముఖి అమ్మవారికి బంగారపు నాన్‌తాడును చేయించిన దాతలకు ఆలయ అధికారులు దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## నీట మునిగిన పంట పొలాల నష్టాల అంచనాల తయారీ రైతులకు మేలు కలిగేలా ఉండాలి

కొల్లూరు, అక్టోబరు 1 (ప్రభాతవార్త) : కృష్ణానది వరదల కారణంగా నీట మునిగిన పంట పొలాల నష్టాల అంచనాలు తయారు చేయుటలో రైతులకు మేలు కలిగే విధంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులకు తెలిపారు. బుధవారం కొల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కృష్ణానది వరదలపై లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.నోద్‌కుమార్, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉమామహేశ్వర్, సమావేశంలో పాల్గొని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్ శాఖ మంత్రి అగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానది వరదల కారణంగా ఎవరు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం కృష్ణానది వరద తగ్గు ముఖం పట్టిందని ఆయన తెలిపారు. వరదలు తగ్గిన తర్వాత పంట నష్టాలను జాగ్రత్తగా రైతులకు మేలు చేసే విధంగా అంచనా వేయాలని ఆయన అధికారులకు తెలిపారు. ఏ రకంగా రైతు నష్టపోకుండా వారికి మేలు చేసే గ్రామాల నుండి వరద నీరు వెళ్ళిన తర్వాత గ్రామం మొత్తం శానిటేషన్ చేయాలని, తాగునీటి పరీక్షలు చేయించి అంటూ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ వరదలు ప్రతి సంవత్సరం వస్తున్నాయని, వాటి వలన ప్రతిసారి నష్టం జరుగుతుందని, రివర్ కన్జర్వేటివ్ అధికారులకు వరద నీరు గ్రామాల్లోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వరదల నుండి ప్రజలను కాపాడాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణానది వరదల కారణంగా రేపల్లె మండలంలో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లెలో కొన్ని గ్రామాలు నీట మునిగాయని, మొత్తం 27హ్యాబిటేషన్లకు 27పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉన్నటువంటి ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. 27హాబిటేషన్‌లో గర్భవతులు ఎంత మంది ఉన్నారు, వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు, పునరావాస కేంద్రంలో ఎంత మంది గర్భవతులు ఉన్నారు, మొదలగు వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆయన అడిగారు. గర్భవతులను వారి బంధువుల ఇళ్లకు పంపడం జరిగిందని, ఒక గర్భవతి మాత్రం రీ హ్యాబిటేషన్‌లో ఉన్నారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం గర్భవతుల పరిస్థితి ఏ విధంగా ఉంది, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ప్రతిరోజు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారిని ఆదేశించారు. వరదల కారణంగా పంట నష్టం గురించి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులను ఆయన ఆరా తీశారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఏడు రోజుల్లోపు పంట నష్టాలను అంచనా వేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా రైతులకు మేలు చేసే విధంగా పంట నష్టాలను లెక్కించాలన్నారు. నష్టాల అంచనాలో ఏ ఒక్క రైతు నష్టం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన పంటలకే కాకుండా అన్ని పంటలపై నష్టాలు లెక్కించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కృష్ణానది ప్రవాహంపై జిల్లా కలెక్టర్ రివర్ కన్జర్వేటివ్ ఏఈలను ఆరా తీశారు. ప్రస్తుతం వరద నీరు తగ్గుముఖం పట్టిందని, కృష్ణానది బాపట్ల జిల్లాలోకి ప్రవేశించి సముద్రంలోకి కలిసే 67కిలో మీటర్ల కరకట్ట పరిస్థితి ఏమీ లేవని వారు కలెక్టర్కు వివరించారు. కరకట్టకు అత్యవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు తెలిపారు. కృష్ణానది వరదలకు సంబంధించిన లైన్ డిపార్ట్మెంట్ అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వరదలు ప్రతి సంవత్సరం వస్తూనే ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం వచ్చిన వరదల నుండి రైతులు ఇంకా కోలుకోని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ రేపల్లె, కొల్లూరు, భట్టిప్రోలు, పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, పౌరసరఫరాల అధికారి అమీర్‌బాషా, జెడి మత్స్య శాఖ అధికారి శ్రీనివాసనాయక్, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మీ, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా 14రోజులు దసరా ఉత్సవాలు



వినుకొండ, అక్టోబర్6, ప్రభాతవార్త: స్థానిక కొండమెట్ల వద్ద గల అతి పురాతనమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు దసరా పండుగ పురస్కరించుకొని ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో 14 రోజుల పాటు శరన్నవరాత్రుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హాజరై కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెదేపా బీసీ రాష్ట్ర నాయకులు, సీనియర్ న్యాయవాది పి. సైదారావు, మాజీ ఏజీపీ ఎన్. రామకోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినుకొండ, అక్టోబర్6, ప్రభాతవార్త: విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ జేఏసీ నాయకులు పి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ నెల 13వ తేదిన చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం వద్ద గోడపత్రులు ఆవిష్కరించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఈ నెల 15వ తేది నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

## జాతీయ క్రీడా పోటీల్లో జెడ్పి స్కూల్ విద్యార్థిని ప్రతిభ



వినుకొండ, అక్టోబర్6, ప్రభాతవార్త: తమళనాడులో సెప్టెంబర్ 25 నుంచి 28వ తేది వరకు జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో వినుకొండ జెడ్పి స్కూల్ పదో తరగతి విద్యార్థి బండారు రవళి ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.శైలజకుమారి తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయురాలు ఎస్ రూత్ మేరీ, ఈ మనీ కే రేణుక, ఉపాధ్యాయులు భవనేశ్వరి, చంద్రశేఖర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి



నూజెండ్ల, అక్టోబర్6, ప్రభాతవార్త: ఓడిఎఫ్ గ్రామాల వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యాన అధికారి, ఈపూరు మండల స్పెషల్ ఆఫీసర్ ఐ.వెంకట్రావు అధ్యక్షతన మండలంలోని ఉప్పలపాడు గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలోని ప్రైమరీస్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, దేవాలయాలు, చర్చి, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పలు గృహాల్లో ఉన్న మరుగుదొడ్లను సందర్శించినట్లు వారు తెలిపారు. అలాగే గ్రామ సచివాలయం నందు సర్పంచ్ ఆదిలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులకు ఓడిఎఫ్ గ్రామాలపై, జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈపూరు మండల డిప్యూటీ ఎంపిడివో వెంకట రామకృష్ణ, హార్టికల్చర్ ఆఫీసర్ రసూల్, కార్యదర్శి రవీంద్రబాబు, ఈపూరు మండల కో ఆర్డినేటర్ బొల్లా సుబ్బారావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండ రూరల్ నూతన సీఐగా బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకారం



వినుకొండ, అక్టోబర్6, ప్రభాతవార్త: వినుకొండ రూరల్ నూతన సీఐగా బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే సంఘ విద్రోహులపై, చట్టాన్ని అతిక్రమించేవారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ బ్రహ్మయ్య హెచ్చరించారు.

## రెండు రోజులపాటు మండల స్థాయి ఆటల పోటీలు



నూజెండ్ల, అక్టోబర్6, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు మండలకేంద్రమైన నూజెండ్ల జెడ్పి స్కూల్‌నందు మండల స్థాయి ఆటల పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని స్కూల్ హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. సోమవారం ఈ మేరకు నిర్వహించిన మండల స్థాయి పీడీ, పీఈటి సమావేశం నందు వివరాలు వెల్లడించారు. ఈ నెల 8,9వ తేదిల్లో రెండు రోజుల పాటు ఈ ఆటల పోటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## మంగళగిరికు చెందిన ఇద్దరికి ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ.

మంగళగిరి, అక్టోబర్ 6, ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు సోమవారం బాధితులకు అందజేశారు. ఎన్‌సీసీ రోడ్డుకు చెందిన కొండా శ్రీనుకు రూ. 2 లక్షలు, బాపూజీ నగర్‌కు చెందిన నాగేళ్ల మణికంఠకు రూ. లక్షా 20 వేల విలువైన లెటర్ ఆఫ్



క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కులను అందజేశారు. ఎల్‌వోసీ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్ కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, రాష్ట్ర పద్మశాలియ సాధికార కమిటీ సభ్యులు ఊట్ల శ్రీమన్నారాయణ, 24వ వార్డు అధ్యక్షులు గంజి చంద్రశేఖర్, శ్రీలక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గుంటి నాగరాజు, వడిశా నరేష్, నక్కా రాజశేఖర్, కనకరాజు, మరి ఏసుబాబు, పిన్నిబోయిన నరేంద్ర, వెలుగోటు అన్నపూర్ణమ్మ, దామర్ల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ గ్రీవెన్స్ కి 3అర్జీలు:

తెనాలి టౌన్ అక్టోబర్ 6 (ప్రభాతవార్త): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్ )నందు మూడు ఫిర్యాదులు స్వీకరించటం జరిగిందని, మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా మూడవ వార్డు నుండి మురుగు నీటి కాలువలు నిర్మాణం చేయాలని, 32వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని, అలాగే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ పై మొత్తం మూడు అర్జీలు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ, ప్రణాళికాబద్ధంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని, అలాగే పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టిపెట్టి మరింత మెరుగు పరుస్తామని, ఆయన తెలిపారు. అంతేకాకుండా మున్సిపల్ కార్యాలయంలోని కొన్ని విభాగాల్లో, లోపాలు తన దృష్టికి వచ్చినట్లు వాటిని కూడా పరిష్కరిస్తానని కమిషనర్ రామ అప్పలనాయుడు పేర్కొన్నారు.

## మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారం

మాచర్ల, అక్టోబరు 6 ప్రభాతవార్త: మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి (సిహెచ్‌సీ) జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు వరించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు, పల్నాడు జిల్లా డీసీహెచ్ఎస్ డా॥



ఎం.ప్రసూన చేతుల మీదుగా మెడికల్ సూపరింటెండెంట్ డా॥ కేపీ చారి, స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పాటించిన పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై నిర్వహించిన జిల్లాస్థాయి సర్వేలో ఆసుపత్రి అన్ని విధాలుగా ముందంజలో ఉందని గుర్తించి అవార్డు ఇచ్చామన్నారు. ఆసుపత్రి సిబ్బంది కృషిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ కేపీ చారి మాట్లాడుతూ మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పాటించిన స్వచ్ఛతా నియమాలు, పరిశుభ్రతపై జరిగిన జిల్లా స్థాయి సర్వేలో మాచర్ల సీహెచ్‌సీకి ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా, ప్రోత్సాహంగా ఉందన్నారు. డాక్టర్లు, వైద్యసిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది చేసిన కృషి ఫలితంగా ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న మెడికల్ సూపరింటెండెంట్ చారిని కలిసి ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది అభినందించారు.

## అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లుండాలి: వామపక్ష నేతలు

మాచర్ల, అక్టోబరు 6 ప్రభాతవార్త: అర్హులైన ప్రతిపేదవానికి నివేశన స్థలంతోపాటు ఇంటి నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఎంసీపీఐయు నేతలు సోమవారం తహశీల్దారు



బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మిద్దెపోగు బాబురావు, మాచవరపు నాగేశ్వరరావు, కోమటి శివయ్యల ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు ఎవరు మారినా పేదల స్థితిగతులు మారడం లేదన్నారు. గృహ నిర్మాణాలకు యోగ్యంగా ఉండే భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇళ్లస్థలాలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన నివేశన స్థలాలు ఉపయోగకరంగా లేవన్నారు. కేవలం నాయకుల జేబులు నింపుకోవడం కోసమే కాలనీలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలను ఇవ్వాలన్నారు. అదేవిధంగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 450 అర్జీలను తహశీల్దారుకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరి కిరణ్, వడ్లమాను కోటేశ్వరమ్మ, మేరమ్మ, శాంతమ్మ, రామాంజి, కోటేశ్వరరావు, కృపమ్మ, చిన్న యేసు, చంద్రమ్మ, నాగయ్య, భాగ్యమ్మ, సుగుణ, చంద్రకళ, ప్రభావతి, గాలయ్య, సీత, నీలమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేసీపీ సిమెంటు ఫ్యాక్టరీకి స్వచ్ఛాంధ్ర అవార్డు

మాచర్ల, అక్టోబరు 6 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని కేసీపీ సిమెంటు ఫ్యాక్టరీకి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టరు కృతిక శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే



అరవింద్‌బాబు చేతుల మీదుగా ఈ అవార్డును కేసీపీ యూనిట్ హెడ్ వి.వెంకటరమణ అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పరిశ్రమలో పాటిస్తున్న భద్రతా నియమాలు, కార్మికుల సంక్షేమం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలపై జరిగిన సర్వేలో మాచర్ల సిమెంటు పరిశ్రమకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణను ఫ్యాక్టరీ వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, కార్మికులు అభినందనలు తెలిపారు.

## మరుగుదొడ్లపై ఓడీఎఫ్ ప్లస్ డిక్లరేషన్ బృందాల పరిశీలన

కారంపూడి, అక్టోబరు 6 ప్రభాతవార్త: కారంపూడి మండలంలో ఓడీఎఫ్ ప్లస్ డిక్లరేషన్ కోసం నియమించిన బృందం సోమవారం పర్యటించింది. ఈ బృందంలో గురజాల డిప్యూటీ ఎంపీడీఓ కొసరాజు సుబ్బారావు టీం సభ్యులు, దుర్గి డిప్యూటీ ఎంపీడీఓ పురుషోత్తమరాజు, ఎంసీఓ బెంజిమన్ టీం సభ్యులు ఉన్నారు. చిన్నకొదమగుండ్ల, చింతపల్లి, మిరియాల, నరమాలపాడు, ఒప్పిచర్ల,



పెద్దకొదమగుండ్ల, పేటసన్నెగండ్ల గ్రామాల్లో, ప్రభుత్వ సచివాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాల్లో అందరికీ మరుగుదొడ్లు ఉన్నవా లేవా అని పరిశీలించి గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. అదేవిధంగా కార్యాలయాల్లో కూడా మరుగుదొడ్లను పరిశీలించారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు రవీంద్ర, గడిపూడి వెంకటేశ్వర్లు, ఎస్వీ రామరాజు, గ్రామ పంచాయతీల సిబ్బంది రామారావు, సాగర్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం - ప్రజల ఆవేదన

కారంపూడి, అక్టోబరు 6 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరా సమస్యలు మామూలైపోయాయి. ప్రజలు రాత్రింబగళ్లు ఇబ్బందులు పడుతున్నా విద్యుత్తు శాఖ నిర్లక్ష్య ధోరణి మారడం లేదు. సమస్యల పరిష్కారం కంటే వ్యక్తిగత సంపాదనే ప్రధానమని స్థానికులు మండిపడుతున్నారు. ఒకేచోట సిబ్బంది సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తుతన్నారు. పనిలో మార్పులు రావడం లేదు. అదే కారణంగా నిర్లక్ష్యం అలసత్వం పెరిగిపోయాయయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా మార్పులు జరగకపోవడంతో గ్రామాల్లో పరిస్థితి యథాతథంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం విద్యుత్తు సిబ్బందిని సంప్రదిస్తే డబ్బులు ఇవ్వకపోతే పనులు జరగడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్





దెబ్బతిన్నా, లైన్‌లో లోపాలు వచ్చినా సకాలంలో స్పందించడం లేదు. ఒక పని జరగాలంటే తప్పనిసరిగా పరిచయం లేదా, డబ్బు పెట్టాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే సమస్యకు మూలకారణమని గ్రామస్థులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తనిఖీలు జరిగితే సిబ్బందికి భయం ఉండేది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తి విరుద్ధంగా ఉంది. ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఒక బల్బు వెలగకపోయినా జీవితం కష్టమవుతుంది. అలాంటిది ట్రాన్స్‌ఫార్మర్ సమస్య తరచూ జరిగే విద్యుత్తు అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. విద్యుత్తు శాఖ అధికారులు సమస్యలపై శ్రద్ధ చూపకపోవడంతో బాధలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. మాకు సమస్యలు చెప్పడానికి కూడా వినేవారు లేరు. పై అధికారులు కఠిన చర్యలు తీసుకుని సిబ్బంది విధానంలో మార్పులు తేవాలి, లేకపోతే మా బాధలు ఎప్పటికీ తీరవు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## కాచిచల్లార్చిన నీటిని తాగండి: మున్సిపల్ ఛైర్మన్ రాధిక.



తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 6 (ప్రభాతవార్త): వర్షాకాలం కావటం, తాగు నీరు కలుషితమోటం వల్ల అనారోగ్య బారిన పడకుండా వుండాలంటే ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డు నందు నిర్వహించిన మెయిన్ డ్రైవ్, స్పెషల్ శానిటేషన్ వర్క్ పనులను పర్యవేక్షణ చేసి మునిసిపల్ అధికారులకు శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చిన మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత, మునిసిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మువ్వా ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, ఇంచార్జి ఏఈ జానీబాషా, కళ్యాణ్, ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## జస్టిస్ లక్ష్మణరావు కాంస్య విగ్రహం రూపొందించిన సూర్య శిల్పశాల

తెనాలి టౌన్ అక్టోబర్ 6 (ప్రభాతవార్త): పట్టణానికి చెందిన సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, దివంగత రిటైర్డ్ జస్టిస్ డా. అంబటి లక్ష్మణరావు, కాంస్య విగ్రహం రూపొందించారు. జస్టిస్ డా. అంబటి లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన



న్యాయమూర్తిగా, తరువాత అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించి పదవీ విరమణ పొందారని, పదవీ విరమణ అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) సెక్రటరీగా, కిసాన్ ఫారం అధ్యక్షులుగా, లోక్‌సత్తా అధ్యక్షులుగా, రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలకులుగా, రాష్ట్ర మద్యపాన నిషేధ సంఘం అధ్యక్షులు వంటి పలు బాధ్యతల్లో విశేష సేవలు అందించిన జస్టిస్ డా. అంబటి లక్ష్మణరావు విగ్రహం స్వగ్రామమైన పొన్నూరు మండలం, వెల్లలూరు గ్రామంలో ప్రతిష్ఠించనున్నట్లు, ఏడు అడుగుల ఎత్తులో, 300 కిలోల కాంస్యంతో రూపొందించిన ఈవిగ్రహం తయారు చేయడానికి మూడు నెలల సమయం పట్టిందని, ఈనెల 12వ తారీకున విగ్రహాన్ని ఆవిష్కరించ నున్నట్లు, సోమవారం విగ్రహాన్ని వెల్లలూరు తరలించామని శిల్పులు కళా రత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర లు ఒక ప్రకటనలో తెలిపారు.

## పట్టణ మాస్టర్ ప్లాన్ పై కీలక సమావేశం:

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 6 (ప్రభాతవార్త): పట్టణ అభివృద్ధి పై మాస్టర్ ప్లాన్ రూపొందించటానికి కీలక సమావేశాన్ని, స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు నిర్వహించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలు నందు నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక



కమిషనర్ రామ అప్పలనాయుడు ఇతర కౌన్సిలర్లు పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వేరే ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవ్వాల్సి ఉండటంతో, హాజరు కాలేకపోయారు. పట్టణ మాస్టర్ ప్లాన్ ను ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థ ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు, తమ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్ ను సమావేశానికి విచ్చేసిన ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, రాజధాని అమరావతికి సమీపంగా ఉండటం తెనాలి పట్టణ ప్రత్యేకతని, రాబోయే రోజుల్లో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, పట్టణ అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండే విధంగా, అలాగే విజన్ 2047 లక్ష్యంగా పట్టణ అభివృద్ధి చేసే అంశాలను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్వీ కన్సల్టెన్సీ వారికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పలు సూచనలు చేశారు. అంతేకాకుండా పుర ప్రముఖులు కౌన్సిలర్లు పట్టణ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి కొన్ని ప్రతిపాదనలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ రామ అప్పలనాయుడు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, ఇతర పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, మేధావులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరిమృతి, ఇద్దరి పరిస్థితి విషమం:

తెనాలి టౌన్ అక్టోబర్ 6 (ప్రభాతవార్త): తెనాలిచందోలు మార్గంలో, పట్టణంలోని వైకుంటపురం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో, ఒకరు మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు బాపట్ల మండలం అప్పికట్లకు చెందిన నాయబ్ రసూల్ గా గుర్తించారు. మృతుడు పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలోని తమ బంధువుల ఇంట గార్మి




పండుగ వేడుకలకు విచ్చేసినట్లు, తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో తన బంధువులైన గౌస్ బాషా చిన్నారి నసీం లతో కలిసి బైక్ పై వెళుతుండగా వైకుంటపురం వద్ద వెనక నుండి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంలో రసూల్ మృతి చెందగా, భాష వసీం తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు 108 లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అధైర్యపడొద్దు...న్యాయం జరిగేలా చూస్తా..!!

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, అక్టోబరు 6 ప్రభాతవార్త: అధైర్యపడొద్దు...మీకు అండగా ఉండి న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ దొంగతనం జరిగిన ఇంటి బాధితులకు హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని తూములూరులో ఇటీవల దొంగతనం జరిగిన మోటూరు మధుసూధనరావు గృహాన్ని మనోహర్ సందర్శించారు. మధుసూధనరావు కుటుంబ సభ్యులతో దొంగతనం ఎలా జరిగిందని మనోహర్ వివరాలు అడిగారు. దీంతో మధుసూధనరావు జరిగింది



చెబుతూ తమకు న్యాయం చేయాలని మనోహర్ వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటి తాళాలు పగల కొట్టి ఇంటిలోని బంగారం వస్తువులను దోచుకెళ్ళారని దాని విలువ సుమారు రూ.10 లక్షల విలువ ఉంటుందని తెలిపారు. తాను చెరుకుపల్లి మండలం రాజోలు రైస్‌మిల్లు నడుపుతూ వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెలుతున్నానని తన భార్య, కుమారుడు దసరా పండుగను పురస్కరించుకుని బంధువుల ఇంటికి వెళ్ళటంతో ఇది గమనించిన దొంగలు తాళాల పగులకొట్టి బంగారం దోచుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. ఈ దొంగతనానికి సంభంధించి చుట్టుప్రక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి చేరుకున్న తాము బీరువాలో చూడగా అందులోని నగలు లేవని వెంటనే తాము కొల్లిపర పోలీసులకు పిర్యాదు చేసామన్నారు. దీంతో మనోహర్ స్పందిస్తూ దొంగలను పోలీసులు తప్పక పట్టుకుంటారన్నారు. బాధపడవద్దని కొద్ది రోజుల్లోనే మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామి ఇచ్చారు. డీఎస్పీ జనార్ధననరావు, సిఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావులతో గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాల పట్ల అజాగ్రత్త వహించరాదని ..రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను..గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మున్నంగి వెళ్ళిన మనోహర్ ఇటీవల మృతి చెందిన ఆళ్ళ శేషిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి శేషిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మనోహర్ వెంట నాయకులు అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిషోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, నూలు చిన్నా, తాతా శివయ్య తదితరులు ఉన్నారు.

## హౌసింగ్‌కాలనీ వాసులు దర్నా..

కొల్లిపర, అక్టోబరు 6 ప్రభాతవార్త: సీపీఎం పార్టీ నాయకులు ములకా శివసాంబిరెడ్డి ఆద్వర్యంలో సోమవారం కొల్లిపర తహశీల్థార్ కార్యాలయం వద్ద గుదిబండివారిపాలెం హౌసింగ్‌కాలనీ వాసులు కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దర్నా నిర్వహించి గ్రీవెన్స్‌లో డిప్యూటి తహశీల్దార్ రాజేష్, ఎంపీడీఓ విజయలక్ష్మీలకు వినతి పత్రం అందించారు. దీనికి వెంటనే స్పందించిన ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఈవోపిఆర్‌డీ భార్గవ్, గ్రామ కార్యదర్శి అలకనందతో కలసి కాలనీని సందర్శించారు. తక్షణమే రెండు లక్షల రూపాయలతో రహదారులకు గ్రావెల్ తొలించడం..పోయిన చోట విద్యుత్ లైట్లు రెండు రోజుల్లో వేయించడం..గడ్డి మందు..దోమల నివారణ మందులు చల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో చందూరు పద్మ, పీ.శ్రీలత, సయ్యద్ రెహానా, చందోలు పద్మ, కె.దుర్గా, సొంటి శివ నాగదుర్గా, ఎం.వెంకటేష్, మాచర్ల తులశమ్మ, షేక్. సర్తాజ్, కె.వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రజా సమస్యల పరిష్కరించడంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి

బాపట్ల, అక్టోబర్06, ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారించడంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 64 మంది అర్జీ దారులు వారి



సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అర్జీలను చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుండి భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు ఇతర పలు సమస్యలపై వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా పోలీస్ అధికారులను హెచ్చరించారు, అర్జీలను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలకు సంబందించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంకు పంపాలని ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

బాపట్ల, అక్టోబర్ 6, ప్రభాతవార్త: అభివృద్ధి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి కావాలంటే భూ సేకరణ ప్రక్రియను నిర్దిష్ట సమయంలో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను



ఆదేశించారు జిల్లాలో ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన కీలక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పెండింగ్ సమస్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సోమవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో రొంపేరు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ, గుంటూరు కాలువ ఆధునికీకరణ, పట్టణాల్లో మలినజల శుద్ధి కేంద్రాల ఏర్పాటు, రిన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చరింగ్ జోన్, అలాగే జాతీయ రహదారుల పనులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తవాలంటే భూసేకరణ ప్రక్రియను నిర్దిష్ట గడావుకాలంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మీ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే అధికారులు మరియు భూసేకరణ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది

బాపట్ల, అక్టోబర్6, ప్రభాతవార్త: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా క్లాప్ మిత్రులు పనిచేయడం ద్వారానే బాపట్ల జిల్లాకు విరివిగా అవార్డులు లభించాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. తొలుత వేడుకల ప్రారంభ సూచికగా జిల్లా కలెక్టర్ జ్యోతిని వెలిగించి, గాంధీజీ చిత్రపటానికి పుష్పమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్యా, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రానున్న మూడు నెలలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదిస్తున్నామన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం కొనసాగుతుందన్నారు. వ్యర్థాలను పద్ధతి ప్రకారం తొలగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెత్త సంపద కేంద్రాలు సమర్ధంగా నిర్వహిస్తామన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర 2047 భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రతి నెల ఒక అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుని లక్ష్యాల సాధన దిశగా ముందుకు వెళ్లామన్నారు. ప్రజాప్రతితులు, అధికారులు సంయుక్తంగా పనిచేశారని ఆయన ప్రశంసించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో కె పి ఐ సి పక్కాగా అమలు జరుగుతుందన్నారు. అవార్డులు సాధించేలా కృషిచేసిన క్లాప్ మిత్రులను సన్మానించుకోవడం శుభపరిణామం అన్నారు. స్వాతంత్రం కంటే పారిశుద్ధం ముఖ్యమని, పరిసరాల పరిశుభ్రతతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని రానన్న రోజుల్లో బాపట్ల జిల్లా అన్ని రంగాలలో రాష్ట్రంలోనే తృతీయ స్థానంలో నిలవాలన్నారు. ఇందుకోసం అధికారులు, ఉద్యోగులంతా కృషి చేయాలన్నారు. ప్రజా ఉద్యమంగా మారిన పరిశుభ్రతను ముందుకు తీసుకెళ్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పర్యావరణం, రవాణా, పరిశ్రమలు, గ్రామీణ అభివృద్ధి అధికారులను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వ్యర్థాలను వనరులుగా మార్చడం, పరిశ్రమలలో పచ్చదనం సమర్థంగా అమలు చేయడం సంతోషదాయకమన్నారు. ఆరోగ్యకరమైన పోటీలో జవాబుదారీతనంతో అధికారులు చక్కగా పనిచేశారని అభినందించారు. పారిశుధ్య కార్మికులను అవార్డులతో ప్రశంసించడం ద్వారా వారిలో స్ఫూర్తి నింపుతున్నామన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు సాధించడం అభినందనీయమన్నారు. జిల్లాలో వివిధ రంగాలకు 49 అవార్డులు లభించడం సంతోషదాయకం అన్నారు. మీరంతా పరిశుభ్రమైన బాపట్ల జిల్లాకు రూపశిల్పిలుగా ఉన్నారని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికబద్ధంగా ఎఫ్ ఎస్ టి పి లు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. 146 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గాంధీజీ స్ఫూర్తితో పారిశుధ్య కార్యక్రమాలు జిల్లాలో సమర్థంగా నిర్వహించామని ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు. పారిశుధ్య కార్మికుల వల్లనే ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. బాపట్ల జిల్లాలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సమర్థంగా కొనసాగుతోందన్నారు. మొక్కలు నాటడం, పెంచడం ద్వారా పర్యావరణ ఆహ్లాదంగా మారుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకున్నామన్నారు. ఆదర్శమైన జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దడానికి యంత్రాంగం కంకణబద్ధులై ఉండడం శుభ పరిణామం అని బుడా ఛైర్మన్ చలగాల రాజశేఖర్ బాబు తెలిపారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో బాపట్ల జిల్లా తమ వంతు పాత్ర పోషిస్తున్నదన్నారు. సమాజం పరిశుభ్రంగా ఉండడానికి నిత్యం కష్టపడే పారిశుధ్య కార్మికులను సన్మానించడం అభినందనీయమన్నారు. సమాజం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సంకల్పించడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ప్రతి ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరుపరిచి, రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతకు పెద్దపీట వేసిందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి చెప్పారు. గాంధీజీ కలల కన్నా స్వచ్ఛభారత్ వైపు కేంద్రం అడుగులు వేస్తుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం వెంకటరమణ తెలిపారు. పరిసరాలు బాగుంటే, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని భావించి రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛంద కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించిందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న శ్రీనివాసరావు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జిల్లాలో బాగా జరిగాయన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచేవారిని సన్మానించడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, డిపిఓ ప్రభాకర్ రావు, వివిధశాఖల జిల్లా అధికారులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి లడ్డూ రూ.12వేలు

పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి గౌడపాలెంలో నిర్వహించిన శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రతి నిత్యం అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కుంకుమార్చనలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, గోత్రా నామార్చనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు



సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 25కిలోల లడ్డును ఆరేపల్లి గోపీకృష్ణ రూ.12వేలకు వేలంపాటలో దక్కించుకొన్నారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్నానని, అమ్మవారి లడ్డు వేలం పాట నిర్వహిస్తున్నారు.....తాను కూడా పాడుదామని పాటలో పాల్గొన్నారు. పాటలో పాల్గొన్న తర్వాత ఎలాగైన లడ్డూను చేజిక్కించుకోవాలనే ఆకాంక్ష నాలో బలంగా నాటుకొందున్నారు. దీంతో లడ్డూను వేలంలో గెలుచుకోవడం జరిగిందన్నారు. ఈ లడ్డూను చుట్టాలకు, స్నేహితులకు, ఇరుగుపొరుగు వారికి పంపిణీ చేస్తానన్నారు. అమ్మవారి లడ్డును పాటలో గెలుపొందడం చాలా సంతోషంగా, ఆనందంగా ఉందన్నారు.

## పీజీఆర్ఎస్‌కు ఐదు అర్జీలు



పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఐదు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ చెప్పారు. అందులో రెవెన్యూకు సంబంధించి-2, సర్వేకి సంబంధించి ఒకటి, విద్యుత్‌శాఖకు సంబంధించి ఒకటి, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక అర్జీ అందినట్లు చెప్పారు. వీటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్‌ను సమస్యలున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక వికలాంగుని ఇరువురు వ్యక్తులు అతి కష్టం మీద పీజీఆర్ఎస్‌కు తీసుకు వస్తున్న విషయాన్ని గుర్తించిన తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తన సీటు నుండి దిగి బయట వరండాలోకి వచ్చి, వికలాంగుని వద్ద నుంచి అర్జీని స్వీకరించారు. వికలాంగులను నిరీక్షించేవిధంగా చేయకూడదని, వారికి సంబంధించిన పనిని తక్షణమే చేయించి పంపించేవిధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఏఎస్‌ఓ నల్లాని ప్రసాద్, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల విద్యాశాఖాధికారి దూపం రాజు, మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు సామూహిక ఎలుకల నియంత్రణా కార్యక్రమం

పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: ఎలుకల నివారణకు మంగళవారం సామూహిక ఎలుకల నియంత్రణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. అందుకు సంబంధించి అన్ని రైతు సేవా కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాల వద్ద ప్రభుత్వం ఉచితంగా అందించే బ్రోమోడయోలిన్ ఎలుకల నియంత్రణపు విషపు ఎర మందును తయారు చేశారు. రైతులందరూ ఈ మందును తీసుకొని వారివారి పొలాల్లో నూకలతో కలిపి ఎలుక బొరియలలో వేయాలని సూచించారు. అందరూ ఒకే సమయంలో ఈ విషపు ఎరను ఉపయోగించినట్లయితే ఎలుకలను నియంత్రించేందుకు వీలు కలుగుతుందన్నారు. రైతులు అన్నీ రైతు సేవా కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాల వద్ద వ్యవసాయ సహాయకులను కలిసి మందును తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ జిల్లా గవర్నర్‌గా నాగభూషణరావు

పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: వాసవిక్లబ్ 217-ఎ జిల్లా గవర్నర్‌గా నంబూరు నాగభూషణరావు



ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెనాలిలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల అధికారి పువ్వాడ నారాయణ నంబూరు నాగభూషణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. వెల్లటూరు వాసవిక్లబ్‌కు చెందిన నాగభూషణరావు, గుంటూరు క్లబ్‌కు చెందిన మున్నలూరి గౌరీశంకర్ నామినేషన్ దాఖలు చేశారు. నంబూరు నాగభూషణరావు ఎన్నిక కావడం పట్ల ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు, స్థానిక వాసవిక్లబ్ జోన్ ఛైర్మన్ ఆకి కిషోర్, రామకృష్ణ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## చదరంగంలో కేశవ అభిరామ్‌కు ద్వితీయస్థానం



పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 చదరంగం పోటీలలో పట్టణంలోని తెలగపాలెంకు చెందిన పాపన కేశవ అభిరామ్ చెస్ అకాడమీ తరపున ఆడి ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకొన్నాడు. దీంతో అభిరామ్ డివిజన్‌స్థాయి పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా చెస్ కోచ్ బాషా అభిరామ్‌ను అభినందించారు. అభిరామ్ ద్వితీయస్థానాన్ని సాధించడం పట్ల బిజెపి నాయకులు కలపాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి, గోవాడ వెంకటకృష్ణారావు, పలువురు స్నేహితులు అభినందించారు.

## నేడు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ తయారీకి అవగాహనా సదస్సు



పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి అధారిటీ(సీఆర్‌డిఏ) ప్రాంతానికి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసే బాధ్యతను ఆర్వే ఇంజనీరింగ్ కన్సల్‌టెన్సీ లిమిటెడ్, హైదరాబాదు వారికి అప్పగించినట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. సీఆర్‌డిఏ ప్రాంతము కోసం మాస్టర్ ప్లాన్, విజన్ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, పౌరులు, సంస్థలు, కమ్యూనిటీ సమూహాలతో సంప్రదించి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు పట్టణ పౌరులు, పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, విద్యావేత్తలు, బిల్డర్లు, డెవలపర్లు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌తో అభిప్రాయ సేకరణ సదసుస నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి పట్టణంలోని పౌరులందరూ హాజరై వారి అభిప్రాయాలను, సూచనలను, సలహాలను ఇవ్వాలని కోరారు. సీఆర్‌డిఏ విజయవాడ ఆదేశాల ప్రకారం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

## అవార్డులు అందుకున్న పంచాయితీ సిబ్బంది

పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: చేబ్రోలు పంచాయితీ సర్పంచి పచ్చిగండ్ల వినీతారాణి, పంచాయితీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందుకున్నారు. ఇటీవల స్వచ్ఛతా అవార్డులను ప్రకటించిన సంగతి పాఠకులకు విధితమే. అందుకు



సంబంధించిన అవార్డులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అందజేశారు. చేబ్రోలు పంచాయితీ స్వచ్ఛ అవార్డుతోపాటు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా నాల్లపాటి రాఘవమ్మకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవార్డు ఒకరికి మాత్రమే ప్రత్యేకంగా ఇచ్చింది కాదని, ఈ అవార్డులో స్వచ్ఛతలో సేవ చేసినందుకు ఇవ్వడం జరిగిందన్నారు. చేబ్రోలులోని ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబానికి ఈ ప్రశంసలు చెల్లుతాయన్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యవర్థాల వల్ల కలుషితమైన నీరు, గాలి, ఆహారం నేలతో పాటు తల్లి పాలలో కూడా మైక్రో ప్లాస్టిక్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు కృషి చేయాలని కోరారు.

## స్వచ్ఛ పురపాలక సంఘ అవార్డులు ప్రధానం

పొన్నూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త: స్వచ్ఛ పురపాలక సంఘంగా ఎంపికైన పొన్నూరు మునిసిపాలిటీ స్వచ్ఛ అవార్డును సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అందుకొన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం వివిధ థీములతో ముందుకు సాగేవిధంగా ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రణాళికలను పట్టణంలో తు.చ తప్పకుండా పాటించడంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్లరమేష్‌బాబు స్వయంగా చిత్తశుద్ధితో పనిచేయడంతోపాటు సిబ్బందిని కూడా పరుగులు పెట్టించి పొన్నూరు మునిసిపాలిటీని స్వచ్ఛ మునిసిపాలిటీగా గుర్తించే విధంగా చేశారు. దీంతో ఉన్నతాధికారులు నిర్వహించిన సర్వేలో పొన్నూరు అవార్డుకు ఎంపికైంది. అంతేకాకుండా స్వచ్ఛ వైద్యశాలగా నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్



సెంటర్ కూడా ఉత్తమ ఆసుపత్రిగా ఎంపికైంది. ఉత్తమ పొదుపు సంఘాలలో భాగంగా అంబేద్కర్ కాలనీ, సిద్ది వినాయకనగర్ సంఘాలు కూడా అవార్డులకు ఎంపికయ్యాయి. ఉత్తమ కార్మికుడిగా వడ్డాది శ్రీనివాసరావు ఎంపికయ్యారు. వీరికి జిల్లా కలెక్టర్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న కమిషనర్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, డిఇ వెంకయ్య, పట్టన ప్రణాళికాధికారి రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది, నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు అభినందించారు.

## న్యాయమూర్తులు సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావడం అభినందనీయం : ప్రత్తిపాటి




చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: న్యాయాన్ని పరిరక్షించడమే కాకుండా, న్యాయమూర్తులు సమాజ శ్రేయస్సు కోసం, ప్రకృతి పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేయడం స్వాగతించాల్సిన అంశమని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. బొప్పూడి గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సమక్షంలో గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాల దివ్య వనంలో జరిగిన నక్షత్ర వనమహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి, వివిధ శాఖల అధికారులతో కలసి ప్రత్తిపాటి మొక్కలు నాటారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ బొప్పూడి గ్రామానికి చెందిన ఎందరో వ్యక్తులు వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో ఉండటం సంతోషకరమని, వారి సహకారంతో గ్రామం వేగంగా అభివృద్ధి చెందిందని, గ్రామాభివృద్ధికి తగిన సహాయసహకారాలు అందించడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ప్రత్తిపాటి తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్ గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. కొండపై ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లే రహదారిని మరింత అభివృద్ధి చేయాలని, అందుకు వారు సహకరించాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. బొప్పూడి గ్రామానికి చెందిన సంపన్నులు, ఎన్ఆర్ఐలు, వివిధ రంగాలలో ఉన్న ప్రముఖులు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4 విజయవంతానికి తమ వంతు కృషి చేయాలని ప్రత్తిపాటి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సత్సంకల్పమైన పేదరికి నిర్మూలనలో భాగస్వాములై తమ తమ గ్రామాలలోని పేదల అభ్యున్నతికి సహకరించాలని ప్రత్తిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి, స్థానిక కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యంపై జగన్ విష ప్రచారం : పత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: తన స్వప్రయోజనాల కోసం జగన్ ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్దిపొందాలని చూస్తున్నాడని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. సోమవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో, వారికి అందించే సంక్షేమ పథకాలలో కూటమి ప్రభుత్వం ఎంత చురుకుగా పనిచేస్తుందో, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే, ప్రజలకు చెడు చేసే ఎటువంటి ఘటనలు, అంశాలపై అయినా అంతే వేగంగా స్పందిస్తుందని అన్నారు. తరతమ భేదాలు లేకుండా ప్రజలకు కీడు చేసేవారిని కఠినంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రజా ప్రభుత్వం పలుమార్లు నిరూపించుకుందని అన్నారు. తాజాగా అన్నమయ్య జిల్లా ములకల చెరువు కల్తీ మద్యం ఘటనపై కూడా ప్రభుత్వం చాలా వేగంగా చర్యలకు ఉపక్రమించిందని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ అవకాశ రాజకీయాలకు తావులేకుండా వెంటనే చర్యలు చేపట్టిందని అన్నారు. కల్తీ మద్యం తయారీ కేసులు 14మంది పాత్ర ప్రమేయాన్ని గుర్తించిన పోలీస్ శాఖ, 10మందిని అరెస్ట్ చేయడం జరిగిందని అన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి నేతలైన జయచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడుల ప్రమేయంపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించిందని అన్నారు. నిజానిజాలు బహిర్గతం కాకముందే వారి పేర్లు కల్తీ మద్యం వ్యవహారంలో బైటకు వచ్చిన వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిందని అన్నారు. ఇంత జరిగినా జగన్ రెడ్డి తన అవకాశవాద, విద్వేష రాజకీయలు వదలటంలేదని అన్నారు. ములకలూరు కల్తీ మద్యంపై మాట్లాడే ముందు 2022 ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో సంభవించిన కల్తీ మద్యం మరణాలకు ఎవరు కారకులో నాడు జరిగిన ఘటనపై ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఏం చర్యలు తీసుకున్నాడో, తన చేతికి మట్టి అంటకుండా నిజాలను ఎలా కప్పిపెట్టడో ఆయనే ఇప్పుడు ఒకసారి ప్రజలకు చెపితే బాగుంటుందని ప్రత్తిపాటి తెలిపారు.



**జగన్ ధనదాహంవల్లే జంగారెడ్డి గూడెం ఘటనలో 27మంది అమాయకులు బలయ్యారు**

ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ప్రజల ప్రాణాలు పోతాయనే కనీస ఆలోచన లేకుండా ఆనాడు జగన్ కేవలం ధనదాహంతో కల్తీ, హానికరమైన విషపూరిత మద్యాన్ని ప్రోత్సహించిన ఘనుడని ప్రత్తిపాటి ఆరోపించారు. ములకల చెరువు కల్తీ మద్యం ఘటనపై చంద్రబాబు సత్వరమే స్పందించి, స్వంత పార్టీ వారిని కూడా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. అదేస్థాయిలో ఆనాడు జగన్ ముఖ్యమంత్రి హోదాలో స్పందించారా అని ప్రశ్నించారు. 2022 మార్చి9వ తేదినుండి 12వ తేదివరకు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన అంశాన్ని జగన్ అసెంబ్లీసాక్షిగా నీరుకార్చారని అన్నారు. కల్తీ మద్యం కాటుకు 27మంది అమాయకులు బలైతే వారి మరణాలన్నీ సహజ మరణాలుగా చిత్రీకరించి తన చేతులకు అంటిన పాపాన్ని జగన్ కడిగేసుకునే ప్రయత్నం చేశాడని అన్నారు.

## ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారాన్ని తన భాద్యతగా భావిస్తుంది

చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: ప్రజల సమస్యలతోపాటు వారి భాదలు, ఇబ్బందుల పరిష్కారాన్ని కూటమి ప్రభుత్వం తమ భాద్యతగా భావిస్తుందని, ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉండబట్టే ప్రజలు స్వేచ్ఛా, సంతోషాలతో ప్రశాంతంగా జీవిస్తున్నారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఏనాడు ప్రజల ముఖం చూడటానికి కూడా ఇష్టపడలేదని, వారి సమస్యలు, కష్టాలు వినడం ఇష్టం లేకనే ఆయన ఐదేళ్లపాటు పరదాలు, పోలీసుల చాటునుంచే పాలన సాగించాడని అన్నారు. సోమవారం ప్రత్తిపాటి తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టణంలో పేదలకు కేటాయించిన టిడ్కో గృహాలను పాడు బెట్టకుండా లబ్దిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని, లేనిపక్షంలో ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని ప్రత్తిపాటి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన విధి విధానలపై అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారని తెలిపారు. తమకు ఇళ్లు ఇప్పించాలని కోరుతూ వచ్చిన అర్జీలపై ప్రత్తిపాటి పై విధంగా స్పందించారు. గ్రామాలు, పట్టణాలలోని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం త్వరలోనే స్థలాలు కేటాయిస్తుందన్నారు. దీపావళి నాటికి 3లక్షల గృహ ప్రవేశాలు జరగాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు గృహ ప్రవేశాలపై ప్రత్తిపాటి సూచించారు. టిడ్కో ఇళ్ల లబ్దిదారులతో మాట్లాడి వారికి అవసరం లేని ఇళ్లను సద్వినియోగం చేసుకొని ఇతరులకు కేటాయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో తలెత్తే సీజనల్ వ్యాధులు, ఇతర వ్యాధులు వ్యాప్తి నిరోధానికి అధికార యంత్రాంగం శ్రద్ధతో పనిచేయాలని, పట్టణంలోని వీధులలో నిరంతరం బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని ప్రత్తిపాటి ఆదేశించారు.



## రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్‌గా భాధ్యతలు చేపట్టిన రవికుమార్



చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: నిబద్ధత, నిజాయితీలతో కూడిన ఒక పట్టుదలతో మందలపు రవికుమార్ తెలుగుదేశం గెలుపులో చురుకైన పాత్ర పోషించారని, అమెరికానుంచి వచ్చి పార్టీ కోసం పనిచేయడం ఆయన పనితీరుకు నిదర్శనమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా భాద్యతల స్వీరణలో బాగంగా మందలపు రవికుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ భవానీపురంలోని హరిత బెర్మాపార్కులో జరిగిన కార్యక్రమానికి ప్రత్తిపాటి ముఖ్య అతిధిగా పాల్గొని రవికుమార్‌ను సత్కరించి అభినందనలు తెలియచేశారు. ప్రత్తిపాటితో పాటు కేంద్ర సహాయమంత్రి భూపతి శ్రీనివాసశర్మ, మంత్రి కొలుసు పార్ధసారధి, ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్‌లు పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిని మాటకు కట్టుబడి రవికుమార్ పార్టీ గెలుపునకు ఎనలేని కృషి చేశారని ప్రత్తిపాటి తెలిపారు ఎన్నికల సమయంలో 35 నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన రవికుమార్, అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకొని ముందుకు సాగారన్నారు. నేడు సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా ఆయన చేపట్టిన భాధ్యతలు, ఆయన రాజకీయ ఎదుగుదలలో కేవలం తొలి మెట్టేనని, భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. ------------

## సుబ్బాయమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గోపాళం సుబ్బాయమ్మ ఇటీవల మృతిచెందారు. కాగా సోమవారం ఆమె పెద్దకర్మను బొప్పూడి గ్రామంలోని వారి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి సుబ్బాయమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితో పాటు పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, షేక్ రఫాని, గోపాళం నాగేశ్వరరావు, గుంటు సుబ్బారావు, గుంటు కోటేశ్వరరావు, జవ్వాజి మదన్‌మోహన్, హనుమంతరావు, స్వాములు, సింగు మణికుమార్, గ్రామ పార్టీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

# పల్నాడు జిల్లా వార్త



## సమస్యల పరిష్కారానికి సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట, అక్టోబరు 6 ప్రభాతవార్త : విద్యుత్‌రంగ సంస్థలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వతేదీ నుండి నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని రాష్ట్ర జేఏసి నాయకులు ఆర్.బంగారయ్య అన్నారు. ఈ మేరకు కార్యాలయ ఆవరణలో గోడ పత్రికలను సమ్మె వివరాలను తెలియజేస్తూ సోమవారం ఆవిష్కరించారు. సమ్మె కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడం శోచనీయమని బంగారయ్య తెలియజేశారు.

## నియోజకవర్గంలో 25 కుటుంబాలకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ



నరసరావుపేట, అక్టోబరు 6 ప్రభాతవార్త : నరసరావుపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం 25 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తనయుడు, పార్టీ యువ నాయకులు డాక్టర్ చదలవాడ ఆదిత్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వైద్యపరంగా ఏ కుటుంబం ఖర్చుల కోసం అప్పులపాలు కాకూడదని పెద్ద మనస్సుతో ఆదుకుంటుందని తెలిపారు. గత 20 నెలల కాలంలో పెద్ద ఎత్తున సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సహకారంతో తెలుగుదేశంపార్టీ అందించిందని తెలిపారు. 25 కుటుంబాలకు నియోజకవర్గంలో ఏకకాలంలో రూ.2 0 లక్షల విలువైన చెక్కులను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ చదలవాడ ఆదిత్య తెలియజేశారు. లబ్దిదారులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు, డాక్టర్ ఆదిత్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛఆంధ్ర అవార్డులను ప్రధానం చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



నరసరావుపేట, అక్టోబరు 6 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో పలు పురపాలక సంఘాలకు, పంచాయితీలకు సంబంధించి స్వచ్ఛఆంధ్ర అవార్డులను సోమవారం కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అందజేశారు. స్వచ్ఛఆంధ్ర అవార్డులను పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలలో మంచి కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు అందించి వారిని సత్కరించినట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలియజేశారు. జిల్లాస్థాయిలో 16 విభాగాలలో 51 మంది వ్యక్తులు, సంస్థలకు అవార్డులను అందజేశారు. 9 నెలల్లో జిల్లాలోని 527 గ్రామ పంచాయితీలు, 6 పట్టణ స్థానిక సంస్థలు, రెండు నగర పంచాయితీలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం అమలు చేశామన్నారు. 93 శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగిందన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతుబజార్‌లు, బస్‌స్టేషన్‌లు, పరిశ్రమలు వంటి 17 కేటగిరిలలో అవార్డులు ప్రధానం చేశామని కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు తెలియజేశారు.

## తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్



నరసరావుపేట, అక్టోబరు 6 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి సంబంధించిన గ్రామాలు, వార్డులలో నివాసితులు ఎమ్మెల్యే అరవింద్‌బాబుకు వినతిపత్రాలను సమస్యలు పరిష్కరించాలని అందించారు. రైతుల సమస్యలతో పాటు మౌళిక సదుపాయాలు, ఉద్యోగాలకు సంబంధించి అర్జీలు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. జిఎస్‌టి 2.0 మార్పులతో ద్విచక్ర వాహనాలలో భారీ తగ్గుదల వచ్చిందని, దీంతో వినియోగదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తూ జిఎస్‌టి తగ్గుదల వలన కలిగిన లాభాలను స్థానికులకు ఎమ్మెల్యే వివరించారు. జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం అందుబాటులోకి వచ్చిన తర్వాత బైక్‌లు, స్కూటర్‌లు రూ.5 వేల నుండి రూ.20 వేల వరకు తగ్గాయని తెలియజేశారు.

**సి.సి.రోడ్లు, డ్రైన్లకు ప్రారంభోత్సవం:** పట్టణంలోని 1వ వార్డులో రూ.16.13 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సి.సి.రోడ్లు, సైడ్ కాలువలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలియజేశారు. అభివృద్ధి నిధుల కోసం ఎన్నో మార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఆయాశాఖల మంత్రులకు వినతిపత్రాలు అందజేసి నిధులు తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## ఉత్తమ గ్రామ పంచాయితీగా నర్సింగపాడు



నకరికల్లు, అక్టోబరు 6 ప్రభాతవార్త : మండలంలోని నర్సింగపాడు గ్రామ పంచాయితీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛఆంధ్ర అవార్డులలో ఉత్తమ గ్రామ పంచాయితీగా ఎంపికైంది. శుభ్రతా కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలలో అధికారులు నిర్వహించిన సర్వేలో గ్రామం మొదటిస్థానంలో నిలిచింది. పంచాయితీ కార్యదర్శి అప్పారావుకు స్వచ్ఛత అవార్డులను కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అందజేశారు. ఉత్తమ గ్రామ పంచాయితీగా నర్సింగపాడు గ్రామాన్ని నిలిపిన అధికారులను, గ్రామ ప్రజలను కలెక్టర్ కృతికాశుక్లా అభినందించారు.

## ఎస్పీ గ్రీవెన్స్‌కు 122 ఫిర్యాదులు



నరసరావుపేట క్రైం, అక్టోబరు 6 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన గ్రీవెన్స్‌కు 122 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. పట్టణంలోని వంశీ టవర్స్‌లో ప్లాట్ విక్రయానికి సంబంధించి కలుగుతున్న ఇబ్బందులను తెలియజేశారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన ఝాన్సీరాణి తన ఫిర్యాదులో తన స్థలాన్ని ఆక్రమించి మహాలక్ష్మి అమ్మవారి గుడి నిర్మించారని తెలిపారు. గోగులపాడు గ్రామానికి చెందిన రామారావు చీటిపాటకు సంబంధించిన సమస్యను వివరించారు. పరగటిచర్ల గ్రామానికి చెందిన శివశంకర్ తనకు జరిగిన మోసాన్ని తెలియజేశారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావుతో పాటు అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.సి.కార్పోరేషన్ రుణాలను విడుదల చేయాలి

నకరికల్లు, అక్టోబరు 6 ప్రభాతవార్త : ఎస్.సి.కార్పోరేషన్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని ఎమ్మార్పీయస్‌యస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య అన్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్ కృతికాశుక్లాకు వారు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి రుణాలకు సంబంధించిన సమస్యలను తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. సబ్సిడీ రుణాలను బ్యాంకర్ల ద్వారా అందే విధంగా చూడాలన్నారు. రుణాల కొరకు ఎమ్మార్పీయస్‌యస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారావు, శేషు, ఫ్రాంక్లీన్, రమేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 149 అర్జీలను స్వీకరించిన కలెక్టర్



రొంపిచర్ల, అక్టోబరు 6 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపవద్దని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. మొత్తం 149 ఫిర్యాదులు ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తూ అందించారని పేర్కొన్నారు. అర్జీలు మళ్ళీ రీ ఓపెన్ కాకుండా చూడాలని సూచించారు. ఖచ్చితంగా నిర్ణీత గడువులోగా సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు ప్రజలకు రానివ్వకుండా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా తెలియజేశారు.

## నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్యకి నివాళులు



చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: ప్రముఖ విత్తనసంస్థ నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్య ఇటీవల మృతిచెందిన సంగతి విదితమే కాగా ఆయన దశదినకర్మను సోమవారం నూజివీడు నియోజకవర్గం తుక్కలూరు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలంగాణా రాష్ట్ర మంత్రి ఉత్తమకుమార్ రెడ్డితో కలసి పాల్గొని వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ మండవ వెంకట్రామయ్య నూజివీడు సీడ్స్‌అనే సంస్థను స్థాపించి ఎంతోమంది రైతులకు మార్గదర్శకులయ్యారని, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ ద్వారా రాష్ట్రంలో లక్షలమంది రైతులకు నాణ్యమైన హైబ్రీడ్, రకరకాల విత్తనాలను అభివృద్ధి చేసి సరఫరా చేయడం ద్వారా మంచి పంటలు పండటానికి ఎంతో దోహదపడ్డారని ప్రత్తిపాటి తెలిపారు.

## శారదా మున్సిపల్ పాఠశాలకు జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ఆంధ్రా అవార్డు



చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: పట్టణంలోని 18వ వార్డులో ఉన్న శారదా మున్సిపల్ ప్రాధమిక పాఠశాలకు గత సంవత్సరం కాలంలో స్వచ్ఛత కోసం కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు చేసిన కృషిని గుర్తించిన విద్యాశాఖ డిఈఓ జిల్లాలోని 5 పాఠశాలలకు స్వచ్ఛ ఆంధ్రా అవార్డులను ప్రకటించారు. దీనిలో మొదటిగా శారదా మున్సిపల్ ప్రాధమిక పాఠశాల ఉన్నది. కాగా ఆ అవార్డును సోమవారం నరసరావుపేట పట్టణంలోని టౌన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు డిఈఓ చంద్రకళ చేతులమీదుగా శారదా మున్సిపల్ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ అందుకున్నారు. శారదా ప్రాధమిక పాఠశాలకు ఆ అవార్డు లభించడం పట్ల చిలకలూరిపేట యంఈఓ బి సత్యనారాయణ సింగ్, పలువురు పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు అభినందనలు తెలియచేశారు.

## అసిస్ట్ సంస్థకు స్వచ్ఛత కోసం కృషి: జిల్లా స్వచ్ఛాంధ్ర అవార్డు అందించిన జిల్లా కలెక్టర్



చిలకలూరిపేట, అక్టోబర్6, ప్రభాతవార్త: పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట కేంద్రంగా అద్భుతమైన సమాజసేవలు అందిస్తున్న అసిస్ట్ సంస్థ స్వచ్ఛతా రంగంలో చేసిన విశేషకృషికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అరుదైన గుర్తింపు లభించింది. పల్నాడు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును సోమవారం నరసరావుపేట పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతులమీదుగా అసిస్ట్ సంస్థ తరుపున అసోసియేట్ డైరక్టర్ యం విష్ణుప్రియ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో స్వచ్ఛతా, పారిశుధ్య కార్యక్రమాలలో అసిస్ట్ చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాలకు తోడుగా అసిస్ట్ వంటి సంస్థలు ముందుకు వచ్చి ప్రజలలో స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించడం, మౌళిక సదుపాయాలు కల్పిండచం అభినందనీయమని అన్నారు. ఈ అవార్డు ఆ సంస్థ నిబద్ధతకు, సేవకు దక్కిన గౌరవమని అన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అసిస్ట్ సేవలను ప్రశంసించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛభారత్ లక్ష్యాలను చేరుకోవడంలో అసిస్ట్ సంస్థ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, ఘనవ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యను అందించడంలో వారి కృషి ఆదర్శప్రాయని అన్నారు. ఈ కృషిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జిల్లా స్థాయి అవార్డును అందించడం గర్వకారణమని అన్నారు. చిలకలూరిపేట కేంద్రంగా పనిచేస్తున్న అసిస్ట్ సంస్థ విద్య, ఆరోగ్యం, జీవనోపాధి రంగాలతో పాటు ముఖ్యంగా స్వచ్ఛత, మరియు పారిశుద్య రంగంలో విస్తృత సేవలు అందిస్తుంది. సంస్థ అనేక గ్రామాలలో పూర్తిస్థాయి, పారిశుద్య వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో ప్రజలకు శుభ్రమైన నీరు అందించడంలో మరియు బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలను సాధించడంలో కీలకపాత్ర పోషించింది. ఈ అవార్డు పట్ల అసిస్ట్ అసోసియేట్ డైరక్టర్ యం విష్ణుప్రియ సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ నరసరావుపేట ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా స్వచ్ఛంధ్ర లక్ష్యాల కోసం అసిస్ట్ మరింత కృషి చేస్తుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిని బురిడీ కొట్టించి తప్పించుకున్న విద్యార్థి

యడ్లపాడు, అక్టోబర్ 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్య నభ్యసించే విద్యార్ధి శెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేక్రమంలో తల్లిని బురిడికొట్టి తప్పించుకున్న సంఘటన చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి విద్యార్ధి నాగతేజ తల్లి గోసాల సూర్యకుమారి తెలిపిన వివరాల ప్రకారం సెలవులు ముగిసి తిరిగి పాఠశాలకు తీసుకువెళ్లే క్రమంలో బోయపాలెం గ్రామం వద్ద కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తున్న తరుణంలో కన్నుగప్పి మాయం అయ్యాడని తెలిపింది. వీరిది బాపట్ల జిల్లా అద్దంకి మండలం బొడ్డువానిపాలెం చెందిన వారని, పాఠశాలలో నాగతేజ 7వ తరగతి విద్యనభ్యసించుతున్నాడని, పాఠశాలకు వెళ్లటానికి కుమారుడు మారం చేశాడని, కుమారుడికి నచ్చచెప్పి పాఠశాలకు తీసుకు వచ్చే క్రమంలో తప్పించుకోవటం జరిగిందన్నారు. దీంతో కంగారుపడిన సూర్యకుమారి నేరుగా పాఠశాలకు వెళ్లి కుమారుడి గురించి అరా తీయగా అక్కడికి రాలేదని ఉపాధ్యాయులు తెలిపారని, వెంటనే బోయపాలెం లోని సరుకుల దుకాణంకు వెళ్లి అక్కడ సీసీ కెమెరా పరిశీలించగా నాగతేజ దుకాణం నుంచి ఒంటరిగా వెళ్లినట్లు కెమెరాలో దృశ్యాలు కనిపించాయని, ఘటనపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు అధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు.

## వ్యర్థాలను అందజేయండి, తగిన సరుకులు అందుకోండి : ఎంపీడివో

యడ్లపాడు, అక్టోబర్ 6, ప్రభాతవార్త : గృహాలలో వచ్చే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా వాటిని జాగ్రత్తగా నిల్వచేసి మీ ఇంటి ముందుకు వచ్చిన స్వచ్ఛ రథం వద్ద అందజేస్తే మీరు ఇచ్చే వ్యర్థాలకు తగిన మూల్యం కట్టి వెంటనే వాటి స్థానంలో నిత్యఅవసర సరుకులను అందజేయటం జరుగుతుందని ఎంపీడివో హేమలతాదేవి తెలిపారు. యడ్లపాడు గ్రామంలో సోమవారం స్వచ్ఛరథం వీధుల వెంట తిరుగుతున్న సమయంలో అమె క్షేత్రస్థాయిలో పరిశీలించి దీనివలన కలుగు ఉపయోగాలను గ్రామస్థులకు వివరించి వారి వద్ద నున్న వ్యర్థాలకు తగు నిత్య అవసర సరుకులను అందజేసారు. అమెతోపాటు డిప్యూటి ఎంపీడివో జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పట్టణాలు, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఐదేళ్ళ పాటు వైకాపా ప్రభుత్వ పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఎక్కడా ఒక్క నిర్మాణం కూడా చేయలేదన్నారు. 19వ వార్డులో ఎన్నో ఏళ్ళుగా సమస్యగా ఉన్న బ్రిడ్జిని ఎన్నికల హామీలలో భాగంగా రూ.25 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందన్నారు. వింగ్‌వాల్స్ నిర్మాణం, కల్వర్టు నిర్మాణం చేశామన్నారు. 23వ వార్డులో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మెటల్‌రోడ్డును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వివిధ హోదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ సింగరాజు సాయికృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో సోమవారం డాక్టర్ సింగరాజు సాయికృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ డాక్టర్ సాయికృష్ణ వైద్యునిగా పేద ప్రజలకు ఉత్తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఆయన రాజకీయాలలోనూ తన సేవలను కొనసాగించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో పాటు పార్టీ నాయకులకు ఈ సందర్భంగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

7-10Pg5 9th_7-10Pg5.qxd 10/6/2025 11:07 PM Page 1



## ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం..

### పదవి చేపట్టిన నెలకే ప్రధాని

# సెబాస్టియన్ రాజీనామా!



**ప్యారిస్, అక్టోబరు 6:** ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్నూ తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు. గత నెల జాతీయ అసెంబ్లీ జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. తర్వాత రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. సోమవారం మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది. కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.



# ఆఫ్రికా నుంచి డ్రగ్స్ అక్రమ రవాణా

## ప్రమాదకరంగా కొనసాగిస్తున్న స్మగ్లర్లు

## సినిమా ఫక్కీలో డ్రగ్స్ మాఫియా దందాలు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఆఫ్రికా దేశాలకు చెందిన డ్రగ్స్ మాఫియా డాన్‌లు తమ దేశాల నుంచి మాదకద్రవ్యాలను స్మగ్లర్ల ద్వారా ప్ర మాదకర పరిస్థితుల్లో భారత్‌కు రవాణా చేస్తున్న తీరు పోలీసులు, డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆఫ్రికా దేశాలైన దక్షిణాఫ్రికా, టాంజానియా, కెన్యా సహా ఇంకొన్ని దేశాలకు చెందిన బీద వారిని ఒక పద్ధతి ప్రకారం ఎంచుకుని వారి కడుపు, మల ద్వారాల వద్ద ప్రమాదకరమైన కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను వుంచి భారత్‌కు పంపుతున్న అక్కడి డ్రగ్స్ డాన్‌లు ఇక్కడి సర్కారీ విభాగాలకు కొ త్త సవాళ్లు విసురుతున్నారు. వాస్తవానికి ఈ పద్ధతులు కొత్తవి కాకున్నా ఏదైనా తేడా వస్తే డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్ల ప్రాణాలు పోవడం ఖాయంగా చెప్పాలి. ఒకవేళ పోలీసులకు దొరికిపోతే జీవితాంతం భారత్‌లోని జైళ్లలో మగ్గాల్సి వుంటుంది. ఇలా గడచిన పదేళ్ల కాలంలో 200 మంది వరకు ఆఫ్రికా దేశాలకు చెందిన స్మగ్లర్లు భారత్‌లోని పలు జైళ్లలో మగ్గుతుండగా వీరిలో వంద మంది శిక్షలు అమలైన వారున్నారు. కాగా పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్లలో మంది మహిళలు వుండడం గమనార్హం. మరోవైపు ప్రమాదకరంగా డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేస్తున్న స్మగ్లర్ల శరీరాల్లో వుంచిన డ్రగ్స్‌ను వెలికి తీసే ందుకు పోలీసులు వారిని నాలుగైదు రోజుల పాటు ఆసుపత్రుల్లో వుంచాల్సి వస్తోంది. డ్రగ్స్ మాఫియా ఆగడాలు, అడ్డగోలు వ్యవహారాలు సినిమా తరహాలో చిత్ర విచిత్రంగా వుంటున్నాయి. తమ ఏజెంట్ల కడుపులో లేదా శరీరంలోని మరేదైనా భాగంలో మాదకద్రవ్యాలను దాచి వుంచుతారు. ఆ తరువాత తమ ఏజెంట్లను తాము పంపా ల్సిన చోటుకు నిర్ణీత వ్యవధిలో పంపు తారు. అయితే కొన్నిసార్లు నిర్ణీత సమయంలో స్మగ్లర్లు చేరకపోతే వారి ఆరోగ్యం పాడై ఉన్నచోటే మరణిస్తుంటారు. ఈ తరహా టెక్నిక్‌లను ఇప్పుడు ఆఫ్రికా కు చెందిన మాదకద్రవ్యాల డాన్‌లు అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా తమ తమ దేశాలలో బీద వారిని ముఖ్యంగా మహిళలు, మ ధ్య వయస్సు వారిని ఎంచుకుని వారికి దండిగా డబ్బులు ఇస్తారు. ఆ కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరిని ఎంచుకుని వారి కడుపులో మాదకద్రవా ్యలను నోటి ద్వారా మింగించడం లేదా ఆపరేషన్లు చేసి కడుపులో దాచి వుంచుతారు. దీని తరువాత ఆ వ్యక్తులను ఆఫ్రికా దేశాల నుంచి దుబాయ్ మీదుగా భారత్‌లోని పలు నగరాలకు పంపుతుంటారు. ఇక్కడ వీరు రాగానే డ్రగ్స్ మాఫియా డాన్‌ల అనుచరులు రహస్య ప్రాంతానికి తీసుకు వెళ తారు. అనంతరం తమకు బాగా పరిచయం వున్న వైద్యుల ద్వారా ఆపరేషన్లు చేయించి వారి కడుపులో వున్న డ్రగ్స్‌ను వెలికితీస్తారు. దీని తరువాత సదరు వ్యక్తులను వారం పది రోజుల పాటు ఆసుపత్రుల్లోనే వుంచి వైద్యం అందించి కోలుకున్న తరువాత తిరిగి వారి దేశాలకు పంపిస్తారు. ఇలా ఒకసారి భారత్‌కు ప్రమాదకరంగా డ్రగ్స్ తీసుకు వచ్చినందుకు ఆఫ్రికా దేశస్తులకు మూడు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు అందుతుంది. ఇదే సమయంలో ఏదైనా తేడావచ్చి ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు పది లక్షల రూపాయల వరకు అందజేస్తారు. ఇంత డబు ్బలు ఆ దేశంలోని బీదవారికి జాక్‌పాట్ తగిలినంతగా చెప్పాలి. ఇలా ప్రమాదకరంగా కడుపులో డ్రగ్స్‌ను దాచుకుని ప్రయాణాలు చేస్తున్న వారు రెం డు లేదా మూడు రోజుల వ్యవధిలోనే డ్రగ్స్‌ను బయటకు తీయకుంటే మరణించడం ఖాయంగా చెప్పాలి. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ము ంబాయితో బెంగళూరు, చెన్నై శంషాబాద్ విమానాశ్రయాలలో తరచూ శరీరాలలో హెరాయిన్, కొకైన్ సహా పలు రకాల డ్రగ్స్‌ను మాత్రలు, లేదా పొ ట్లాల రూపంలో దాచుకుని వస్తూ ఇక్కడ కస్టమ్స్ అధికారులకు దొరికిపోతున్న తీరు డ్రగ్ మాఫియా ఆగడాలు ఏ స్థాయికి చేరాయో ఊహించుకోవ చ్చు. శంషాబాద్ విమానాశ్రయంలో ఏడాదిన్నర క్రితం టాంజానియాకు చెందిన ముగ్గురు వ్యక్తులు కడుపులో హెరాయిన్ దాచి వుంచి హైదరాబాద్ కు రాగా అప్పటికే వారి ప్రయాణం మూడు రోజులు దాటడంతో తీవ్ర అస్వస్తతకు లోనవడం, సరిగ్గా నడవలేక పోవడంతో డిఆర్ఐ అధికారులు అ నుమానించి వెంటనే విమానాశ్రయంలోనే స్కానింగ్ చేయగా వారి కడుపులో డ్రగ్స్ వున్న విషయం రట్టయ్యింది. ఇందులో మొదటి వ్యక్తి కడుపులో 57 మాత్రలు, రెండవ వ్యక్తి కడుపులో 108 మాత్రలు వున్నాయి. వీరిద్దరిని వారం రోజుల పాటు ఆసుపత్రిలో వుంచి చిన్నపాటి ఆపరేషన్లు చేసి కడుపులోని మాదకద్రవ్యాలను వెలికితీశారు.

# లక్షల స్కాలర్‌షిప్ లభించినా వీసా తిరస్కరణ

## అమెరికా వెళ్లాలనుకున్న భారత్ విద్యార్థికి అనూహ్య అనుభవం




**కొలంబియా, అక్టోబరు 6:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న భారతీయ విద్యార్థులను ఆందోళనకు గురిచేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం చదివేందుకు ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 88 లక్షలు) భారీ స్కాలర్‌షిప్ సాధించిన భారత విద్యార్థికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. చదువు పూర్తయ్యాక అతను తిరిగి భారత్‌కు వెళ్లడనే అనుమానంతో స్టూడెంట్ వీసాను నిరాకరించింది. భారత్‌కు చెందిన 27 ఏళ్ల కౌశిక్ రాజ్, కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో ప్రవేశానికి ఎంపికయ్యాడు. దీనికి తోడు సుమారు రూ. 88 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌ను కూడా సాధించాడు. దీంతో తన కల నెరవేరినట్లేనని భావిస్తున్న తరుణంలో అమెరికా వీసా ఇంటర్వ్యూ తర్వాత అతనికి నిరాశే ఎదురైంది. అధికారులు అతని వీసా దరఖాస్తును తిరస్కరించారు. చదువు పూర్తయిన తర్వాత కౌశిక్ తిరిగి తన సొంత దేశానికి వెళతాడన్న నమ్మకం తమకు కలగడం లేదని వీసా తిరస్కరణ పత్రంలో అధి కారులు స్పష్టంగా పేర్కొన్నారు. అమెరికా నిబంధనల ప్రకారం, స్టూడెంట్ వీసా (ఎఫ్1) కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ చదువు తాత్కాలికమేనని, ఆ తర్వాత తమ దేశానికి తిరిగి వెళ్లేందుకు బలమైన కుటుంబ, సామాజిక బంధాలు ఉన్నా యని నిరూపించు కోవాల్సి ఉంటుంది. కౌశిక్ విషయంలో ఈ నిబంధన నెరవేరలేదని అధికారులు తేల్చిచెప్పారు. ఈ అనూహ్య పరిణామంపై కౌశిక్ రాజ్ స్పందించాడు. నా కుటుంబం, బంధువులు అందరూ భారత్‌లోనే ఉన్నారు. అయినా నాకు వీసా నిరాకరించడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నాడు. వీసా అధికారులు తన సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించడం వల్లే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అతను అనుమానం వ్యక్తం చేశాడు. గతంలో తాను జర్నలిస్టుగా పనిచేసినప్పుడు రాసిన కథనాల లింకులను సోషల్ మీడియాలో పంచుకున్నా నని, వాటిని చూసిన అధికారులు తాను అమెరికాలో స్థిరపడటానికే వస్తున్నానని అపార్థం చేసుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంపై అప్పీల్ చేసుకునే అవకాశం లేదని, కావాలంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అమెరికా వీసా అనేది ఒక అవకాశం మాత్రమే కానీ, హక్కు కాదని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ పరిణామం అమెరికాలో ఉన్నత విద్య కోసం ప్రయత్నిస్తున్న ఇతర భారతీయ విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.



# బిజెపి ఎంపి ఖగేన్ ముర్ముపై దాడి!

**కోల్‌కతా, అక్టోబరు 6:** పశ్చిమబెంగాల్ లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ప్రతినిధి బృందం పై సోమవారంనాడు దాడి జరిగింది. జల్‌పాయ్‌గురి జిల్లాలో బీజేపీ ప్రతినిధుల కాన్వాయ్‌పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో మాల్దా ఉత్తర్ ఎంపీ ఖగెన్ ముర్ము తీవ్రంగా గాయపడ్డారు. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ సైతం గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. దాడిలో ఈ ఇద్దరు నేతలు ప్రయాణిస్తున్న వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు వెళ్తున్న తమ పార్టీ ప్రతినిధి బృందంపై దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఉందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. టీఎంసీ గూండాలు నార్త్ మాల్దాకు రెండుసార్లు ఎంపీగా ఉన్న ఖగెన్ ముర్ముపై దాడి చేశారు. కోల్‌కతా కార్నివాల్‌లో మమతా బెనర్జీ మునిగిపోయారు. టీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం వరద సహాయక చర్యలను పట్టించుకోవడం లేదు. బీజేపీ నేతలు, కార్యకర్తలు మాత్రమే బాధితులను ఆదుకుంటున్నారు. టీఎంసీ బెంగాల్‌లో క్రూరత్వం రాజ్యమేలుతోందని సామాజిక మాధ్యమం ఎక్స్‌ళి ఆయన పేర్కొన్నారు. మాల్దా ఉత్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీగా ఆయన రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2006 నుంచి 2019 వరకూ హబీబ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన సేవలందించారు.

# బీహార్ ఎన్నికలకు 11 మందితో ఆప్ జాబితా



**పాట్నా, అక్టోబరు 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఏపి) సోమవారం విడుదల చేసింది బీహార్‌లో ఆప్ పోటీ చేస్తుండటం ఇదే మొదటిసారి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి బీహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు. ఈ విషయాన్ని ఆప్ ఢిల్లీ విభాగం చీఫ్, సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ఆ తర్వాత ధ్రువీకరించారు. ఆప్ అభ్యర్థులు వీరే.. ఆప్ ప్రకటించిన 11 మంది అభ్యర్థులలో డాక్టర్ మీరాసింగ్-బెగుసరాయ్ (బెగుసరాయ్), యోగి చౌపల్-కుషేశ్వర్‌స్థాన్ (దర్బంగా). అమిత్‌కుమార్‌సింగ్-తరియ (సారణ్), భాను భారతీయ-కస్బా (పూర్ణియా), సౌభద యాదవ్-బేనిపట్టి (మధుబని), అరుణ్‌కుమార్ రజక్-ఫుల్వారి షరీఫ్ (పాట్నా), డాక్టర్ పంకజ్‌కుమార్-బంకీపూర్ (పాట్నా), అష్రాఫ్ ఆలం-కిషన్ గంజ్ (కిషన్‌గంజ్), అఖిలేష్ నారాయణ్ ఠాకూర్-పరిహార్ (సీతామర్హి), అశోక్‌కుమార్‌సింగ్-గోవింద్‌గంజ్ (మోతిహారి), మాజీ కెప్టెన్ ధర్మరాజ్‌సింగ్-బక్సర్ (బక్సర్) ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్-2025ను ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరుగనుంది. నవంబరు 14న కౌంటింగ్ జరుగుతుంది కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 2020లో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి.

# ఎవరెస్టుపై మంచు తుపాను.. చిక్కుకుపోయిన 1000 మంది

**బీజింగ్, అక్టోబరు 6:** ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతం ఎవరెస్టుపై మంచు తుపాను బీభత్సం సృష్టించింది. దీంతో వేల అడుగుల ఎత్తులో దాదాపు 1000 మంది పర్వతారోహకులు మంచు శిఖరంపై చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు స్థానికులతో కలిసి అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. టిబెట్‌లో ఎవరెస్టు పర్వతం తూర్పువాలు వైపు శుక్రవారం సాయంత్రం నుంచి దట్టంగా మంచు కురుస్తోంది. ఆదివారానికి అది మంచు తుపానుగా మారింది. దీంతో దాదాపు 1000 మంది క్యాంప్ సైట్ల వద్ద చిక్కుకుపోయారు.



వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 350 మందిని రక్షించి క్యుడాంగ్ అనే చిన్న టౌన్‌షిప్‌కు తరలించారు. ఎవరెస్టుపైకి వెళ్లే మార్గాల్లో భారీగా మంచు చరియలు పడి దారులు మూసుకుపోయాయి. దీంతో వాటిని తొలగించేందుకు వందలాది మంది స్థానికులు, రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. సాధారణంగా ఈ వైపు నుంచే పర్వతారోహకులు, హైకర్లు ఎక్కువగా ఎవరెస్ట పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు చైనాలో సెలవులు కావడంతో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంది. అదే సమయంలో మంచు తుపాను సంభవించడంతో వీరంతా పర్వతంపై చిక్కుకుపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో హైకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది హైకర్లు హైపోథెర్మియా బారిన పడినట్లు రెస్క్యూ బృందం వెల్లడించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శనివారం నుంచి ఎవరెస్ట పైకి వెళ్లేందుకు అనుమతులు నిలిపివేశారు. సాధారణంగా అక్టోబరులో ఈ మంచు పర్వతంపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మరోవైపు, నేపాల్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే.



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నాడు బద్రీనాథ్‌ను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడి నివాసంలో తేనీరు సేవించిన దృశ్యం

## ద్వారపాలకుల బంగారు తాపడం మాయం!

# సిట్ దర్యాప్తునకు ఆదేశించిన కేరళ హైకోర్టు




**తిరువనంతపురం, అక్టోబరు 6:** కేరళలోని సుప్రసిద్ధ శబరిమల దేవాలయంలోని ద్వారపాలకుల విగ్రహాల బంగారం మాయ మవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. బంగారు పూత పూసిన రాగి పలకల నుంచి బంగారం మాయమవడంపై కేరళ హైకోర్టు తాజాగా సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు విజిలెన్స్ బృందం ఈ విషయంపై తన ప్రాథమిక దర్యాప్తుపై మధ్యంతర నివేదిక సమర్పించిన అనంతరం కేరళ హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తును గోప్యంగా నిర్వహించాలని, నివేదికను నేరుగా కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. దీని కోసం స్పెషల్ కమిషనర్ నుంచి కానీ, కోర్టు నుంచి కానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. కానీ ఈ రాగి పలకలు చెన్నైలోని ఓ సంస్థకు చేరేసరికి వీటి బరువు 38.258 కేజీలు మాత్రమే ఉంది. అంటే 4.54 కేజీల బంగారం తగ్గిపోయింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం కూడా వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన, వివరణ లేని వ్యత్యాసం అని పేర్కొంది. వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. 2019లో ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మరమ్మతులు చర్యలు చేపట్టింది. అయితే, వారు స్పెషల్ కమిషనర్‌కు గానీ, కోర్టుకు గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ బంగారు రేకులను తొలగించడం వివాదానికి కారణమైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై అసెంబ్లీలో కూడా తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. శబరిమలైలో బంగారం మిస్ కావడంపైయుడిఎఫ్ సభ్యులు అసెంబ్లీలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీనితో స్పీకర్ ఎఎన్ షంసీర్ సభను రేపటికి వాయిదావేసారు.

# ఎమ్జీఆర్ విగ్రహం ధ్వంసం

### యధాస్థానంలో ఏర్పాటు చేసిన స్థానికులు

**చెన్నై, అక్టోబర్ 6:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకె వ్యవస్థాపకుడు ఎంజి రామచంద్రన్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మధురై జిల్లా తిరుప్పం కుండ్రం నియోజకవర్గంలోని అవనియాపురంలో ఈ సంఘటన జరిగింది. ప్రసిద్ధ జల్లికట్టు అరేనా సమీపంలో ఉన్న 3.5 అడుగుల ఎంజిఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. పీఠం నుంచి ఆ విగ్రహాన్ని పెకలించడదాన్ని సోమవారం ఉదయం స్థానికులు గమనించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న అన్నా డిఎంకె నేతలు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. కూలిన ఎంజిఆర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై నిరసన తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అవనియాపురం పోలీసులకు పార్టీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ఈ సంఘటనను ఖండించారు. ఎంజిఆర్ కీర్తి, విధానాలను ఎదుర్కోలేని వారు ఈ పిరికి చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సంక్షిప్తంగా..

### దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఐఎన్‌ఎస్ సహ్యాద్రి



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారతీయ యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ సహ్యాద్రి దక్షిణ చైనా సముద్రంలో మోహరిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో ఆ వివాదాస్పద జలాల్లో భారతీయ యుద్ధ నౌక సంచరించడం ఇది రెండో సారి. ప్రస్తుతం ఐఎన్‌ఎస్ సహ్యాద్రి మూడు రోజుల పాటు మలేషియాలో ఉన్నట్లు నేవీ ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ చైనా సముద్రంలో ఈస్ట్రన్ ఫ్లీట్ ను డిస్ప్లాయ్ చేస్తున్నారని, ఇండోపసిఫిక్ ప్రాంతంలో కూడా యుద్ధ నౌకల మోహరింపును బలపేతం చేస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. ఐఎన్‌ఎస్ సహ్యాద్రి బాధ్యతాయుతంగా ఆపరేషనల్ డిప్లాయ్‌మెంట్‌లో పాల్గొన్నదని, ఇండోపసిఫిక్ సముద్ర ప్రాంతంలో సెక్యూర్టీ భాగస్వామి బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. రెండు వారాల క్రితమే మరోయుద్ధ నౌక ఐఎన్‌ఎస్ నిస్తార్ ఇండో పసిఫిక్ రీచ్‌లో పాల్గొన్నది. పది రోజుల పాటు ఆ ఈవెంట్ జరిగింది. సింగపూర్ వేదికగా జరిగిన పసిఫిక్ రీచ్ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశ నౌకలు కూడా పాల్గొన్నాయి.

### దుర్గామాత నిమజ్జన ర్యాలీలో ఘర్షణలు, పలువురికి గాయాలు

**కటక్, అక్టోబరు 6:** ఒడిశాలోని కటక్ నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా చెలరేగిన హింసతో అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలో 36 గంటల పాటు కర్ఫ్యూ విధించి, 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను, సోషల్ మీడియాను నిలిపివేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. దుర్గా నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. ఈ వాగ్వాదం కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు రాళ్లు, సీసాలతో దాడులు చేసుకోవడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది.

ఈ హింసాత్మక ఘటనలో ఎనిమిది మంది పోలీసుల సహా మొత్తం 25 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడాలి: ఢిల్లీ సిఎం



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులేనని, వారి సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం పనిచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఢిల్లీలోని పీతంపురలో శ్రీ బ్రాహ్మణ సభ నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో రేఖా గుప్తా మాట్లాడుతూ, "సమాజంలో ఎవరైనా విజ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. వారు శాస్త్రాలనే కాదు, శస్త్రాలను కూడా పూజిస్తారు. నేటి సమాజాన్ని, దేశాన్ని కాపాడాలంటే శాస్త్ర, శస్త్రాలు రెండూ ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని పంచుతూ, ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మంచిని పెంచుతూ సమాజ హితం కోసం పాటుపడ్డారని ఆమె కొనియాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్రాహ్మణులను ముందుకు తీసుకెళ్లేందుకు వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలని ఆమె సూచించారు.

### వైద్యవిద్యార్థినిపై పదే పదే లైంగిక దాడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పార్టీ పేరుతో హోటల్‌కు పిలిచి, 18 ఏళ్ల ఎంబీబీఎస్ విద్యార్థినిపై ఒక యువకుడు, అతడి స్నేహితులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ దారుణాన్ని వీడియో తీసి, నెలరోజుల పాటు ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు. వాయవ్య ఢిల్లీలోని ఆదర్శ్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. హర్యానాలోని జింద్‌కు చెందిన బాధితురాలు ఢిల్లీలో హాస్టల్‌లో ఉంటూ ఎంబీబీఎస్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువకుడు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరికీ ముందునుంచే పరిచయం ఉంది. సెప్టెంబర్ 9న తన ఇద్దరు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుందామని నమ్మించి బాధితురాలిని హోటల్ గదికి పిలిచాడు. అక్కడ ఆమెకు ఇచ్చిన కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపారు. ఆమె స్పృహ కోల్పోయాక ప్రధాన నిందితుడు అత్యాచారం చేయగా, మిగిలిన ఇద్దరు ఆ దారుణాన్ని వీడియో తీసి, ఆ తర్వాత వారు కూడా లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

7-10pg6exHMNWJQE 10_7-10pg6exHMNWJQE.qxd 10/7/2025 12:23 AM Page 1



# రైతుల ఆత్మహత్యల్లో ఎపి @ 3

● ఎన్‌సిఆర్‌బి తాజా నివేదికలో వెల్లడి



**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) సమాచారాన్ని అనుసరించి దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడవ స్థానంలో ఉంది. ఇటీవల ఎన్‌సిఆర్‌బి నివేదిక విడుదల చేసిన లెక్కల ప్రకారం మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రైతులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించింది. ఈ ఐదు రాష్ట్రాల్లో బిజెపి పాలిత రాష్ట్రమైన మహారాష్ట్రనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. 2023 సంవత్సరంలో రైతులు, వ్యవసాయ కార్మికులు మొత్తం 10,786 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఎన్‌సిఆర్‌బి నివేదిక పేర్కొంది. ఇక మహారాష్ట్రలో 38.5 శాతం, కర్ణాటకలో 22.5 శాతం రైతులు ఆత్మహత్యలతో మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. వ్యవసాయ రంగంలో 2023 సంవత్సరంలో 10,786 ఆత్మహత్యల్లో 4,690 మంది రైతులు, 6,096 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశంలో జరిగిన మొత్తం ఆత్మహత్యలలో (2023లో 1,71,418 ఆత్మహత్యలు) వ్యవసాయ రంగానికి చెందిన ఆత్మహత్యలు 6.3 శాతంగా ఉన్నాయి. ఇక 4,690 మంది రైతుల ఆత్మహత్యల్లో 4,553 మంది పురుషులు, 137 మంది మహిళా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2023లో వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు 6,096. ఇందులో 5,433 మంది పురుషులు, 663 మహిళా కార్మికులు చనిపోయారు. రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. 2023లో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు 8.6 శాతం. మధ్యప్రదేశ్ 7.2 శాతం, తమిళనాడు 5.9 శాతం మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

రైతుల ఆత్మహత్యలే లేని రాష్ట్రాల జాబితాలో పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మిజోరామ్, నాగాలాండ్, త్రిపుర, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్‌లు నిలిచాయి.



# త్వరలో అమరావతికి సీఆర్డీఏ ఆఫీస్

● రాజధాని అభివృద్ధి పనుల పర్యవేక్షణ మెరుగు ● ప్రాంతీయ కార్యాలయంగా విజయవాడ ఆఫీసు

● తుది దశకు చేరుకున్న క్రడా భవన నిర్మాణం ● ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు చర్యలు

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఆర్డీఏ(క్రడా) ప్రధాన కార్యాలయాన్ని విజయవాడ నుంచి రాజధాని అమరావతికి మార్చనున్నారు. ఆ దిశలో అమరావతి క్రడా కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి క్రడా పూర్తి స్థాయి కార్యకలపాలు అమరావతికి మార్చే దిశలో ప్రయత్నాలు చేస్తోంది. విజయవాడలో ఇప్పుడున్న జీ ప్లస్ 2 భవనం ఖాళీ చేయకుండా సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంగా ఉపయోగించనున్నట్లు తెలిసింది. భవనాల ప్రణాళికలు, రెండు జిల్లాల్లోని మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన విభాగాలు ఇక్కడి నుంచే పని చేయనున్నాయి. ఈ పరిణామాల నడుమ అమరావతిలో నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రాజధానికి కార్యాలయం రావడం వల్ల పర్యవేక్షణ మరింత పెరగనుంది. నిర్మాణ పనులూ వేగం పుంజుకోనున్నాయి. అటు రైతులకు ఇటు అధికారులకు సమయం ఆదా కావడంతో పాటు వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి. భవిష్యత్తులో రెండో విడత భూములను సమీకరించనున్న దృష్ట్యా ఇక్కడే అధికార యంత్రాంగం కొలువుదీరడం వల్ల సీఆర్డీఏ కార్యకలాపాలు వేగవంతమవుతాయి. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ కోసం అదనపు కమిషనర్ విజయవాడ నుంచి తుళ్లూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై రాజధానిలోనే ప్రతి సోమవారం అన్ని విభాగాధిపతులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నారు.

విజయవాడలో ఇప్పుడున్న జీ ప్లస్ 2 భవనం మరీ ఇరుకుగా ఉండడంతో రోజు వారీ కార్యకలాపాలకూ కష్టంగా ఉంటోంది. పాత కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ బృందాలు వచ్చినప్పుడు సమావేశాల నిర్వహణ సమస్యగా మారుతోంది. కొత్త ప్రాంగణం ప్రారంభంతో ఈ సమస్యలు ఉండవు. సీఆర్డీఏ అధికారులు విజయవాడలో విధులు నిర్వహిస్తూ అక్కడి నుంచి రాజధానికి క్షేత్ర పర్యటనలకు వెళ్లాలంటే సమయం వృథా అవుతోంది. త్వరలో అధికార యంత్రాంగం యావత్తు అమరావతిలోనే కొలువుదీరనుండడంతో ఈ ఇబ్బందులూ ఇక ఉండవు. కౌలు, ప్లాట్లు, ఇతర సమస్యలను విన్నవించుకునేందుకు విజయవాడకు వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల వారి సమయం వృథా అవుతోంది. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ కోసం అదనపు కమిషనర్ విజయవాడ నుంచి తుళ్లూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై రాజధానిలోనే ప్రతి సోమవారం అన్ని విభాగాధిపతులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఇక క్రడా నూతన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం, కాల్ సెంటర్, క్యాంటీన్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఉంటాయి, మొదటి అంతస్తులో సమావేశ మందిరాలు, 2, 3, 5 అంతస్తులులో సీఆర్డీఏ కార్యకలపాలు, 4వ అంతస్తులో సీడీఎంఏ (పురపాలక శాఖ డైరెక్టరేట్), 6వ అంతస్తులో ఏడీసీఎల్ (అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్), 7వ అంతస్తులో పురపాలక శాఖ మంత్రి పేషీ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీ, సీడీఈ, ఎస్‌డీఈ కార్యాలయాలు ఉంటాయి. రాజధాని నగరంలోని కీలకమైన ప్రాంతాలు, భవనాలకు సంబంధించి సూక్ష్మ నమూనాలను ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు ఉంచుతారు. అమరావతి బృహత్ ప్రణాళికను ఈ కేంద్రంలోని నమూనాల ద్వారా చూడొచ్చు. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, రాజ్‌భవన్, సీఎం నివాసం, ఉద్యానాలు, రహదారుల నెట్‌వర్క్, ఏపీ ఎన్‌ఆర్‌టీ భవనం, క్వాంటమ్ వ్యాలీ తదితర వాటి డిజైన్లు వీక్షించవచ్చు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

# సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా విప్లవాత్మక మార్పులు

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్‌గా మందలపు రవికుమార్‌తో మంత్రి కందుల దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీలకు వినియోగిస్తూ, అదేవిధంగా సామాన్య ప్రజలకు చేరవేసి తద్వారా శాఖల అభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలలో భాగస్వామ్యులు కావాలని మందలపు రవికుమార్‌కు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ మందలపు రవి కుమార్ మాట్లాడుతూ... తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్‌గా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సొంగ రోషన్ కుమార్, బడేటి రాధాకృష్ణ (చంటి), మద్దిపాటి వెంకటరాజు, కామినేని శ్రీనివాస్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, భవన నిర్మాణ, కార్మిక సంఘం అధ్యక్షులు, తాడేపల్లిగూడెం టీడీపీ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి), ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు, పశ్చిమగోదావరి మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ ముళ్లపూడి బాపిరాజు, ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ కోమటి జయరామ్, నాగరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి నిప్పు నిందితుడు సర్పంచే

● అరెస్టు , జుడీషియల్ కస్టడీకి తరలింపు ● ఎస్పీ తుషార్ డూడి వెల్లడి



**చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన కేసులో దేవళంపేట గ్రామ సర్పంచ్ గోవిందయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఎస్పీ తుషార్ డూడి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి 2 గంటలకు దేవళంపేట గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు ఒక షాపును పెట్రోల్ పోసి నిప్పు అంటించారని సమాచారం అందడంతో వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటనా స్థలంకు వెళ్ళి అక్కడ వర్గాల మధ్య విబేధాలు తలెత్తకుండా పరిస్థితిని నియంత్రించి స్థలంను పరిశీలించారని తెలిపారు. ఈ ఘటనపై బొమ్మనపల్లి పంచాయతీ సెక్రటరీ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేశారు. నగరి డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ నేతృత్వంలో కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ వెంకటసుబ్బయ్యతో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలంను సందర్శించి అక్కడికి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్స్‌ను పిలిపించి కొన్ని నమూనాలను సీజ్ చేశారన్నారు. ఈ క్రమంలో అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి ఈ ఘటనకు పాల్పడింది ఆ గ్రామ సర్పంచ్ గోవిందయ్య అని నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రక్కనే వున్న మిన్నెల అనే మహిళ చిల్లర అంగడికి నిప్పు పెట్టారని, ఈ మేరకు సర్పంచ్ గోవిందయ్యకు ఫోన్ చేసి సమాచారం అందించిందన్నారు. సర్పంచ్ గోవిందయ్య సంఘటనా స్థలం చేరుకుని, తనకు ప్రతి విషయంలో అడ్డు వస్తున్నాడని సతీష్‌నాయుడు అనే వ్యక్తిపైకి ఈ నేరంను తోసి లబ్ధి పొందాలని భావించిన సర్పంచ్ గోవిందయ్య డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి స్వలాభం పొందడానికి ప్రయత్నించాడని విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ మేరకు సర్పంచ్ గోవిందయ్యను ఆదివారం సాయంత్రం 6 గంటలకు కార్వేటినగరం బస్ స్టాప్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, జుడీషియల్ కస్టడీకి తరలించామని ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో నగరి డిఎస్పీ సయ్యద్ మహ్మద్ నజీర్, కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

# రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

## నేడు కర్నూలులో రాష్ట్రస్థాయి జయంత్యుత్సవం

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదిన రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయింతిని నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

# పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం

● మంత్రి పొంగూరు నారాయణ ● 70 తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు నిరుపేదలకు పంపిణీ




**నెల్లూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త -వైద్యం:** పేదరికం నుంచి వచ్చాను కాబట్టే పేదల కష్టాలు తెలుసని, అందుకే సొంత నిధులతో తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం 75 మంది పేదలకు తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు మంత్రి అందజేశారు. ఇప్పటి వరకు 476 మందికి తోపుడు బండ్లు మంత్రి ఆధ్వర్యంలో అందజేశారు. పూరి గుడిసెలో పుట్టి ఎన్నో కష్టాలు పడ్డానని, తనకు కష్టం విలువ తెలుసు కాబట్టే పేదలకు సాయం చేస్తున్నానని, పేదలు నిరుపేదలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. తమ కష్టాలను తెలుసుకొని తమకు అండగా నిలిచిన మంత్రి నారాయణకు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ స్ట్రీట్‌లో వ్యాపారాలు చేసే 120 మంది మెప్మా మహిళలకు ఒక్కొక్కరికి లక్ష ఆర్థిక సహాయం ఇచ్చానన్నారు. సీఎం ప్రవేశపెట్టిన పీ 4 ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



# పెండింగ్ నిధులు విడుదల చేయండి

- కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు మంత్రి బాల వీరాంజనేయస్వామి వినతి

**విజయవాడ, అక్టోబర్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రానికి రావాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నాడు విజయవాడ వివంత హోటల్‌లో సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలేని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మంత్రి డా.స్వామి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి రావలసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు రూ.34 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి కేంద్రం 50 శాతం సబ్సిడీ నిధులు ఇవ్వాలని మంత్రి స్వామి కోరారు. రాష్ట్రంలో ఎస్సి విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించామని మంత్రి స్వామి కేంద్ర మంత్రికి వివరించారు. నెల రోజుల్లో అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారని, అన్ని అంశాలకు ఆయన సానుకూలత తెలిపినట్లు మంత్రి డా. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి అన్ని విధాల సహకరిస్తున్న ప్రధాని మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు.



# పిడుగు పాటుకు ఒకరి మృతి

**నెల్లూరు (బిట్రగుంట), అక్టోబర్ 6 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలోని పాత బిట్రగుంటకు చెందిన నాశన రామచంద్రయ్య(40) ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాడు. పశువుల మేతకు పశువులను తోలుకొని వెళ్లగా ఒక్కసారిగా పిడుగులు పడటంతో షాక్‌కు గురై మృతి చెందాడు. రామచంద్రయ్యకు ఇద్దరు కుమార్తెలు. విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఆస్పత్రికి తరలించారు.




# కుండల తయారీపై ఆధునిక సాంకేతిక శిక్షణ

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామీణ చేతివృత్తి పనులు చేసుకునే వారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని తమ కుటుంబ ఆదాయం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్ తెలిపారు. ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద ఎలక్ట్రిక్ కుండల తయారీ చక్రాలు ఉపయోగించడం పై 10 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ... శిక్షణా తరగతులు వినియోగించుకుని ఆధునిక పద్ధతులు ద్వారా ఉత్పత్తి ఏ విధంగా పెంచుకోవాలి ఆధునిక యంత్రాలను ఏ విధంగా ఉపయోగించాలి తెలుసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మెలకువలు తెలుసుకొని తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడం అదేవిధంగా తమ ఉత్పత్తుల ద్వారా గణపవరం ఖ్యాతిని పెంచాలని తెలియపరిచారు. అసిస్టెంట్ డైరెక్టర్, ఆర్.ఎల్.ఎన్.మూర్తి తదితరులు ప్రసంగించారు. అదేవిధంగా శిక్షణ పొందిన వారందరికీ మెరుగైన టూల్స్ ఎక్విప్మెంట్ కూడా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం పంచాయతీ సెక్రటరీ పి. శివరామకృష్ణ రావు, మాస్టర్ ట్రైనర్ కె ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఎపి, కర్ణాటక సహకరించుకుంటే అద్భుత ప్రగతి

- జస్టిస్ వి.గోపాల గౌడ అమృత మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు పరస్పరం సహకారంతో అభివృద్ధి సాధించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇరు రాష్ట్రాల మధ్య ఎన్నో ఏళ్లుగా బలమైన సత్సంబంధాలు కొనసాగుతున్నాయి. లక్షలాది తెలుగు కుటుంబాలు కన్నడ నేలపై ప్రశాంతంగా జీవిస్తూ... ఇక్కడి సామాజిక, సాంస్కృతిక విలువలను బలపరుస్తున్నారు అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం అనంతపురం, కర్నూలు, సత్యసాయి జిల్లాల్లో 57 పాఠశాలల్లో కన్నడ మాధ్యమంలోనే విద్యను అందిస్తూ కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, భాషను కాపాడుతున్నామని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు మనల్ని బలంగా కలిపే వారధిలా ఉండాలి తప్పితే విడదీయకూడదు. ఇరుగు, పొరుగు రాష్ట్రాలుగా సోదరభావంతో స్నేహపూర్వక వాతావరణంలో పరస్పర గౌరవ భావంతో సహకారం అందించుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జస్టిస్ వి.గోపాల గౌడ 75వ జన్మదిన అమృత మహోత్సవంలో పవన్‌కల్యాణ్ పాల్గొని, ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణకు పదవి బాధ్యతల్లో ఉంటూ ఎంత సేవ చేశారో... పదవీ విరమణ తరవాత కూడా రాజ్యాంగ రక్షణకు నిరంతర పోరాటం చేస్తున్న గొప్ప న్యాయ కోవిదులు జస్టిస్ వి.గోపాల గౌడ అని పవన్ కల్యాణ్ కొనియాడారు. జనసేన పార్టీ సిద్ధాంతాల విషయంలో గానీ, పార్టీ పోరాటాల్లో గానీ ఆయన అండగా నిలిచిన తీరు నాకు ఎప్పటికీ గుర్తే అని చెప్పారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన తీరు ఎంతో స్ఫూర్తిదాయక మన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కారాలకు ఇప్పటికీ ఆయన నవ యువకుడిలా ముందుండి పోరాడుతున్నారని పేర్కొన్నారు. న్యాయవిద్య అభ్యసించి బెంగళూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ఎన్నో అద్భుతమైన తీర్పులు నిక్కచ్చిగా, నిజాయతీగా అందించిన వ్యక్తిగా జస్టిస్ వి.గోపాల గౌడ నిలిచిపోతారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న నీటి సమస్య గురించి చాలా మంది తన దృష్టి తెచ్చారు. పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి వి.సోమన్న తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ గోపాల గౌడకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ

## హుండీ లెక్కింపుల్లో రు.3.57 కోట్లు



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ జరుగుతుందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 5.55లకు శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగుస్థంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణవీధిల గుండా తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలన్నారు. దుర్గమ్మవారికి భక్తులు దసరా ఉత్సవాల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.3,57,92,078ల నగదు, 122 గ్రాముల బంగారం, 9కేజీల 700 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ 52 యుఎస్ డాలర్స్, 55 సింగపూర్ డాలర్స్, 30 యుఎఇ దినార్లు, 5 కెనడా డాలర్లు, 3 సౌదీ రియాల్స్, 7.5 కువైట్ దినార్లు లెక్కింపులో లభించాయన్నారు. మొత్తం 50 హుండీలు, 237 బ్యాగులు లెక్కించారన్నారు. మంగళవారం లెక్కింపు కొనసాగుతుందన్నారు. దుర్గమ్మవారిని సోమవారం ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ కమీషనర్ సునీతా బిల్లా దర్శించుకున్నారు.



ఇన్‌కంటాక్స్ కమీషనర్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# హైదరాబాద్‌లో ఎకరం రూ.177 కోట్లు

## వేలంలో 18 ఎకరాలకు రూ.3135 కోట్లు దక్కిన వైనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 6:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ధరలు కొత్త రికార్డ్ సృష్టించాయి. టిజిఐఐసి నిర్వహించిన వేలంలో రాయదుర్గం నాలెడ్జ్ సిటీ ప్రభుత్వ భూముల వేలానికి ఊహించని స్పందన లభించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికి రికార్డు నెలకొల్పింది. దేశంలోనే అత్యధిక ధర పలికింది. తద్వారా తన రికార్డ్‌ను తానే హైదరాబాద్ బ్రేక్ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని టీజీఐఐసీ వేలం వేసింది. దీంట్లో పాల్గొన్న ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.67 ఎకరాల భూమిని వేలంలో సొంతం చేసుకుంది. ఒక్క ఎకరానికి రూ.177 కోట్ల చొప్పున మొత్తం రూ.1358 కోట్లకు చేజిక్కించుకుంది. మరో 11 ఎకరాలకు వేలం ప్రక్రియ వేరుగా కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసి) సోమవారం నిర్వహించిన రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని భూముల వేలం పాటలో ఎకరా భూమికి ఏకంగా రూ. 177 కోట్లు చెల్లించి ఎంఎస్ఎన్ రియాల్టీ ఈ భూములను సొంతం చేసుకుంది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ (సర్వే నంబరు 83/1)లోని మొత్తం 18.67 ఎకరాల్లో భాగంగా ఉన్న 7.67 ఎకరాలను ప్రభుత్వం టీఎస్ఐఐసీ ద్వారా వేలం వేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, టీజీఐఐసీ ఈ వేలం కోసం ఎకరాకు రూ. 101 కోట్లుగా ప్రారంభ ధరను నిర్ణయించింది. ఈ వేలంలో ఎంఎస్ఎన్, హెటెరో, మేఘా, బ్రిగేడ్ గ్రూప్, సత్వ, ప్రెస్టీజ్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు హోరా హోరీగా పోటీ పడ్డాయి. ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ ఈ వేలంలో ఒక్క ఎకరా భూమిని రూ. 177 కోట్లకు దక్కించుకోవడం ద్వారా రికార్డు సృష్టించింది. ఈ ధరతో మొత్తం 7.67 ఎకరాలను ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ ఏకంగా రూ.1,357 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకుంది. ఈ రికార్డు స్థాయి ధర, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ బలాన్ని, ముఖ్యంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాలకు సమీపంలో ఉన్న రాయదుర్గం ఏరియా ప్రాముఖ్యతను మరోసారి చాటి చెప్పింది. రాయదుర్గంలో భూముల ధరలు రికార్డ్స్ బ్రేక్ చేశాయి. మొత్తం 18 ఎకరాల ప్రభుత్వ భూమికి టీజీఐఐసీ వేలం నిర్వహించింది. 7.67 ఎకరాలను ఒక భాగంగా, 11 ఎకరాలను మరో భాగంగా ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించింది. 11 ఎకరాలను రూ.1556.5 కోట్లకు ప్రెస్టీజ్ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుంది. ఎకరానికి 141.5 కోట్లు చొప్పున ఆ రియల్ ఎస్టేట్ కంపెనీ వేలం పాడింది. కాగా ఈ 18 ఎకరాలకు వేలం ధరలతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు,స్టాంప్ డ్యూటీలతో ప్రభుత్వానికి మొత్తం రూ.3135 కోట్ల ఆదాయం వచ్చింది. 2017లో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ. 42.59 కోట్లు పలికింది. ఎనిమిదేళ్లలోనే వ్యవధిలోనే రాయదుర్గంలో ఎకరం ధర రూ. 177 కోట్లు పలికింది. 2022లో నియోపోలీస్, కోకాపేట్‌లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వేలం వేసిన భూమికి రూ.100 కోట్ల 75లక్షల ధర లభించింది. కోకాపేట, నియోపోలీస్ భూములతో పోలిస్తే ఇప్పుడు రాయదుర్గంలో 75 శాతం ధర ఎక్కువగా ఉంది. 7.67 ఎకరాలు, 11 ఎకరాలను రెండు భాగాలుగా చేసి టీజీఐఐసీ వేలం వేస్తోంది. తాజా వేలంలో రికార్డ్ బ్రేక్ అయ్యింది. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం డీలా పడిపోతుందని, భూముల విలువ క్రమంగా తగ్గిపోతుందని ప్రచారం జరుగుతోన్న వేళ సిటీలో ఎకరం ధర ఏకంగా రూ.177 కోట్ల రికార్ట్ ధర పలకడం గమనార్హం. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు,జిసిసిలు ఏర్పాటు చేసేందుకు ఉన్న సదుపాయాల వల్ల అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, అందుకే రియాలిటీ రంగం ఊపందుకుందని టిజిఐఐసి తెలిపింది. సిఎం రేవంత్‌రెడ్డి,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాలనలో తీసుకొచ్చిన పారదర్శకత,అభివృద్ధి వల్ల దేశంలోనే హైదరాబాద్ దూసుకెళ్తోందని పేర్కొంది.

# చింతల్‌లో గజం రూ. 1.14 లక్షలు

## హౌసింగ్ బోర్డుకు రూ.44.24 కోట్ల మేర ఆదాయం

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో మరోసారి రికార్డు స్థాయి ధరలకు కొనుగోలు చేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్ లోని నివాస భూముల విక్రయాల నిమిత్తం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో చదరపు గజం భూమి ధర రూ.1,14,000 (లక్షా పధ్నాలుగు వేలు) పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ ఐజి ఓపెన్ ప్లాట్ కు ఆఫ్ సెట్ ప్రైజ్ గా రూ.80 వేలు నిర్ధారించగా బహిరంగ వేలంలో చ.గజం రూ. 1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు.హెచ్ ఐ జి లోనే మరో 389 చ.గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ ను చదరపు గజానికి లక్ష రూపాయల ధర పలికిందన్నారు.సోమవారం మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.44.24 కోట్ల మేర ఆదాయం వచ్చింది.27 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో చదరపు గజానికి సగటున రూ.91,947 ధరకు కొనుగోలు చేశారని ఆయన తెలిపారు.కెపిహెచ్ బి ,గచ్చిబౌలి పరిసరాల్లోని భూములకే అధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చింతల్ ప్రాంతంలో కూడా చదరపు గజం ధర లక్ష రూపాయలు దాటడం విశేషం.నగరంలోని అన్ని ప్రాం తాల్లో నివాస భూములకు మంచి డిమాండ్ ఉందనడానికి ఇది నిదర్శనమంటున్నారు.

# ఎపిలో 3డి ప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయండి

● హెచ్‌పీఇన్క్. ఎండి ఇప్సితా దాస్ గుప్తాతో మంత్రి లోకేష్ భేటీ




**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** హెచ్‌పీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ (భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక) ఇప్సితా దాస్ గుప్తాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలో భేటీ అయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల్లో పర్సనల్ కంప్యూటింగ్, ప్రింటింగ్ సొల్యూషన్స్, హైబ్రిడ్ వర్క్ సొల్యూషన్స్ అండ్ గేమింగ్ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెచ్‌పి ఇన్క్. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 53.6 బిలియన్ల ఆదాయాన్ని ఆర్జించింది. భారత్‌లో రూ.17 వేల కోట్లకు పైగా వ్యాపారం చేసిన హెచ్‌పీ సంస్థ... ఐటీ హార్డ్ వేర్ పీఎల్ఐ స్కీమ్ కింద లబ్ధిపొందిన 27 సంస్థల్లో ఒకటిగా నిలచింది. ఈ సందర్భంగా ఇప్సితా దాస్ గుప్తాతో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపీలో 3డీ ప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. 2019లో హెచ్‌పీ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం చేసి 3డీ ప్రింటింగ్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అయితే ఆ తర్వాత పరిణామాల్లో అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలుచేస్తున్న నేపథ్యంలో తక్షణమే ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. హెచ్‌పీ ఇటీవలి కాలంలో డిక్సన్‌తో కలిసి భారతదేశంలో తన ఉత్పత్తిని రెట్టింపు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0 కింద పీసీలు ల్యాప్‌టాప్‌లు, వర్క్‌స్టేషన్ అసెంబ్లింగ్ (ప్రతి సంవత్సరం 5 లక్షల నుండి 10 లక్షల యూనిట్లు సామర్థంతో), హెచ్‌పీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను నెలకొల్పండి. ఎలక్ట్రానిక్ హబ్ గా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో పీసీ కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ పార్క్‌లను (మదర్‌బోర్డులు, డిస్ ప్లేలు, బ్యాటరీలు, ఛార్జర్లు) అభివృద్ధి చేయండి. సప్లయ్ చైన్ భాగస్వాములను ఆంధ్రప్రదేశ్‌కి రప్పించేలా సహకారం అందించండి. సెమీకండక్టర్ పాలసీ లింకేజీలతో కూడిన సమగ్ర క్లస్టర్‌ను ఏర్పాటులో భాగస్వామ్యం వహించండి. హెచ్‌పీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కంప్యూటింగ్ (ఓమిని బ్రాండ్ అభివృద్ధి), సస్టయినబుల్ ప్యాకేజింగ్ సొల్యూషన్లలో భారత మార్కెట్‌కు అనుగుణంగా స్థానిక ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి సారించండి. విశాఖపట్నం లేదా అమరావతిలో ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

# మరో రూ.9 వేల కోట్ల పెట్టుబడులు


## ముందుకొచ్చిన అమెరికా కంపెనీ ఎల్‌లిల్లీ

## ఇక్కడి నుంచే ప్రపంచస్థాయి ఔషధాల తయారీ

## సిఎం రేవంత్‌తో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** తెలంగాణ మరో సారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ.9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎల్ లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎల్ లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎల్ లిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్‌వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎల్ లిల్లీ కంపెనీకి 150 ఏళ్లగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్ లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ అని. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్ధతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మ హబ్‌గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1965లో ఇందిరా గాంధీ హైదరాబాద్‌కు ఐడీపీఎల్ తీసుకురావడంతో ఫార్మా హబ్‌గా మారిందన్నారు. హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫార్మ్‌కు సంబంధించిన అనేక మంది ప్రముఖులు స్కిల్ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సిఎం రేవంత్ పేర్కొన్నారు. మంత్రి శ్రీదర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎల్ లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎల్ లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.




సోమవారం న్యూఢిల్లీలో 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' నివేదికను విడుదల చేస్తున్న నీతి ఆయోగ్ సిఇఒ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం

# స్వాజిలాండ్ రాజుగారి వైభోగమే వేరు!



## 15 మంది భార్యలు 35 మంది సంతానం

## ప్రైవేటు జెట్‌లో దుబాయి పర్యటన..!


**దుబాయి, అక్టోబరు 6:** ఆయనో చిన్న దేశానికి రాజు ఆదేశం కటిక దరిద్రంలో అల్లాడిపోతుంటే ఆ రాజుగారి ఆస్తులు మాత్రం 100 కోట్లడాలర్లకు ఎక్కడా తగ్గలేదు.ఆయనకు 15 మంది భార్యలు, వారికి 35 మంది సంతానంఆయన ఫారిన్ ట్రిప్‌కు వస్తే ప్రత్యేక విమానంలో రావాల్సిందే. ఆయనే ఆఫ్రికా ఖండంలోని చిన్నదేశం ఎస్వాటిని అంటే ఇపుడు స్వాజిలాండ్‌గా పిలుస్తున్న దేశానికి రాజుగా కొనసాగుతున్నారు. రాజు ఎంస్వాటి-3 దుబాయి ఎయిర్‌పోర్టులోకి రాగానే భారీ కోలాహలం నెలకొంది. ఆయనకున్న సంతానం, భార్యలను చూసి దుబాయి ప్రముఖులు సైతం విస్తుపోయారు. సాంప్రదాయ చిరుతపులి చర్మం డిజైన్‌లో ఉన్న దుస్తులు రాజు ధరిస్తే ఆయన మహారాణులు మాత్రం రంగురంగులాఫ్రికన్ దుస్తులతో మెరిసిపోయారు. రాయల్ కాన్వాయ్‌కోసం మూడు టెర్మినల్లను విమానాశ్రయ అధికారులు నిలిపివేసారు. భద్రతా కారణాలపై ప్రత్యేక ఏర్పాట్లుచేసారు. 1986లో బాధ్యతలు స్వీకరించిన ఎంస్వాటి-3 రాజు ప్రపంచంలోనే ధనికరాజుల్లో ఒకరు. ఎంస్వాటి తండ్రి సొభుజా-2 కూడా తక్కువేమీ కాదు. ఆయనకు 125 మంది భార్యలు, 210 మంది పిల్లలకు తండ్రిగా రికార్డు సాధించారు. ఏటా రిగే 'రీడ్ డ్యాన్స్' అనే శతాబ్దాలనాటి పురాతన సాంప్రదాయ ఉత్సవంలో కొత్త భార్యను రాజు ఎంచుకుంటారు. దేశంలో కటిక పేదరికం, అసమానతలు, నిరుద్యోగం వంటి తీవ్రసమస్యలు ఉన్నప్పటికీ ఆయన ప్రైవేటు జెట్‌లలో విలాసయాత్రలు చేస్తున్నాండంటూ విమర్శలు వెల్లువెత్తాయి. యుఎఇతో ఆర్థిక ఒప్పందాలు, పెట్టుబడి అవకాశాలపై చర్చించడానికే ఎంస్వాటి-3 దుబాయి పర్యటనకు వచ్చారు. ప్రపంచ బ్యాంకు నివేదికప్రకారం ఎస్వాటిని అంటే స్వాజిలాండ్‌లో నిరుదోనయగం 2021లో 23శాతంనుంచి 33.3శాతానికి చేరింది. రాజుగారికి మాత్రం నిర్మాణరంగం, పర్యాటకరంగం, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్, అడవుల పెంపకం వంటి రంగాల్లోని పరిశ్రమల్లో వాటాలున్నాయి.

# యజమానికే ఉద్యోగి టోకరా

## రూ.5.72 కోట్ల విలువైన బంగారు నాణేల చోరీ!



**ముంబై, అక్టోబరు 6:** ఒక సంస్థలో పని చేసే ఉద్యోగి ఏకంగా యజమానిని మోసగించాడు. రూ.5.72 కోట్ల విలువైన బంగారు నాణేలను కాజేసి తన సొంత ఆర్థిక అవసరాల కోసం వాడేసాడు. యజమాని ఫిర్యాదుతో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. వాన్రాయ్ ప్రాంతంలోని కార్పొరేట్ గిఫ్ట్ ఆర్టికల్స్ తయారు చేసే సంస్థలో రెండేళ్లుగా సునీల్ గుప్తా పని చేస్తున్నాడు. ఆర్థిక లావాదేవీలు నిర్వహించే అధికారంతో పాటు ఆ కంపెనీ ఇమెయిల్ ఖాతాల యాక్సెస్‌ను అతడు కలిగి ఉన్నాడు. కార్పొరేట్ బహుమతి కోసం ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీ బంగారు నాణేలను ఆర్డర్ చేసిందని యజమాని నరేష్ జైన్‌కు సునీల్ గుప్తా తెలిపాడు. దీంతో రూ.2.46 కోట్ల విలువైన 3.4 కిలోల బంగారు నాణేలను ఆయన కొనుగోలు చేశాడు. డెలివరీ కోసం వాటిని సునీల్‌కు అప్పగించాడు. అయితే నకిలీ పత్రాలు, ట్యాక్స్ ఇన్‌వాయిస్‌లను యజమానికి చూపించాడు. బంగారు నాణేలను ఆ ఫార్మా కంపెనీకి డెలివరీ చేసినట్లు నమ్మించాడు. మరోవైపు ఆ ఫార్మా కంపెనీ గోల్డ్ కాయిన్స్ కోసం రెండో ఆర్డర్ ఇచ్చిందని యజమాని నరేష్ జైన్‌కు సునీల్ గుప్తా తెలిపాడు. దీంతో రూ.3.17 కోట్ల విలువైన మరో 3.6 కిలోల బంగారు నాణేలు కొని అతడికి అందజేశాడు. ఈ రెండు ఆర్డర్లకు చెల్లింపులు జరుగకపోవడాన్ని యజమాని నరేష్ జైన్ గుర్తించాడు. సునీల్ గుప్తాను నిలదీయగా ఆ బంగారు నాణేలను డెలివరీ చేయలేదని తెలిపాడు. వ్యక్తిగత ప్రయోజనం కోసం వాటిని వాడుకున్నట్లు ఒప్పుకున్నాడు. అయితే గోల్డ్ కాయిన్స్ కోసం ఏ ఫార్మా కంపెనీ ఆర్డర్లు ఇవ్వలేదని సునీల్ గుప్తా తెలిపాడు. ఆర్డర్లు, డెలివరీకి సంబంధించి బోగస్ ఇన్‌వాయిస్‌లు, నకిలీ పత్రాలు సృష్టించినట్లు అంగీకరించాడు. తన ఆర్థిక సమస్యలు తీరిన తర్వాత రూ5.72 కోట్ల డబ్బు తిరిగి చెల్లిస్తానని నరేష్ జైన్‌కు చెప్పాడు. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సునీల్ గుప్తాను అరెస్ట్ చేశారు




# ఎర్రకోటకు కాలుష్యం

## కట్టడం పటిష్టతకు ముప్పు - నిపుణుల హెచ్చరిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** దేశ రాజధాని ఢిల్లీకి తలమానికంగా నిలిచే చారిత్రక ఎర్రకోట తన సహజ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉంది. నగరంలోని తీవ్ర వాయుకాలుష్యం కారణంగా 17వ శతాబ్దపు ఈ అద్భుత కట్టడం తన ఎర్రటి రంగును కోల్పోయి నల్లగా మారుతోంది. భారత్, ఇటలీ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని విషపూరిత గాలి ఎర్రకోట రాతి గోడలను రసాయనికంగా దెబ్బతీస్తోందని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వాహనాల పొగ, పరిశ్రమలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి కణాలు గాలిలో కలిసి కోట గోడలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల బ్లాక్ క్రస్ట్స్ ఏర్పడుతున్నాయి. ఈ పొరలలో జిప్సం, క్వార్ట్జ్‌తో పాటు సీసం, రాగి, జింక్ వంటి ప్రమాదకరమైన భార లోహాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2021 నుంచి 2023 వరకు సాగిన ఈ అధ్యయన వివరాలను జూన్ 2025లో హెరిటేజ్ అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించారు. ఈ నల్లటి పొరలు కేవలం కట్టడం రంగును మార్చడమే కాకుండా, దాని పటిష్టతను కూడా దెబ్బతీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే, గోడలపై ఉన్న సున్నితమైన, అపురూపమైన శిల్పకళ శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రకోటకే కాకుండా ఢిల్లీలోని హుమాయూన్ సమాధి వంటి ఇతర చారిత్రక కట్టడాలకు కూడా భవిష్యత్తులో ఇదే ముప్పు పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. అయితే ఈ నష్టాన్ని నివారించడానికి కొన్ని పరిష్కార మార్గాలు ఉన్నాయని పరిశోధకులు సూచిస్తున్నారు. ఈ నల్లటి పొరలు ఏర్పడటం ప్రారంభ దశలో ఉన్నప్పుడే వాటిని సురక్షితంగా తొలగించడం ద్వారా రాతికి జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తరచూ శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టడం, రాళ్లకు రక్షణ పూతలు వేయడం ద్వారా ఈ చారిత్రక సంపదను కాపాడుకోవచ్చు అని అధ్యయనంలో పేర్కొన్నారు.

సముద్రంలో చమురు చిందటం వంటి ప్రమాదకర సమయాల్లో సహాయక కార్యక్రమాలపై సోమవారం తమిళనాడు తీరంలో ఇండియన్ నేవీ నిర్వహించిన రిహార్సల్స్ దృశ్యం



# మావోయిస్టు పార్టీలో మళ్లీ మల్లోజుల కలకలం

## పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన సాయుధ పోరాటాన్ని వీడాలని క్యాడర్‌కు పిలుపు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు అయిన మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ మరోసారి సంచలన ప్రకటన చేశారు. పార్టీలో తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం నాడు ఒక ప్రకటన చేసిన మల్లోజుల సాయుధ పోరాటాన్ని వీడాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఇంతకు ముందు మావోయిస్టు పార్టీ ఆయుధాలను వీడాలని, కేంద్రంతో చర్చ లు జరపాలని అభయ్ చేసిన ప్రకటన సంచలనం రేపగా దీనిని ఆ పార్టీ ఖండించడంతోపాటు ఇది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొంది. ఇలాంటి ప్రటకన చేసినందుకు అభయ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన మావోయిస్టు పార్టీ ఆయన తన ఆయుధాలను వెంటనే అప్పగించాలని లేకుం టే, పార్టీ క్యాడర్ తీవ్రంగా వ్యవహరిస్తుందని హెచ్చ రించింది.

దీనిపై ఓవైపు చర్చ జరుగుతుండగానే మల్లోజుల మరో ప్రకటన విడుదల చేశారు. తా ను మావోయిస్టు పార్టీలో అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నానని, అన్నివార్య కారణాల వల్ల ఈ పదవుల్లో కొనసాగే అర్హత తనకు లేదని అభయ్ తన ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు పార్టీ క్యాడర్ వెంటనే సాయుధ పోరాటాన్ని వీడాలని ఆయన పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు అనుసరించిన పంథా పూర్తిగా తప్పని, దీనివల్ల ఉద్యమం తీవ్రంగా నష్ట పోయిందని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ ఉద్యమాన్ని ఓట మి పాలుకాకుండా కాపాడలేక పోయినందుకు తాను క్షమాపణ కోరుతున్నట్లు ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదని, ఇలా జరిగివుంటే పరిస్థితి మరోరకంగా వుండేదని ఆయన వెల్లడించారు. అడవుల్లో వుంటూ ఏడాదికి ఒకటి లేదా రెండుసార్లు శత్రువులపై దాడులు చేసినంత మాత్రాన విజయం అనుకుంటే అది పూర్తిగా తప్పని, శత్రువులు రోజు రోజుకు బలపడుతున్నా ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిందని అభయ్ తెలిపారు. ఆయుధాలు వీడాలనే నిర్ణయంపై పార్టీలో అంత ర్గతంగా చర్చ జరిగిన తరువాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జీవించి వున్నపుడే ఈ అంశంపై చర్చ జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో సాయుధ పోరాటం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేమని అభయ్ తెలిపారు. అనవసర త్యాగాలకు ఇకనైనా ముగింపు పలికి, పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవా లని అభయ్ హితవు పలికారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన క్యాడర్‌కు సూచించారు.

07-10pg10 12 gnt_07-10pg10.qxd 10/6/2025 11:09 PM Page 1



ఆట

### డబ్ల్యుటిసి పాయింట్లలో..
# భారత్‌కు తప్పని నిరాశ
### వెస్టిండీస్‌పై గెలిచినా మెరుగుపడని ప్లేస్

**న్యూఢిల్లీ:** తొలి టెస్టులో వెస్టిండీస్ పై ఘన విజయం సాధించినా కూడా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత స్థానం మెరుగుపడలేదు. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. వెస్టిండీస్ మూడు రోజులు కూడా మైదానంలో ఉండకుండా చేసింది. దీంతో, శుభ్‌మాన్ గిల్ కెప్టెన్‌గా భారత్ తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసింది. అయితే, ఈ అద్భుతమైన విజయం ఉన్నప్పటికీ, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు ఎటువంటి ఆధిక్యాన్ని పొందలేకపోయింది. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఇది టీమ్ ఇండియా ఆరవ మ్యాచ్. గతంలో, భారత జట్టు ఇంగ్లాండ్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి, రెండింటిలో గెలిచి, అదే సంఖ్యలో ఓడిపోయింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. ఇప్పుడు, వెస్టిండీస్‌ను ఓడించడం ద్వారా, టీమ్ ఇండియా 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తన మూడవ విజయాన్ని సాధించింది. ఈ విక్టరీతో, భారత




జట్టు విజయ శాతం 46.67 నుంచి 55.56కి పెరిగింది. అయితే, పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. ఇక ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో వెస్టిండీస్ పేలవమైన ప్రదర్శన కనబరిచింది. ఇంకా ఒక్క విజయం కూడా నమోదు చేయలేదు. నాలుగు మ్యాచ్‌లు ఆడి అన్నింటిలోనూ ఓడిపోయింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ఇంతలో, ఇంగ్లాండ్ ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో స్టాండింగ్స్ లో నాల్గవ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ కూడా రెండు మ్యాచ్‌లు ఆడి ఇంకా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. అయినప్పటికీ ఒక డ్రా కారణంగా ఐదవ స్థానంలో ఉంది. నిజానికి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా, శ్రీలంక భారత జట్టు కంటే ముందున్నాయి. రెండు జట్లు భారత జట్ట కంటే మెరుగైన విజయ శాతాన్ని కలిగి ఉన్నాయి. వెస్టిండీస్‌ను ఓడించిన తర్వాతకూడా, టీమ్ ఇండియా విజయశాతంలో ఆస్ట్రేలియా, శ్రీలంకను అధిగమించ లేకపోయింది. ఆస్ట్రేలియా ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి మూడింటినీ గెలుచుకుంది. ఫలితంగా 100 విజయ శాతం వచ్చింది. మరోవైపు, శ్రీలంక రెండు మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక డ్రాతో 66.67 విజయ శాతంతో రెండవ స్థానంలో ఉంది.

## అల్ ఐన్ మాస్టర్స్: భారత్‌కే సింగిల్స్, డబుల్స్ టైటిళ్లు

**న్యూఢిల్లీ:** అల్ ఐన్ మాస్టర్స్ 2025, మహిళల సింగిల్స్ మరియు పురుషుల డబుల్స్ టైటిళ్లను భారత్ షట్లర్లు కైవసం చేసుకున్నారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అంసకరుణన్ మరియు ఎంఆర్ అర్జున్ విజయం సాధించడంతో రైజింగ్ స్టార్






శ్రీయాన్షి తొలి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అబుదాబిలో సోమవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 100 ఈవెంట్ అయిన అల్ ఐన్ మాస్టర్స్‌లో భారత షట్లర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఖలీఫా బిన్ జాయెద్ స్టేడియంలో జరిగిన 49 నిమిషాల హోరాహోరీ పోరులో 18 ఏళ్ల శ్రీయాన్షి వలిశెట్టి 15-21, 22-20, 21-7 తేడాతో స్వదేశీయురాలు తస్నిమ్ మీర్‌ను ఓడించి అద్భుతమైన పునరాగమనం చేసింది. ఇది 20 ఏళ్ల మాజీ జూనియర్ ప్రపంచ నంబర్ 1 పై మూడు మ్యాచ్‌లలో శ్రీయాన్షి సాధించిన తొలి విజయంతో పాటు, తొలి బిఎఫ్‌డబ్ల్యూ సూపర్ 100 టైటిల్‌ను నమోదు చేసింది. ప్రస్తుతం ప్రపంచ 61వ ర్యాంక్‌లో ఉన్న శ్రీయాన్షి తొలి గేమ్‌లో 4-0 ఆధిక్యంతో మ్యాచ్‌ను బలంగా ప్రారంభించింది. తస్నిమ్ 21-15తో ఓపెనర్‌ను కైవసం చేసుకోవడానికి పోరాడింది. కానీ శ్రీయాన్షి రెండవ గేమ్‌ను 22-20తో తృటిలో గెలిచి పోటీని నిర్ణయాత్మక మ్యాచ్‌గా మార్చింది. చివరి గేమ్‌లో వలిశెట్టి శ్రీయాన్షి ఆధిపత్యం చెలాయించింది, 7-7తో టైను 21-7తో ఓడించింది. ఇక పురుషుల డబుల్స్‌లో, భారత జంట హరిహరన్ అంసకరుణన్-ఎంఆర్ అర్జున్ ఇండోనేషియాకు చెందిన ఐదవ సీడ్ రేమండ్ ఇంద్ర-నికోలస్ జోక్విన్‌లను 35 నిమిషాల్లో 21-17, 21-18 తేడాతో ఓడించారు. అలాగే పురుషుల సింగిల్స్‌లో, మాజీ ప్రపంచ నంబర్ 1 కిదాంబి శ్రీకాంత్ ప్రచారం సెమీఫైనల్లో ముగిసింది. మలేషియాకు చెందిన షోలే ఐడిల్ చేతిలో 4-21, 21-11, 19-21 తేడాతో ఓడిపోయాడు.



### అనిసిమోవాకు
# చైనా ఓపెన్ కిరీటం

**న్యూఢిల్లీ:** ఫామ్‌లో ఉన్న అనిసిమోవా చైనా ఓపెన్ కిరీటాన్ని గెలుచుకుంది. బీజింగ్‌లో జరిగిన చైనా ఓపెన్ ఫైనల్లో లిండా నోస్కోవాను ఓడించి, అమండా అనిసిమోవా తన కెరీర్‌లో రెండవ డబ్ల్యూటిఎ 1000 టైటిల్‌ను సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఒడిదుడుకుల నుండి కోలుకుంటూ అనిసిమోవా 6-0, 2-6, 6-2 తేడాతో నోస్కోవాను ఓడించింది. ఫిబ్రవరిలో ఖతార్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవడంతో పాటు, ఆ తర్వాత వింబుల్డన్ మరియు యుఎస్ ఓపెన్‌లలో ఫైనల్ ఫినిషింగ్‌లతో అనిసిమోవా ఈ సీజన్‌లో కూడా తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తోంది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో జాస్మిన్ పావోలినిని ఓడించి, సెమీ ఫైనల్లో తన స్వదేశీయురాలు కోకో గాఫ్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించి టాప్ 10 క్రీడాకారిణులపై వరుసగా విజయాలుసాధించింది. ఫైనల్స్‌లో గాఫ్‌తో జరిగిన మ్యాచ్‌లో అనిసిమోవా ఆపిన చోటు నుంచి పుంజుకుంది, కేవలం 23 పరుగులు మాత్రమే చేసి మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. అక్కడ ఆమె కేవలం 12 పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ప్రత్యర్థి తడబడుతుండగా, ఆమె రెండవ సెట్ యొక్క 11 నిమిషాల ప్రారంభ గేమ్‌లో అనిసిమోవా బద్దలు కొట్టి రెండవ సెట్‌ను కైవసం చేసుకుంది. 20 ఏళ్ల చెక్ విజేతగా కనిపించినప్పుడు, అనిసిమోవా ఆరవ గేమ్‌లో బ్రేక్ చేసి 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆమె మరో బ్రేక్‌తో టైటిల్‌ను కైవసం చేసుకుంది, బ్యాక్‌హ్యాండ్‌తో దానిని మూసివేసింది.

### అబియా పారా బ్యాడ్మింటన్‌లో..
# ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** ఏస్ ఇండియన్ పారా షట్లర్ ప్రమోద్ భగత్ 1వ అబియా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్-2025లో తన అత్యుత్తమ ఫామ్‌ను ప్రదర్శించి మూడు బంగారు పతకాలను సాధించాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 టైటిల్‌ను భగత్ గెలుచుకున్నాడు. అబియాలో సోమవారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ పోరులో మంటు కుమార్‌ను 21-7, 9-21, 21-9 తేడాతో ఓడించాడు. వ్యూహాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ భగత్ రెండవ గేమ్‌ను కోల్పోయిన తర్వాత బలంగా పుంజుకుని మూడు గేమ్‌లలో విజయం సాధించాడు. ఆ తర్వాత అతను సుకాంత్ కదమ్‌తో కలిసి పురుషుల డబుల్స్‌లో పెరూకు చెందిన గెర్సన్ జైర్ వర్గాస్ లోస్టానౌల్-దయానా రోజాస్ గోలాక్‌లను వరుస సెట్లలో 21-13, 21-17 తేడాతో ఓడించి మరో స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఇక భగత్ మూడవ స్వర్ణం మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యు5 విభాగంలో వచ్చింది. ఆరతి పాటిల్‌తో కలిసి మరో ఉత్తేజకరమైన ఫైనల్ విజయాన్ని సాధించాడు. ఇక భారత్‌కే చెందిన షట్లర్లు వివిధ విభాగాల్లో రాణించారు. పురుషుల సింగిల్స్ డబ్ల్యూహెచ్2లో నూరుల్ హుస్సేన్ ఖాన్ రజతం గెలుచుకోగా, మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో ఉమా సర్కార్ రజతం గెలుచుకుంది. మహిళల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యు5లో ఆరతి పాటిల్ మరియు ఉమా సర్కార్ ద్వయం కాంస్యం సాధించింది.




### ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్..
## నేపాల్‌పై భారత్ అద్భుతమైన విజయం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ జట్టు అద్భుత ప్రదర్శనతో ప్రారంభించింది. గౌహతిలో తొలి రోజు సోమవారం జరిగిన ఉత్కంఠభరితమైన ఓపెనర్ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ నేపాల్‌పై ఆధిపత్యం చెలాయించగా, శ్రీలంక జట్టు యుఎఇపై విజయం సాధించింది. రెండవ సీడ్ అయిన భారత్ గ్రూప్ బీ ఓపెనర్‌లో 45-18, 45-17తో సులభంగా విజయం సాధించింది, అయితే శ్రీలంక జట్టు యుఎఇ చేసిన ప్రయత్నాలు




తిప్పికొట్టి 30-45, 45-34, 45-44తో గెలిచింది. 14 సార్లు ఛాంపియన్లుగా నిలిచిన చైనా, మాజీ ఛాంపియన్లు ఇండోనేషియా, దక్షి ణ కొరియాలతో సహా అన్ని ఇతర అగ్ర దేశాలు తమ ప్రత్యర్థులను రెండు వరుస సెట్లలో ఓడించి తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాయి. మాజీ ప్రపంచ జూనియర్ నంబర్ 1 బాలుర డబుల్స్ జత భార్గవ్ రామ్ అరిగెల, విశ్వ తేజ్ గొబ్బూరు కబీర్ కెసి, సుప్రీమ్ పంటపై 9-3 తేడాతో విజయం సాధించి భారతదేశం తరపున బంతిని ముందుకు తీసుకెళ్లారు.

అలాగే బాలికల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, ఆసియా అండర్19 ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత తన్వి శర్మ వారి వారి సింగిల్స్ మ్యాచ్‌లలో క్లినికల్‌గా రాణించగా, సూర్యాంశ్ రావత్, రౌనక్ చౌహాన్ పెద్ద సవాళ్లను సైతం ఎదుర్కొన్నారు. ఇక చైనా 45-14, 45-10 తేడాతో ఘనాను, కొరియా 45-22, 45-29 తేడాతో హంగేరిని, చైనీస్ తైపీ బ్రెజిల్‌ను 45-24, 45-19 తేడాతో, ఇండోనేషియా 45-27, 45-40 తేడాతో ఫిలిప్పీన్స్‌ను ఓడించాయి.

### ఐపిఒ ద్వారా లలితా జ్యుయెలరీ మార్ట్ రూ.1700 కోట్లు
# సేకరణకు సెబి అనుమతి

**విశాఖపట్నం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** చెన్నైకి చెందిన లలితా జ్యువెలరీ మార్ట్, ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ) ద్వారా రూ.1700 కోట్లు సేకరించేందుకు మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) నుంచి అనుమతి పొందింది. కంపెనీ ఈ యేడాది జూన్ 6న సెబీకి తమ ఐపిఒ పత్రాలను దాఖలు చేసింది. ప్రమోటర్ కిరణ్ కుమార్ ఐపిఒ ద్వారా రూ.1200 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా జారీ, మరో రూ.500 కోట్ల విలువైన షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉండను న్నాయి. దేశంలో కొత్త దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మూలధన వ్యయానికి నిధులు సమకూర్చేందుకు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం. రూ.1014.50 కోట్ల వరకు తాజా ఇష్యూ ద్వారా రానుంది. లలితా జ్యువెలరీ మార్ట్ 1985లో చెన్నైలోని టి.నగర్ ప్రాంతంలో తన మొదటి స్టోర్‌ను ప్రారంభించింది, ఇది పట్టు మరియు ఆభరణాల రిటైల్ అవుట్‌లెట్‌లకు కేంద్రంగా ఉంది. ప్రధానంగా బంగారు ఆభరణాలను విక్రయిస్తోంది. వెండి వస్తువులు, వజ్రాల ఆభరణాలుకూడా ఉన్నాయి. ఇది దక్షిణ భారత మార్కెట్‌కు సేవలు అందిస్తోంది,బిఐఎస్ హాల్‌మార్క్ చేసిన ఆభరణాలతో 56 స్టోర్‌ల ద్వారా పనిచేస్తుంది, వీటిలో 22 ఆంధ్రప్రదేశ్‌లో, 20 తమిళనాడులో, ఏడు కర్నాటకలో, ఆరు తెలంగాణలో, ఒకటి పుదుచ్చేరిలో ఉన్నాయి, గత ఏడాది డిసెంబర్ 31నాటికి మొత్తం 6,09,408 చదరపు అడుగుల కార్యాచరణ ప్రాంతంలో విస్తరించి ఉన్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ పేర్కొంది. సిఎజిఆర్ పేర్కొన్న క్రిసిల్ నివేదిక ప్రకారం 2022 నుంచి 2024 ఆర్థిక సంవత్సరం, డిసెంబరు 31, 2024తో ముగిసిన తొమ్మిది నెలల్లో దేశంలోని కీలకమైన వ్యవస్థీకృత ఆభరణాల ఆటగాళ్లలో ఇది స్టోర్‌కు అత్యధిక నిర్వహణ ఆదాయాన్ని కలిగి ఉన్నట్టు సంస్థ పేర్కొంది.వినియోగదారులను ఆకర్షించే విధంగా పలు పథకాలను అమలుచేస్తోంది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, 420,261 మంది వినియోగదారులు నమోదు చేసుకున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ వివరించింది. ఇది తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో తిరుముడివక్కం (కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న), కాంచీపురంలోని మరైమ్మలై (దాని పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ, అసిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తోంది. రెండు తయారీ సౌకర్యాలను నిర్వహిస్తోంది. డిసెంబర్ నుంచి చెన్నైలోని తిరుముడివక్కంలో దాని తయారీ కేంద్రం కార్యకలాపాలను ప్రారంభించినట్టు వివరించింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, ఇది 563 చేతివృత్తిదారులను నియమించుకుంది.(కంపెనీ ద్వారా 474 చేతివృత్తిదారులు, అసిత జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 89 చేతివృత్తిదారులను నియమించింది). కంపెనీ దేశంలోని అతిపెద్ద ఆభరణాల దుకాణాల్లో ఒకటి విజయవాడలో నిర్వహిస్తున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ యాజ మాన్యం పేర్కొంది. ఇది మొత్తం 1,00,000 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణంలో విస్తరించి ఉంది.

### అదానిగ్రూప్ ఎసిసి కంపెనీకి
# ఐటిశాఖ భారీ జరిమానా




**ముంబయి, అక్టోబరు 6:** భారత్ కార్పొరేట్‌రంగంలో అగ్రామి బిలియనీర్ అయిన గౌతమ్ ఆదాని కంపెనీలు ఆదానిగ్రూప్ సిమెంట్ కంపెనీ ఎసిసికి ఆదాయపు పన్ను ఝలక్ ఇచ్చింది. రెండు వేరువేరు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.23.07 కోట్ల జరిమానా వేసింది. ఈ ఉత్తర్వుల కాపీలు కంపెనీకి ఈనెల 1వ తేదీనే అందాయి. అయితే వీటి ప్రభావం కంపెనీ కార్యకలాపాలపై ఉండబోదని, ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తున్నట్లు ఎసిసి వెల్లడించింది. ఆదానిగ్రూప్‌లో విలీనం కంటే ముందుకాలానికి సంబంధించినవని చెప్పింది. 2015-16, 2018-19 సంవత్సరాలకు సంబంధించి ఈ జరిమానాలు ఆదాయపు పన్నుశాఖ విధించింది. 2014-15లో కంపెనీ చేసిన 49.25 కోట్ల ఖర్చు క్లెయిమ్‌ను ఐటిశాఖ ఆమోదించలేదు. ఫలితంగా పన్ను 14.22 కోట్లు జరిమానాగా విధించింది. తప్పుడు ఆదాయ వివరాలు అందించిందని వర్గీకరించింది. రెండోజరిమానా పరంగా 2018-19 అసెస్‌మెంట్ సంవత్సరంలో ఆదాయపు పన్ను 12.79 కోట్ల ఖర్చు క్లెయిమ్‌చేసినా తిరస్కరించింది. ఆదాయం తక్కువ చూపించిందని రూ.8.85 కోట్లు జరిమానా వేసింది. ఈజరిమానా సంబంధిత చెల్లింపుపన్నులో 200శాతం రేటుతో విధించింది. ఈ రెండు ఉత్తర్వులను మేం అప్పీలుచేస్తామని వెల్లడించింది. నిర్ణీత గడువులోపు పన్నుకమిషనర్‌వద్ద అప్పీలు దాఖలుచేస్తామని, జరిమానా డిమాండ్లపై స్టే కోరతామని వెల్లడించింది. ఎసిసి సిమెంట్స్ఆదాని గ్రూప్‌లో ఒకటిగా ఉంది. అంబూజా సిమెంట్స్ ఎసిసిలో 50శాతం కంటే ఎక్కువ వాటాతో ఉంది. స్విస్‌కంపెనీ హోల్సిమ్‌నుంచి అంబూజా సిమెంట్స్‌ను 6.4 బిలియన్ డాలర్లకు కొనుగోలుచేసింది. ఎసిసి ఆదానిగ్రూప్‌లో విలీనానికి ముందే ఈ జరిమానాలు విధించిన అసెస్‌మెంట్‌సంవత్సరాలనం కంపెనీ స్పష్టంచేస్తున్నా ఆదానికి మాత్రం మళ్లీ అప్పీలుకు వెళ్లక తప్పని పరిస్థితి ఎదురయింది.

# చుక్కల్లోకి చేరిన పసిడి

వాణిజ్యం

### 10గ్రాములు ధర సగటున రూ.1.23 లక్షలు పైనే
### ఒక్కరోజులోనే రూ.1370 పెరుగుదల
### అదే బాటలో వెండికూడా...

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** అమెరికా షట్‌డౌన్, ప్రపంచ ఆర్థికమార్కెట్లలో అనిశ్చితులు, ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల కుదింపు వంటి అంశాలతో ఇన్వెస్టర్లు మొత్తం బంగారం మార్కెట్ వైపు దృష్టిమరల్చారు. దీనికితోడు ఈక్విటీ మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్లు కూడా అనిశ్చితి నేపథ్యంలో ఇప్పటివరకూ 1.20 లక్షల కోట్లు విత్‌డ్రాచేసారని వినికిడి. ఒక్క నెలలోనే 60వేలకోట్లకుపైగా విత్‌డ్రాచేసారంటే గోల్డ్‌మార్కెట్ వైపు ఇన్వెస్టర్లు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కరెన్సీ మార్కెట్‌లో కూడా భారత్ రూపాయి భారీగా క్షీణతను ఎదుర్కొంటున్నది. దీనితో గత చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు పెరిగాయి. దేశంలో సగటున పదిగ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరలు 1.23 లక్షలరూపాయలుగా పలుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లలోకూడా బులియన్‌ధరలు ఔన్స్ ఒక్కింటికి 3949.58 డాలర్లకుపైబడింది. హైదరాబాద్‌లో పదిగ్రాముల 24 క్యారెట్లు రూ.9700 పెరిగి 1,23,420 రూపాయలుగా నడిచింది. 22 క్యారట్ల ధరలు కూడా రూ.1250 పెరిగి రూ.1,10,700గా ఉంటే 18 క్యారెట్ల బంగారంధర కూడా రూ.1030 పెరిగి రూ.90,850గా నడిచింది. చెన్నైలో బంగారం ధరలు చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారెట్లు రూ.1,20,660గా ఉంటే 22 క్యారెట్లుధరలు రూ.1,10,600గాఉంది. ఇక18క్యారెట్లు రూ.91,600గా నమోదయింది. అలాగే ముంబయిలో 10 గ్రాముల 24 క్యారెట్లగోల్డ్ ధరలు రూ.1,20,770గా ఉంది.



22 క్యారెట్లుధరలు 1,10,700గాను, 18 క్యారెట్ల పదిగ్రాముల ధరలు రూ.1030పెరిగి రూ.90,580గా నడిచింది. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంధరలు రూ.1,30,300గా నడిస్తే 22 క్యారెట్లు ధరలు రూ.1,10,700 గా నడిచింది. 18 క్యారెట్లధరలు రూ.90,580గా నమోదయింది. బెంగళూరు మార్కెట్లు పదిగ్రాములు 1,20,820గాను, 22 క్యారెట్లు 1,10,750గాను, 18 క్యారెట్లు 90,630గాను కొనసాగింది. ఆభరణాల వ్యాపారిని ముంబయి తర్వాత అత్యంత బిజీ మార్కెట్ అయిన అహ్మదాబాద్‌లో 24 క్యారెట్లు రూ.1,20,820గాను, 22 క్యారెట్లు రూ.1,10,750గాను, 18 క్యారెట్లు ధరలు రూ.90,630గాను నమోదయింది. వెండిధకరలు కూడా కిలో ఒక్కింటికి 1.54 లక్షలుగా కొనసాగింది.

దేశరాజధానిలో అయితే 1.57,400గా నడిచింది. వెండి ఒక్కరోజులోనే 7400 పెరిగి పీక్‌స్థాయికి చేరింది. గత వారాంతంలో1.50 లక్షలున్న వెండి సోమవారానికి అకస్మాత్తుగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోకూడా ఔన్స్ ఒక్కింటికి వెండి 48.75 డాలర్లు పెరిగింది.




### టిమ్‌కుక్ తదుపరి యాపిల్ సిఇఒ ఎవరు?

**సియాటెల్, అక్టోబరు 6:** యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ వారసుడిపై టెక్కీ సర్కిళ్లలోజోరుగాచర్చలు సాగుతున్నాయి. వచ్చేనెలలో 65 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న టిమ్‌కుక్ వారసడిగా ప్రస్తుతం యాపిల్ హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ బాధ్యతలు చూస్తున్న ఉపాధ్యక్షుడు జాన్‌టర్నస్ పేరు వినిపిస్తోంది. యాపిల్‌తో టర్నస్‌కు 24ఏళ్లు అనుబంధం ఉంది. ఆయన వయసు ప్రస్తుతం 50 ఏళ్లు. సిఇఒగా 2011లో టిమ్‌కుక్ ఛార్జితీసుకున్నపుడు కూడా ఆయనకు 50 యేళ్లే. యాపిల్ సంస్థలో కీలకనిర్ణయాలు తీసుకునే అతికొద్దిమంది వ్యక్తుల్లో టర్నస్ ఒకరు. లండన్‌లో ఐఫోన్ 17 ఈవెంట్‌లో ఐఫోన్ ఎయిర్‌ను ఆయనే మార్కెట్‌కు వదిలారు. యాపిల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లందరినీ చూస్తే ఆయనే పిన్నవయస్కుడు.మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌యాపిల్ సిఓఓ సబిహ్‌ఖాన్‌పేరుతో పాటు రిటైల్‌హెడ్ డీర్డేఓబ్రెయిన్‌లపేర్లుకూడా ఉన్నాయి. కొంతకాలం అడ్‌హాక్ సిఇఒగా నియమించి ఆతర్వాతనే శాశ్వత ప్రతిపాదికన సిఇఒ నియామకంవైపుకూడా చూస్తున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లకు కార్పొరేట్ ఫలితాల దన్ను!

### సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలజోరు..

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. కార్పొరేట్‌త్రైమాసిక పలితాలపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెట్టారు. నిఫ్టీ 25,070కిపైబడి ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటి, హెల్త్‌కేర్, ప్రైవేటు బ్యాంకు స్టాక్స్ భారీగాపెరిగాయి. ఆర్బీఐ గత వారం తన పాలసీ విధానాలను ప్రకటిస్తూ జిడిపి అంచనాలను 6.8శాతంగా ప్రకటించింది. అలాగే ద్రవ్యోల్బణం అంచనాను కూడా 3.1 నుంచి 2.6శాతంగా ఉంటుందని ప్రకటించడంతో సూచీల్లో జోరుపెరిగింది. బిఎస్ఇ సెన్సెక్స్ 582.95 పాయింట్లు పెరిగి 81,790.12 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 183.40 పాయింట్లుపెరిగి 25,077.65 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు 1.9శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ 1.98, బజాజ్ ఫైనాన్స్ 1.95, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం చొప్పున సూచీల్లో పెరిగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్



సూచీ 0.68శాతం లాభపడితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం వెనుకబడింది. మార్కెట్లలో బిఎస్ఇ పరంగా 1827 కంపెనీలు లాభపడితే 2453 కంపెనీలు క్షీణించాయి. మొత్తం 173 కంపెనీలు స్థిరంగా కొనసాగినట్లు తేలింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.82వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్‌పరంగా 1.57శాతం లాభపడింది. పదిగ్రాములు 1,19,957గా నడిచింది. యుఎస్ పదేళ్ల బాండ్ల రాబడులు 1.04శాతంపెరిగి 4.163 శాతంగా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 1.11 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 65.64 డాలర్లుగాకొనసాగింది. యూరోపియన్ మార్కెట్లలో సూచీలు కొంతమేర లాభాల్లోనే కొనసాగాయి. ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ ఆకస్మిక రాజీనామాపైనా దృష్టిపెట్టాయి.ఆసియా మార్కెట్లు సైతం భారీగాపెరిగాయి జపాన్ కొత్తప్రధానిగా సానై తకైయిచి ఎన్నికవడాన్ని మార్కెట్లు స్వాగతించాయి. ఇక చైనా, దక్షిణకొరియాలు మాత్రం సెలవుల కారణంగామూతపడ్డాయి. ఇక నాస్‌డాక్ కాంపోజిట్ 0.28 శాతం క్షీణించి 22,780.51వద్ద నిలిచింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 238.56 పాయింట్లవద్ద క్షీణించి 46,758.28 వద్ద నిలిచింది. రస్సెల్ 2000 సూచీ కూడా 0.72శాతం పెరిగి 2476.18 వద్ద ముగిసింది. ఇక మార్కెట్లకు పేస్ డిజిటెక్ 217.50వద్దట్రేడ్ అయింది. ఇష్యూధర 2019 కాగా 0.68శాతం క్షీణించింది. సిజిహెచ్ఎస్‌రేట్లను కేంద్రం సవరించడంతో ఆసుపత్రి కంపెనీల షేర్లు భారీగాపెరిగాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం, ఉజ్జీవన్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 1.20శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1.20శాతం పెరిగితే బంధన్‌బ్యాంకు షేర్లు 0.42శాతం క్షీణించాయి. జుబిలియంట్ ఫుడ్‌వర్క్స్ 0.62శాతం క్షీణించింది. క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 2.50శాతం ర్యాలీతీసింది. అలాగే పూనావాల్లా ఫిన్‌కార్ప్ కూడా 1.47శాతంపెరిగితే జెటిఎల్ ఇండస్ట్రీస్ 1.90శాతం దిగజారింది. ఫోర్స్ మోటార్స్ 2.75శాతం క్షీణించింది. ఇక ఐపిఒలపరంగా మొదటిరోజు వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ తొలిరోజు 34,08,876 షేర్లకు బిడ్లు స్వీకరించింది. టాటాక్యాపిటల్‌కూడా 12,79,92,332 షేర్లకు బిడ్లు స్వీకరించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14